ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
4-7-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 153 పేజీలు: 12 వెల: 6.50

కొవిడ్ టీకాపై ఆందోళన వద్దు: ఎయిమ్స్ 9లో

హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం: నెతన్యాహు

# 'బనకచర్ల'తో నష్టం లేదు..

## ఆంధ్ర, తెలంగాణ 200 టిఎంసిల నీరు వాడుకోవచ్చు

### తెలంగాణ ప్రాజెక్టులకు ఎప్పుడూ అడ్డు చెప్పలేదు

### కమీషన్లు కొట్టినవాళ్లు రైతుల గురించి మాట్లాడడమా?

### పేదరిక నిర్మూలనకే పి-4: సిఎం చంద్రబాబు


గురువారం కుప్పంలో మీడియాతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**కుప్పం, జులై 3 ప్రభాతవార్త :** రెండువేల టిఎంసిల నీళ్లు సముద్రం పాలవుతున్నపుడు కేవలం రెండువందల టిఎంసిల నీటిని వాడుకునేందుకు గాను బనకచర్ల ప్రాజెక్టుతో ఎవరికీ ఎలాంటి నష్టం లేదని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. గురువారం కుప్పం నియోజకవర్గం శివపురంలోని తన స్వగృహంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బనకచర్లపై ఎవరెవరో ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మిస్తే ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలు 200టిఎంసిల వంతున నీటిని వాడుకోవచ్చన్నారు. సమైకా ్యంధ్రలో తన హయాంలోనే దేవాదుల లిఫ్ట్ఇరిగేషన్ ప్రాజెక్టు పెట్టామన్నారు. పుష్కర, తాడిపూడి ప్రాజెక్టులు తెచ్చామన్నారు. వైఎస్ సిఎంగా ఉన్నపుడు ఎల్లంపల్లి ప్రాజెక్టు అన్నారని అయితే రాలేదన్నారు. తాను ఏనాడూ తెలంగాణా ప్రాజెక్టులకు అడ్డు చెప్పలేదని చెప్పేది కూడా లేదని సిఎం పేర్కొన్నారు.

**మామిడి రైతులగురించి కేంద్రంతో మాట్లాడా :** కమీషన్లు కొట్టేసిన వారు నేడు రైతుల గురించి మాట్లాడుతున్నారని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఈసారి మామిడి దిగుబడి అధికంగా వచ్చిందని అలాగే అంతర్జాతీయ మార్కెట్లో ధరలు లేవన్నారు. మామిడి రైతులకు రాయితీ కింద 250కోట్లు ఇస్తున్నామన్నారు. మామిడి రైతుల విషయంగా కేంద్ర ప్రభుత్వంతో సైతం చర్చించామన్నారు. మామిడి రైతులకు రాయితీతో కవర్లు సైతం అందించామన్నారు. ఏమీచేయక శవరాజకీయాలు చేసేవారు చిత్తూరు జిల్లా రైతులకు ఒక్క రూపాయి ఇచ్చారా? అని ప్రశ్నించారు. 3950 కోట్లతో రైతులసౌకర్యార్థం హంద్రీ-నీవా ప్రాజెక్టుకు చర్యలు చేపట్టామన్నారు. రైతులకు బిందు సేద్యానికి 90శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 14వేలు, కేంద్రం 6వేలు ఇస్తోందన్నారు. తమది బాధ్యత గల ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో అనేక ఇబ్బందులను అధిగమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం ఇచ్చామన్నారు. 64లక్షల మందికి ప్రతినెలా 1వతేదినే 34వేల కోట్లరూపాయలు పెన్షన్లరూపంలో అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 5 ఏళ్లలో 250రూపాయల పెన్షన్ పెంచడం గొప్పా? అని ప్రశ్నించారు. నాడు వాలంటీర్లు లేకుంటే పింఛన్లు ఇవ్వలేం అన్నారు. నేడు సవ్యంగా పంపిణీ జరుగుతోందన్నారు. పెన్షన్లలో అనర్హుల్నితీసేస్తే గొడవ చేస్తున్నారన్నారు.

**రాష్ట్ర ఆదాయం.. వనరుల్ని కొల్లగొట్టారు**

ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో రాష్ట్ర ఆదాయం, వనరుల్ని కొల్లగొట్టారని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న భూముల రికార్డులు తారుమారు చేశారన్నారు. నేడు >>2



## ప్రధాని మోడీకి 'ఘనా' మేటి పురస్కారం

### అత్యున్నత జాతీయ అవార్డు అందించిన అధ్యక్షుడు మహామా

**అక్రా,(ఘనా),జులై3 :** భారత ప్రధాని నరేంద్ర మోడీ తన విదేశీ పర్యటనలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. ఆయన విశిష్ట రాజనీతిజ్ఞతకు, ప్రపంచవ్యాప్తంగా ప్రభావవంతమైన నాయకత్వానికి గుర్తింపుగా పశ్చిమ ఆఫ్రికా దేశమైన ఘనా తమ దేశ అత్యున్నత జాతీయ పురస్కారం 'ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా'తో సత్కరించింది. ఘనా రాజధాని అక్రాలో జరిగిన కార్యక్రమంలో ఆ దేశ అధ్యక్షుడు జాన్ డ్రమాని మహామ స్వయంగా ఈ అవార్డును ప్రధాని మోడీకి అందజేశారు. ఈ గౌరవం పట్ల ప్రధాని మోడీహర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారాన్ని తాను 140 కోట్ల మంది భారతీయుల తరపున స్వీకరిస్తున్నానని తెలిపారు. భారత యువత ఆకాంక్షలకు, దేశ సాంస్కృతిక వైవిధ్యానికి, అలాగే భారత్ ఘనా మధ్య ఉన్న చారిత్రక బంధానికి ఈ పురస్కారాన్ని అంకితం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రత్యేక గౌరవం అందించినందుకు ఘనా ప్రభుత్వానికి, ప్రజలకు ప్రధాని కృతజ్ఞతలు తెలియజేశారు. ఘనా అత్యున్నత పురస్కారం అందుకోవడం గౌరవంగా ఉంది. ఇది భారత్‌ఘనా మధ్య ఉన్న బలమైన, చిరకాల సంబంధాలకు నిదర్శనమని ప్రధాని మోడీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ప్రధాని మోడీకి ఈ పురస్కారం లభించడంపై భారత విదేశాంగ శాఖ కూడా స్పందించింది. గ్లోబల్ సౌత్ దేశాల వాణిని బలోపేతం చేయడానికి మోడీ చేస్తున్న >>2

**మాదేశంలో 2500 రాజకీయ పార్టీలున్నాయి..**
**ఘనా పార్లమెంటులో ప్రధాని మోడీ** 2లో

## కోటిపల్లి రైల్వే లైన్ భూ సేకరణపై స్టే తొలగింపు

**విజయవాడ, జులై3, ప్రభాతవార్తప్రతినిధి:** కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ భూసేకరణపై దాఖలైన పిటిషన్లపై అమలులో ఉన్న స్టే ఉత్తర్వులను హైకోర్టుఎత్తివేసింది. రీ అలైన్‌మెంట్‌కు సంబంధించి సర్వే చేసేందుకు అధికారులకు వెసులుబాటు కల్పించింది. సాధ్యమైనంత త్వరగా సర్వే పూర్తిచేసి ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లాలని రైల్వే అధికారులను ఆదేశించింది. రైల్వేలైన్ రీఅలైన్‌మెంట్ ద్వారా ఎవరైనా రాజకీయ నాయకులు, బడా వ్యక్తులు లబ్ధిపొందుతున్నారా? అనే విషయాన్ని కూడా పరిశీలించాలని అధికారులకు సూచించింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది.రాజకీయ నాయకులు, పెట్టుబడుదారుల లబ్ధి కోసం కోనసీమజిల్లా, అమలాపురం సమీపంలోని భట్నవిల్లి గుడిమెల్లంక మధ్య కోటిపల్లి నరసాపురం రైల్వేలైన్ అలైన్‌మెంట్ మారుస్తున్నారని, ముందుగా నిర్ణయించిన అలైన్‌మెంట్ ప్రకారం ట్రాక్ నిర్మాణం చేపట్టేలాఆదేశాలు ఇవ్వాలని >>2


తీవ్రవాదుల నుంచి స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలను చూపుతున్న కర్నూల్ డీఐజీ కోయ ప్రవీణ్, అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

## ఇద్దరు టెర్రిస్టుల ఇళ్లలో భారీగా పేలుడు పదార్థాలు

### రాయచోటిలో స్వాధీనం చేసుకున్న పోలీసులు

### దేశవ్యాప్తంగా జరిగిన పేలుళ్లలో 5 కేసులు

### ఆ ఇద్దరికి 'అల్ ఉమా' ఉగ్ర సంస్థతోనూ సంబంధాలు

### కర్నూలు డిఐజి కోయి ప్రవీణ్ వెల్లడి

**రాజంపేట, జులై 3 ప్రభాతవార్త :** తమిళనాడు యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ మూడు రోజుల క్రితం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో అరెస్టు చేసిన ఇద్దరు తీవ్రవాదుల ఇళ్లలో భారీ ఎత్తున ప్రాణ నష్టం చేకూర్చే విస్ఫూటక పేలుడు పదార్థాలు, టిన్‌బాంబులు, సూట్‌కేస్ బాంబులతోపాటు అత్యంత భారీ పేలుళ్లకు అమర్చే అధ్యాధునిక ఐఇడి పరికరాలు ఉన్నట్లు కర్నూలు డిఐజి కోయ ప్రవీణ్ వెల్లడించారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉగ్రవాదుల ఇళ్లలో స్వాధీనం చేసుకున్న >>2

## నిర్దిష్ట ప్రణాళికతో నీటి ప్రాజెక్టులు పూర్తి

### • పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను గాడిన పెడుతున్నాం • గత ప్రభుత్వం ఉత్తరాంధ్రకు తీరని ద్రోహం చేసింది: మంత్రి నిమ్మల రామానాయుడు


గురువారం ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,జులై3,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటి నిర్దిష్ట కార్యచరణ ప్రణాళికను అనుసరించి పూర్తి చేస్తామని ఎపి జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఉత్తరాంధ్ర ప్రజలకు సాగు, మంచినీరందించే పెండింగ్ ప్రాజెక్టులను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నామన్నారు. గురువారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, ఆయా ప్రాజెక్టుల సిఇలు, ఎస్ఇలు ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. గత ఐదేళ్లఉత్తరాంధ్ర ప్రాజెక్టులను వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి నిమ్మల ఆరోపించారు. వంశధార నాగావళి, నాగావళి, చంపావతి అనుసంధానం బ్యాలెన్స్ పనులపై సమీక్షించారు.

హీరమండలం లిఫ్ట్, మద్దువలస స్టేజ్2, జంజ్యావతి రిజర్వాయర్ పనుల వేగవంతంపై చర్చించారు. జైకా నిధులతో నత్తనడకన సాగుతూ నిలిచిపోయిన ఆంధ్ర రిజర్వాయర్, రైవాడ, పెద్దంకలం, పెద్దగడ్డ, వట్టిగెడ్డ పూర్తిచేయడానికి ఉన్న అవాంతరాలపై సమీక్షలో చర్చించారు. 90శాతం పనులు పూర్తైన వంశధార స్టేజ్2, ఫేజ్2 మరియు తోటపల్లి బ్యారేజ్ పనులను గత ప్రభుత్వం గాలికొదిలేయడం దుర్మార్గమన్నారు. వైకాపా గడిచిన ఐదేళ్లలో ఉత్తరాంధ్రకు చేసిన ద్రోహం అంతా ఇంతా కాదన్నారు. వంశధార నాగావళి మరియు నాగావళిచంపావతి అనుసంధానం బ్యాలెన్స్ పనులపై మంత్రి సమీక్షించారు. ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. హీరమండలం లిఫ్ట్, మద్దువలస స్టేజ్ 2, జంజావతి రిజర్వాయర్ పనులు >>2

## చెవిరెడ్డి మోహిత్‌కు హైకోర్టులో చుక్కెదురు

### అరెస్టునుంచి రక్షణ కల్పించేందుకు నిరాకరణ

**విజయవాడ, జులై3, ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో నిందితుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేందుకు న్యాయస్థానం నిరాకరించింది. తీవ్రమైన ఆరోపణలున్న ఇలాంటి కేసులో అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వలేమని తేల్చి చెప్పింది. పోలీసులు అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉంటే హైకోర్టులో ముందస్తు బెయిలు పిటీషన్ దాఖలు చేసుకోవాలని సూచించింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని, నిందితుల జాబితా నుంచి తన పేరును >>2


గురువారం న్యూఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘంతో భేటీ అయిన వైఎస్సార్సీ నేతలు

## బ్యాలట్‌తో ఎన్నికలు జరపండి

### కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరిన వైసిపి నేతలు

### చివరి గంటలో పోలింగ్ శాతంపై చర్చ

### బీహార్ తరహాలో ఎపిలో స్పెషల్ ఇంటెన్సివ్‌పై రివిజన్‌కు ఓకే


**విజయవాడ జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీ నేతల బృందం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసింది. ఈ సందర్భంగా గతంలో ఇవిఎంల పనితీరుపై ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్సీ బృందం ఫిర్యాదు చేసింది. దీంతో ఈ అంశాలపై వివరణ ఇచ్చేందుకు వైఎస్సార్సీ ఇసి ఆహ్వానించింది. దీంతో, ఇసి దృష్టికి పలు కీలక అంశాలను తీసుకెళ్లినట్టు తెలిపారు. వైఎస్సార్సీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి వైఎస్సార్సీ లోక్‌సభ పక్ష నేత మిథున్ రెడ్డి మాజీ ఎంపీబెల్లాన్న చంద్రశేఖర్ , పార్టీ నేత లోకేశ్ రెడ్డిల బృందం గురువారం ఉదయం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘంతో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా గత ఎన్నికల్లో చివరి గంటల్లో అకస్మాత్తుగా పోలింగ్ శాతంగ పెరగడం, అసాధారణంగా ఓటర్లు పెరగడం తదితర అంశాలను ఈసీ దృష్టికి నేతల బృందం తీసుకెళ్లింది.

ఇవిఎంల పనితీరుపై ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఫిర్యాదులపై వివరణ ఇచ్చేందుకు వైఎస్సార్సీ బృందాన్ని ఇసి ఆహ్వానించింది. దీంతో ఇసితో పార్టీ నేతలు చర్చించారు. ఈ సమావేశం అనంతరం ఎంపీ మిధున్‌రెడ్డి, మాజీ ఎంపి బెల్లాన్న చంద్రశేఖర్‌లతో కలిసి వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ఈవీఎంలకు సంబంధించిన టెక్నికల్ అంశాలు, కొన్ని పోలింగ్ బూత్‌ల్లో చోటుచేసుకున్న అసంబద్ధ విషయాలను ఎన్నికల సంఘంకు గతంలో ఫిర్యాదు చేశాం. వీటిపై మా సందేహాలకు వివరణ ఇచ్చేందుకు ఎన్నికల సంఘం సమావేశం ఏర్పాటు చేసి, ఆహ్వానించింది. ఈ మేరకు సమావేశంలో ఓటర్ లిస్టు పెరుగుదల, ఇవిఎం టెక్నికాలిటీస్, పోలింగ్ సరళి >>2

## టిటిడి నకిలీ నెయ్యి కేసు

## ముగ్గురు నిందితులకు బెయిలు మంజూరు

### దర్యాప్తునకు సహకరించాలని ఆదేశించిన హైకోర్టు



**విజయవాడ,జులై3,ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి నకిలీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో బోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పోమిల్ జైన్ (ఏ3), విపిన్ జైన్ (ఏ4), వైష్ణవి డెయిరీ సిఇఒ అపూర్వ వినయ్ కాంత్ చావడా (ఏ5)లకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దర్యాప్తుకు సహకరించాలని, దర్యాప్తు అధికారి కోరినప్పుడు విచారణకు హాజరుకావాలని పిటిషనర్లకు న్యాయస్థానం స్పష్టం చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానానికి (టిటిడి)నకిలీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో ఈ ముగ్గురుకూడా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ క్రమంలో బెయిల్ మంజూరు చేయాల్సిందిగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా.. ఇటీవల వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి.ఈరోజు పిటిషనర్లకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమల శ్రీవారి లడ్డు తయారీకి ఉపయోగించే కల్తీ నెయ్యి కేసులో నిందితులకు బెయిల్ ఇచ్చిన తరువాత న్యాయమూర్తి జస్టిస్ కె శ్రీనివాస్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టిటిడికి నకిలీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో బోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పోమిల్ జైన్ (ఏ3), విపిన్ జైన్ (ఏ4), వైష్ణవి డెయిరీ సీఈవో అపూర్వ వినయ్ కాంత్ చావడా (ఏ5) లకు హైకోర్టు బెయిల్ >>2

## విద్యార్థులకు రవాణా ఖర్చులు

### మూడునెలలకోసారి జమ

**విజయవాడ,జులై 3,ప్రభాతవార్త ప్రతినిధి:** ఇళ్ళకు దూరంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రవాణా చార్జీలు చెల్లించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. విద్యాహక్కు చట్టం ప్రకారం 1-8 తరగతుల విద్యార్థులకు పాఠశాల తప్పనిసరిగా నిర్ణీత దూరంలో ఉండాలి. బడి దూరంగా ఉంటే పిల్లలు వెళ్ళి, వచ్చేందుకు రవాణా ఛార్జీలు చెల్లించాలి. ఈ రవాణా ఛార్జీల్లో కేంద్రం 60% ఇస్తే రాష్ట్రప్రభుత్వం 40% భరించాలి. 2025-26 విద్యాసంవత్సరానికి ఇప్పటికే కేంద్రం ఏడాది మూడు నెలలకోసారి రవాణా ఛార్జీలను తల్లిదండ్రులబ్యాంకు ఖాతాల్లో జమచేయాలని భావిస్తున్నట్లు సమగ్ర శిక్షాభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు >>2



## తొక్కిసలాట ఘటనపై తుది నివేదిక సిద్ధం!

### జస్టిస్ సత్యనారాయణ మూర్తి రెండు రోజులుగా తిరుపతిలో బిజీబిజీ

**తిరుపతి, జులై 3ప్రభాతవార్తప్రతినిధి:** సరిగ్గా ఏడునెలల క్రిందట తిరుపతిలో జరిగిన తిరుమల భక్తుల తొక్కిసలాట ఘటనకేసులో బాధ్యులపై చర్యలకు నియామకమైన జస్టిస్ సత్యనారాయణమూర్తి కమిటీ తుది నివేదికలు సమర్పించేందుకు సిద్ధమవుతోంది. గత రెండురోజులుగా జస్టిస్ సత్యనారాయణమూర్తి తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లోని ప్రత్యేక ఛాంబర్‌లో బిజీగా సమగ్రసమాచారం సిద్ధం చేస్తున్నారు.నివేదికలు ప్రభుత్వానికి అందితే చివరగా ఇంకెందరిపై వేటుపడతుందనేది మళ్ళీ భయంగొల్పిస్తోంది. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలు కల్పించే సమయంలో ఈ ఏడాది జనవరి8వతేదీ రాత్రి తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన చోటుచేసుకున్న విషయం విదిమతే. ఈ ఘటనలో ఎనిమిది మంది యాత్రికులు ప్రాణాలు >>2

04-07pg2exHMNWJQE.qxd:04-07pg2exHMNWJQE.qxd 01/01/01 8:45 AM Page 1






తీవ్రవాదుల నుంచి స్వాధీనం చేసుకున్న ఐఇడి పేలుడు పరికరాలు, మారణాయుధాలు

# పేలుడు పదార్థాలు

>> పేలుడు పదార్థాలు దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల మ్యాపులు ,పేలుడు పదార్థాలకు తయారీకి ఉపయోగించే పరికరాలు, పెట్రోల్ గ్యాస్ బాంబుల తయారీకి వాడే పేలుడు పదార్థాలను మీడియాకు ప్రదర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నమయ్య ఎస్పీ విద్యాసాగర్‌తో కలిసి డిఐజి మాట్లాడుతూ 2025 జూన్ 30న తమిళనాడు పోలీసులు పలు బాంబు పేలుళ్ల కేసుల్లో నిందితులైన జాకీర్ చేసిన అరెస్ట్ వారెంట్లను అమలు చేశామన్నారు. ఈ నిందితులు 1999 నుండి పరారీలో ఉండగా, వారు గత 20 సం.గా రాయచోటి పట్టణంలో తప్పుడు పేర్లతో అబూ బకర్ సిద్దిక్ - అమానుల్లా పేరుతో, మహమ్మద్ అలీ-మంసూర్ పేరుతో నివసిస్తున్నారన్నారు. ఈ ఇద్దరు ఉగ్రవాదులకు తమిళనాడుతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన పేలుళ్లకు సంబంధించి ఐదు కేసులు నమోదయి ఉన్నాయన్నారు. ఈ ఇద్దరు ఉగ్రవాదులు అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ అల్ ఉమాతో సంబంధాలు ఉన్నాయని తెలిపారు. వీరి ఇళ్లలో శోధాలు చేసినప్పుడు భారీ మొత్తంలో విస్ఫోటక పదార్థాలు లభించాయన్నారు.,

వీటిని ఉపయోగించి పేలుడు పరికరాలు ఐఇడి తయారు చేయవచ్చన్నారు. ఈ పదార్థాలు భారతదేశ పౌరుల ప్రాణాలకు తీవ్ర ప్రమాదాన్ని కలిగించే స్థాయిలో ఉన్నాయని అన్నారు. ఉగ్రవాదుల అరెస్ట్‌తో దేశ స్థాయిలో ప్రమాదం నివారించబడిందన్నారు అబూ బకర్ సిద్దిక్ అమానుల్లా మరియు మహమ్మద్ అలీ మంసూర్ అనే ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన ఈ సామగ్రిని పోలీస్ బృందం స్వాధీనం చేసుకున్నారు. వీరు "అల్ ఉమ్మా" అనే తీవ్రవాద సంస్థతో అనుబంధం కలిగినవారిగా గుర్తించామన్నారు.ఉగ్రవాదుల ఇళ్లలో ఫ్యుయల్ ఆయిల్‌తో కలిపిన అమ్మోనియం నైట్రేట్, ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోసివ్స్ ఎక్స్‌ప్లోసివ్, టిఎన్‌టి నిండి ఉండే బాంబు - 20 కేజీల సూట్ కేసులో, మరొక సూట్ కేసులో ఐఇడి అయ్యి ఉండవచ్చన్నారు, ట్రైమర్ కోసం గడియార యంత్రాలు,ఫుల్ స్విచ్‌లు, ప్రెషర్ స్విచ్‌లు,స్పీడ్ కంట్రోలర్లు,గ్యాస్ ట్యూబ్ అరెస్టర్లు, పేలుళ్ల సమయంలో గాయాలకు ఉపయోగించే బాల్ బేరింగ్స్, నట్‌బోల్ట్‌లు, మానిటరింగ్ కోసం బైనాక్యులర్స్,వాకీటాకీలు, రేడియో పరికరాలు, అనేక మొబైల్ ఫోన్లు, అనేక చెక్ పుస్తకాలు, ఆర్థిక లావాదేవీల సమాచారం, డిజిటల్ స్టోరేజ్ పరికరాలు, ముస్లిం తీవ్రవాద సాహిత్యం, భారతదేశంలోని నగరాల మ్యాపులు,ట్రైనింగ్ సర్క్యూట్లు, మాన్యువల్స్, కోడింగ్ బుక్స్, ఆస్తి మరియు ప్రయాణ పత్రాలు, హ్యాకింగ్ సాఫ్ట్‌వేర్‌లు లభ్యమైనట్టు తెలిపారు. ఉగ్రవాదుల ఇళ్లలో శోధించేసందర్భంగా, నిందితుల భార్యలు ఆయిన సైరా భాను (అబూ బకర్ సిద్దిక్ భార్య), షేక్ షమీం (మహమ్మద్ అలీ భార్యలు) పోలీసులపై ప్రతిఘటన చేయడమే కాకుండా మహిళా పోలీసులపై దాడికి యత్నించారన్నారు.. పోలీసుల నిరంతర క్రమంతో ఇంటిని శోధించి పై విస్ఫోటక సామగ్రిని స్వాధీనం చేసుకున్నారన్నారు.ఈ ఘటనపై రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సైరా భాను షమీంలను కోర్టుకు హాజరుపరిచారు. మహిళా పోలీసులపై దాడికి ప్రయత్నించినందుకు అరెస్ట్ చేసి కడప సెంట్రల్ జైలుకు రిమాండ్ కు పంపారు. వీరికి నిందితుల ఉగ్రవాదుల్లో ఎంత సంబంధముందో అనే దానిపై దర్యాప్తు కొనసాగుతుందన్నారు. నిందితులు జరిగింలో సామూహికదాడులు, ఉగ్రవాద చట్టాలప్రకారం కేసులు నమోదయ్యాయి. బాంబు అమరిక, పాంప్లెట్‌లతో కలిసి పోలీస్ కమిషనర్ కార్యాలయం వద్ద బాంబు ఉంచడం ఈ కేసులు జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగించే ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించినవిగా నమోదయ్యాయి. ఎగ్మోర్ ఘటన రోజు అనేక ఇతర బాంబులు కూడా వివిధ ప్రాంతాలలో (చెన్నై, త్రిచ్చి, కోయంబత్తూరులో) పేలుళ్లు జరిగాయన్నారు.1999లో కోవేన్‌పర్ల ఎక్స్‌ప్రెస్‌లో ఈ నిందితులు పేలుడు పదార్థాలను ఆక్రమంగా తరలించబోతుండగా, ఆ ట్రైన్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. అవి కాసరగోడ్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇద్దరు నిందితులు గత 20 సంవత్సరాలుగా రాయచోటి పట్టణంలో తప్పుడు గుర్తింపులతో నివసిస్తూ, స్థానికంగా వివాహాలు చేసుకుని చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఉన్నారు. అన్నమయ్య జిల్లా పోలీసుల చొరవతో ఒక పెద్ద ఉగ్ర కుట్రను భగ్నం చేయడంలో విజయం సాధించారనీ వివరించారు. ఈ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించడంలో రాజంపేట, మదనపల్లి, రాయచోటి సబ్ డివిజన్ పోలీసు అధికారులు. ఎస్బి సీఐ, సీఐ రాయచోటి అర్బన్ సీఐ రాయచోటి రూరల్ సీఐ సైబర్ సెల్ ఆర్ఐ సైబర్ సెల్ స్పెషల్ బ్రాంచ్ సిసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



గురువారం అక్రాలోని ఘనా పార్లమెంటులో ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ

# ప్రధాని మోడీకి 'ఘనా' మేటి పురస్కారం

>> నిరంతర కృషికి లభించిన గుర్తింపు ఇదని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ఘనాతో మన స్నేహానికి, సహకారానికి ఇది నిదర్శనమని ఆయన 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. ఈ పురస్కారం ఇరు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేస్తుందని, ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లేందుకు తనపై కొత్త బాధ్యతను పెంచిందని ప్రధాని మోడీ పేర్కొన్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోడీమొదటగా ఘనా చేరుకున్నారు. గత మూడు దశాబ్దాల కాలంలో ఒక భారత ప్రధాని ఘనాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోడీ, ఘనా అధ్యక్షుడు మహామ మధ్య విస్తృత స్థాయి చర్చలు జరిగాయి. అనంతరం ఇరు దేశాలు తమ సంబంధాలను 'సమగ్ర భాగస్వామ్య' స్థాయికి పెంచుకుంటున్నట్లు ప్రకటించాయి. తన చారిత్రక పర్యటన భారత్‌ఘనా సంబంధాలకు కొత్త ఊపునిస్తుందని ప్రధాని మోడీవిశ్వాసం వ్యక్తం చేశారు.

# మాదేశంలో 2500 రాజకీయ పార్టీలున్నాయి..

**ఆక్రా(ఘనా),జులై 3:** భారత్‌లో 2500కిపైగా రాజకీయ పార్టీలున్నాయని భారత్‌లోని మారాష్ట్రాలను వివిధ పార్టీలు పాలిస్తున్నాయని చెపుతూ 22 అధికారిక భాషలున్నాయని చెప్పారు. ఘనాదేశ పార్లమెంటులో సభ్యులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఇక దేశంలో విదేశీభాషలు వేలాదిగా ఉన్నాయని, భారత్‌కు వచ్చే పర్యాటకులను విశాలహృదయంతో స్వాగతించడానికి ఈ భిన్నత్వమే కారణమని ఆస్ఫూర్తివల్లనే భారతీయులు ఎక్కడికి వెళ్లినా అక్కడి ప్రజలతో సులభంగా మమేకం అవుతున్నారని చెప్పారు.రాజకీయపార్టీల సంఖ్యను చెప్పినవెంటనే ప్రధానిమోడీ వ్యాఖ్యలకు ఘనా పార్లమెంటు సభ్యులు మొత్తం విస్తుపోయారు. ప్రపంచంలోనే అతిపెద్దప్రజాస్వామ్య దేశప్రతినిధిగా 140 కోట్లమంది భారతీయుల శుభాకాంక్షలు మీకు నావెంట తెచ్చానని, ఘనా దేశ పురస్కారాన్ని అందుకోవడం గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. రెండుదేశాల సంబంధాలకు ఈ పురస్కారాన్ని అంకితం ఇస్తున్నట్లు తెలిపారు. మాకు ప్రజాస్వామ్యం ఒక వ్యవస్థ మాత్రమే కాదని, ప్రాథమిక విలువల్లో అదిభాగమని, రెండోప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన ప్రపంచక్రమం వేగంగా మారుతోందని సాంకేతికతలో విప్లవం, గ్లోబల్‌సౌత్‌లో ఎదుగుదల ఈమార్పునకు దోహదంచేస్తున్నాయని, గ్లోబల్ సౌత్ గళం వినిపించకుండా ఈ అభివృద్ధి, పురోగతి సాధ్యంకాదన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధిచెందిన దేశంగా మార్చాలనిమా ప్రజలు సంకల్పంతో ఉన్నారని బలమైన భారత్, సుస్థిరమైన ప్రపంచానికి దోహదంచేస్తుందని ఆఫ్రికా అభివృద్ధి దిశగాచేసే ప్రయాణంలో మా సహాయాన్ని అందిస్తామన్నారు. మనదేశాల పురోగతికి పరస్పరం సహకరించుకుందామని ప్రధానిమోడీ పిలుపునిచ్చారు. జి20కి భారత్ సారథ్యం వహిస్తున్న తరుణంలోనే ఆగ్రూప్‌లో ఆఫ్రికా యూనియన్ శాశ్వత సభ్యత్వం పొందడం ఆనందకరమన్నారు. ఈ పర్యటనలోభాగంగా రెండుదేశాలమధ్య పరిశోధన అభివృద్ధి, ఔషధ ఉత్పత్తి సరఫరా తదితరరంగాలకు సంబంధించిన ఒప్పందాలు చేసుకున్నారు.

# నష్టం లేదు..

>> అత్యధికంగా తనకు భూసమస్యలపైనే వినతులు వస్తున్నాయన్నారు. ఏడాదిలోగా ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఒకప్పుడు ఎపిలో బ్రిటీష్ చట్టంకు లోబడి భూరికార్డులు బాగా ఉండేవన్నారు. తాను ఏనాడూ ఫేక్‌ఫెలోస్‌తో రాజకీయం చేయలేదన్నారు. ఇలాంటి వారు అబద్ధాల్ని నిజం చేయాలని చూస్తారన్నారు.నేడు ఫేక్‌ఫెలోస్ రాష్ట్రానికి పెనుసవాల్‌గా మారారన్నారు. ఇలాంటి వారి విషయంలో చట్టం తనపనితాను చేసుకుపోతుందన్నారు. కారుకింద పడ్డ సింగయ్యను ఆస్పత్రికి తరలించలేదన్నారు. పేదరికం లేని సమాజమే తన ధ్యేయం అని అందుకోసమే పి4 కార్యక్రమంను తీసుకొచ్చామన్నారు. 2029నాటికి జీరో పావర్టీ ఉండాలనే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. గతంలో జన్మభూమి కార్యక్రమం సైతం తీసుకొచ్చామని పేర్కొన్నారు. నేడు చిల్లిగవ్వ కూడా ఇవ్వనివారు పి4పై విమర్శలు చేస్తున్నారన్నారు. గతంలో తానుచేసిన ఆర్థికసాయంతో బాగా చదువుకున్న ఓ కుటుంబం తిమ్మరాజుపల్లిలో పేదలను ఆదుకునేందుకు ముందుకువచ్చిందనిగుర్తు చేశారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్ర మంను రాష్ట్రవ్యాప్తంగా చేపట్టామన్నారు.


# టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ వైద్య రంగంలో గేమ్ ఛేంజర్

## గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పంలో ఏర్పాటు

**కుప్పం, జులై 3 ప్రభాతవార్త :** వైద్య ఆరోగ్య రంగంలో టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ గేమ్ ఛేంజర్ అని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. గురువారం కుప్పం ఏరియా ఆస్పత్రిలో బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటైన టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ (డిఐఎన్‌సి)ను సిఎం చంద్రబాబునాయుడు పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఆధునిక సా ంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వైద్య ఖర్చులు తగ్గించేలా చూడాలని సూచించారు. బడ్జెట్‌లో వైద్య, ఆరోగ్య రంగాలకు 19వేల కోట్ల వ్యయం అవుతోందన్నారు. టెకా ్నలజీ వాడకంతో దీన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. డేటా లేక్,డేటా కలెక్షన్ ద్వారా వ్యక్తులకు అందించాల్సి న చికిత్సకు అవసరమైన ఔషధాలు కూడా అందించవచ్చన్నారు. ప్రివెంటివ్ హెల్త్, రియల్ టైం మానిటరింగ్ లాంటి అంశాలు పరిశీలించాలన్నారు. గర్భిణుల ఆరోగ్యాన్ని నిరంతరం తనిఖీ చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా ప్రతి మూడు నెలలకు రక్త పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. రెండో దశలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా డిఐఎన్‌సి సెంటర్‌ను అన్ని పిహెచ్‌సిలకు అనుసంధానిస్తామన్నారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. ఆయుష్మాన్ భారత్‌తో పాటు ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని సమన్వయం చేస్తామన్నారు.

**ప్రపంచానికే నమూనా డిఐఎన్‌సి కేంద్రం :**

కుప్పంలో అమలు చేస్తున్నడిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రపంచానికే నమూనాగా మారుతుందని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా వైద్య రంగంలో అత్యుత్తమ సా ంకేతికతను సమన్వయం చేస్తామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక పరిజ్ఞానాన్ని అనుసంధానిస్తామన్నారు. ఎఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కేంద్రాలను కూడా డిఐఎన్‌సి సెంటర్‌తో అనుసంధానం చేయాలని సిఎం ఆదేశించారు. వ్యక్తిగత వైద్య రికార్డుల ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉండేలా సేవలు అందించనున్నట్లు చెప్పారు. వర్చువల్ విధానంలో సైతం రోగికి వైద్య నిపుణుల్ని అందుబాటులో తీసుకువచ్చి చికిత్స అందించే వెసులుబాటు కలుగుతుందన్నారు. ఈసందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో రోగులు, వైద్యులతో మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ వైద్య సేవలు మెరుగుపరచుకునేందుకు సిఎం చంద్రబాబునాయుడు అద్భుతమైన అవకాశాన్ని ఇచ్చారన్నారు. వైద్య సేవలను డిజిటల్ నెర్వ్ సెంటర్‌తో అనుసంధానించే ఈకార్యక్రమం భవిష్యత్తులో చరిత్ర సృష్టిస్తుందన్నారు. రోగుల పట్ల ఆత్మీయంగా వ్యవహరిస్తూ ప్రత్యేక సేవలు అందించేందుకు ఈ కార్యక్రమం అవకాశం ఇస్తుందన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, సిఎం కార్యదర్శి ప్రద్యుమ్న, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబు, వైద్య, ఆరోగ్య శాఖ కమీషనర్ వీర పాండియన్, టాటా కన్సల్టెన్సీ ప్రతినిధులు, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, డిఎంహెచ్ఒ సుధారాణి పాల్గొన్నారు.



గురువారం మాజీ సిఎం జగన్‌తో భేటీ అయిన గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దంపతులు

# మాజీ సిఎం జగన్‌తో వంశీ దంపతుల భేటీ

**విజయవాడ, జులై3, ప్రభాతవార్తప్రతినిధి:** గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దంపతులు వైకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌ను తాడేపల్లి నివాసంలో గురువారం కలిశారు. నిన్న జైలు నుంచి బెయిల్‌పై వంశీ విడుదలయ్యారు. ఆయనపై కిడ్నాప్, బెదిరింపులు, గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి, నకిలీఇళ్లపట్టాలు, అక్రమ గనుల తవ్వకాలు వంటి ఆరోపణలతో 11 కేసులు నమోదయ్యాయి. ఆయనపై నమోదైన అన్ని కేసుల్లో బెయిల్ మంజూరు కావడంతో నిన్న జైలు నుంచి విడుదల య్యారు. ఆయన గురువారం నేరుగా కుటుంబ సభ్యులతో కలిసి మాజీ సిఎం వైఎస్ జగన్ నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. తనకు కష్టకాలంలో అండగా నిలిచినందుకు వైయస్ జగన్‌కు వల్లభనేని వంశీ దంపతులు ధన్యవాదాలు తెలిపారు. వంశీకి పార్టీ అన్నివేళల అండగా ఉంటుందని వైఎస్ జగన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. వంశీకి అన్ని విధాలుగా అండగా ఉన్న ఆయన సతీమణి పంకజశ్రీని జగన్ అభినందించారు.ఆరోగ్య విషయంలో తగిన శ్రద్ద దీసుకోవాలని వంశీకి జగన్ సూచించారు.తాను పార్టీ కార్యకలాపా లల్లో చురుగ్గానే పాల్గొంటానని జగన్‌కు వంశీ వెల్లడించారు.తనపై ఆరోపణలు,కేసులు చంద్ర బాబు ఆయన బృందం వత్తిడితో పోలీసులు పెట్టారని వంశీ వివరించారు.

# తుది నివేదిక సిద్ధం!

>> కోల్పోయిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఘోరతప్పిదాలకు ఇంకెందరు కారణమనేది తెలియాల్సి ఉంది. తొక్కిసలాటఘటనలో అప్పట్లో ఏకంగా తిరుపతిలోని బైరాగిపట్టెడ రామానాయుడు పాఠశాల కౌంటర్ల ప్రాంతంలో బందోబస్తు విధుల్లో ఉన్న తిరుపతి నగరక్రైమ్ డిఎస్పీ రమణకుమార్, టిటిడి ఎస్వీగోశాల డైరెక్టర్ హరనాథరెడ్డిని అదేరోజు సస్పెండ్ చేసిన విషయం విదితమే.ఐఏఎస్, ఐపిఎస్‌లను తక్షణం బదిలీ వేటుపడింది. ఆ తరువాత తిరుపతి నగర డిఎస్పీనికూడా ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ తొక్కిసలాటఘటనకు తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీకి ముందు తగిన జాగ్రత్తలు, ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించలేకపోవడమే కారణమని పలువురు క్షతగాత్రులైన బాధితులు స్విమ్స్,రుయా ఆస్పత్రుల్లో చికిత్స పొందిన సమయంలోనే సిఎం చంద్రబాబుకు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు టిటిడి ఆర్థికసాయం భారీ మొత్తంలో అందించింది. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తిని విచారణ కమిషన్ ఛైర్మన్‌గా నియమించింది. ఆయన నేతృత్వంలోని కొందరు సిబ్బంది ఏకంగా నాలుగునెలలు తిరుపతి జిల్లాకలెక్టరేట్‌లో ప్రత్యేక ఛాంబర్ నుండి విధులు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరచారి, అప్పటి జెఇఒ గౌతమి, సివిఎస్ఒ శ్రీదర్‌లను పలు దఫాలుగా విచారణ చేశారు. దీనిపై ప్రత్యేక నివేదిక రూపొందించారు. పూర్తిగా పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తొక్కిసలాట, ఆరుగురు ప్రాణీలు తీసిందనేది బాధితుల ఆరోపణలు.

# విద్యార్థులకు రవాణా ఖర్చులు

>> పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ ఈ ఏడాది సంస్కరణల్లో భాగంగా పాఠశాలల హేతుబద్దీకరణ చేసింది. తొమ్మిది రకాల బడులను తీసుకొచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 9,600 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసింది. ఇందుకోసం సమీపం లోని 3,4,5 తరగతులను ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు తరలించారు. కొన్ని చోట్ల విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో ప్రాథమికోన్నత బడుల స్థాయిని తగ్గించారు. దీంతో 6,7,8 తరగతుల విద్యార్థులు సమీపం లోని ఉన్నత పాఠశాలలకు వెళ్ళాల్సి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 79,860 మంది విదాఠ్యర్థులకు రవాణా ఛార్జీలను చెల్లించనున్నారు. 1-5 తరగతులు ఉండే ప్రాథమిక పాఠశాల ఆవాసానికి కిలోమీటరు కంటే ఎక్కువ దూరం ఉన్నా 6,7,8 తరగతుల పాఠశాలలు 3 కిలోమీటర్ల దూరం కంటే ఎక్కువ ఉన్నా ఒక్కో విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున రవాణా ఛార్జీలు చెల్లిస్తారు. గతంలో విద్యా సంవత్సరం ముగింపు సమయంలో ఒకేసారి రూ.6వేలు చెల్లించేవారు. ఈ సారి మూడు నెలలకో సారి చెల్లిస్తే విద్యార్థులు,వారి తల్లిదండ్రులకు ఉపయోగపడతాయని భావిస్తున్నారు.

# నీటి ప్రాజెక్టులు పూర్తి

>> వేగవంతంపై వివరాలు అడిగారు జైకా నిధులతో నత్తనడకన సాగుతూ నిలిచిపోయిన ఆంధ్ర రిజర్వాయర్, రైవాడ, పెద్దంకలం, పెద్దగడ్డ, వట్టిగెడ్డ, పూర్తిచేయడానికి ఉన్న అవాంతరాలపై ఆరా తీశారు వెలిగొండ ప్రాజెక్ట నిర్మాణంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా సొరంగాల్లో బెంచింగ్, లైనింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రెండో టన్నెల్‌లో ఉన్న టన్నెల్ బోరింగ్ మెషిన్ తొలగింపుకు కోర్టుకేసు అడ్డంకిగా ఉన్న నేపధ్యంలో మిషన్ విలువ నిర్ణయించేందుకు సాంకేతిక నిపుణుల కమిటీని నియమించామని తెలిపారు. ఫీడర్ కెనాల్, లైనింగ్, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి పాలనా పరమైన అనుమతులు రాగానే టెండర్లు పిలిచి పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు.ఇంక పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల్లో హైవే బ్రిడ్జి, పంపా ఆక్విడెక్ట్, కృష్ణవరం సైఫన్ వంటి క్లిష్టతర పనులు వేగవంతం చేయాలి అని అధికారులు, ఏజెన్సీలకు నిర్దేశించారు ముఖ్య మంత్రి సమీక్ష నాటికి ఏ ఏ పనులకు ఎంతెంత ప్రాధాన్యం ఇవ్వాలి.

ఎంత కాలంలో పూర్తి చేస్తారు, తదితర వివరాలతో సమగ్ర నివేదికలతో సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులకు, ఇంజనీర్లకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సి, నరసింహామూర్తి, ఆయా ప్రాజెక్టల సిఇలు, ఎస్ఇలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్టే తొలగింపు

>> కోరుతూ హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లు హైకోర్టులో విచారణకు వచ్చాయి. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సత్యప్రసాద్ వాదనలు వినిపించారు. ముందుగా ప్రతిపాదించినరైల్వేలైన్ అలైన్‌మెంట్‌ను మార్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్. ప్రణతి, రైలేశాఖ తరఫు న్యాయవాది రుద్ర ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. రైల్వే అలైన్‌మెంట్ మార్పు కోసం జిల్లా కలెక్టర్ ప్రతిపాదన చేశారని తెలిపారు. సర్వే నిర్వహణపై హైకోర్టు స్టే విధించడంతో ప్రక్రియ ముందుకు సాగలేదన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 04-07-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
నవమి సా. 4.32
చిత్త సా.4.50
వర్జ్యం రా.11.08-12.56
దు.ఉ.8.17-9.09, 2) మ.12.39-1.31
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**వృషభం :** టెంపరరిగా ఉన్న ఉద్యోగం పర్మినెంట్ అవుతుంది. రాజకీయరంగాల వారికి ప్రభుత్వరంగం నుండి ఆహ్వానాలు అందుతాయి.

**మిథునం:** సోదరుల నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు పొందు తారు.

**కర్కాటకం:** ప్రముఖుల నుండి వచ్చిన ఆహ్వానం ఆశ్చర్యపరుస్తుంది. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.

**సింహం:** పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకొంటారు.

**కన్య :** జీవిత భాగస్వామితో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**తుల :** ప్రముఖుల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి.సంతానం, విద్యా,ఉద్యోగావకాశాలు పొందుతారు.

**వృశ్చికం:** వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండటం మంచిది. సంతానం నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**ధనుస్సు:** ఉద్యోగులకు ఎదురైన చికాకులు కొంతవరకు తొలగుతాయి. కళా, సినిమా రంగాలవారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**మకరం:** సోదరుల నుండి వచ్చిన వార్తవల్ల ఆనందం కలుగుతుంది. పెట్టుబడులకు తగిన లాభాలు కష్టమే.

**కుంభం :** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**మీనం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటాయి. జీవిత భాగస్వామి నుండి సహాయ సహకారాలు అందుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# హైకోర్టులో చుక్కెదురు

>> తొలగించేలా ఆదేశించాలని మోహిత్ చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. పిటీషన్‌పై విచారణను ఈ నెల 9కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. మద్యం కుంభకోణం కేసులో సిఐడి పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుమారుడు తుడా మాజీ ఛైర్మన్ మోహిత్‌రెడ్డి(ఎ39)హైకోర్టులో క్వాష్ పిటీషన్ వేసిన విషయం తెలిసిందే. బుధవారం జరిగిన విచారణలో సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ...ఓ వైపు పిటీషనర్‌ను కేసులో నిందితుడిగా పేర్కొంటూ మరో వైపు సాక్షిగా విచారణకు హాజరుకావాలని దర్యాప్తు అధికారి(ఐఒ) నోటీసు ఇచ్చారన్నారు. ఇలాంటి చర్య సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు.

ఈ వాదనలపైన్యాయమూర్తి స్పందిస్తూ...దర్యాప్తులో భాగంగా వివరాలు తెలుసుకునేందుకు సాక్షిగా ముందు హాజరుకావాలని మోహిత్‌రెడ్డికి నోటీసు ఇచ్చే అధికారం ఐఒకు ఉందన్నారు. 'నందిని'సత్పతి' కేసులో సుప్రీం కోర్టు ఈ విషయాన్ని స్పష్టం చేసిందని గుర్తు చేశారు. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వలేమని వెల్లడించారు.

# బెయిలు మంజూరు

>>మంజూరుచేసింది. దర్యాప్తుకు సహకరించాలని, దర్యాప్తు అధికారి కోరినప్పుడు విచారణకు హాజరుకావాలని పిటిషనర్లకు న్యాయస్థానం స్పష్టం చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానానికి (టిటిడి)నకిలీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో ఈ ముగ్గురు కూడా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ క్రమంలో బెయిల్ మంజూరు చేయాల్సిందిగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా.. ఇటీవల వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి .. ఈరోజు పిటిషనర్లకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ ఉత్తర్వుల అనంతరం బెంచ్ మీదనే న్యాయమూర్తి జస్టిస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పల్నాడు జిల్లా రెంటపాల్లలో జగన్ పర్యటన సందర్భంగా ఆయన కారుకిందే పడి సింగయ్య అనే వృద్ధుడు మృతి చెందారు. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో జగన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో తనపై నమోదైన కేసులను కొట్టి వేయాలంటూ మాజీ సిఎం హైకోర్టును ఆశ్రయించారు. గత వారం సింగయ్య కేసులో జగన్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. దీంతో ఈ వ్యవహారంలో జస్టిస్ శ్రీనివాస్ రెడ్డిని సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు. ఈ ట్రోల్స్‌పై బెంచ్ మీదనే జస్టిస్ కె.శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. నన్ను గత రెండురోజులునుంచి సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు. సారీ స్టేట్ ఆఫ్ అఫ్ఫైర్స్ అంటూ వ్యాఖ్యానించారు. ఇప్పుడు కల్తీ నెయ్యి కేసులో నిందితులకు బెయిల్ ఉత్తర్వులు కూడా ట్రోల్స్‌కు బాగా పనికి వస్తాయంటూ జస్టిస్ శ్రీనివాస్ రెడ్డి కామెంట్స్ చేశారు. అలాగే వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి బెయిల్ కేసులను వచ్చే మంగళవారానికి న్యాయమూర్తి వాయిదా వేశారు. అంతేకాకుండా తన ముందున్న బెయిల్ కేసుల అన్నీ వచ్చే వారం వేరే బెంచ్ ముందు చూసుకోవాలని జస్టిస్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

# బ్యాలట్‌తో ఎన్నికలు జరపండి

>> తదితరంశాలపై చర్చలు జరిగాయి. ఏపీలోని కొన్ని నియోజకవర్గంలో ఈవీఎంల ఓట్లకు , వివి ప్యాట్ లతో పోల్చి చూడాలని కోరినా ఎన్నికల సంఘం స్పందించలేదు. నిబంధనల ప్రకారం డబ్బులు కట్టినా కూడా మ్యాచింగ్ చేయడానికి కౌంటింగ్ చేయడం లేదనే విషయంపై ఎన్నికల అధికారులను ప్రశ్నించాం. అలాగే ఈవీఎంలలో బ్యాటరీల పైన కూడా సందేహాలు ఉన్నాయి. పోలింగ్ పూర్తయ్యే సరికి బ్యారీల్లో 80 శాత చార్జింగ్ ఉంటే, నలబై రోజుల తరువాత కౌంటింగ్ సమయానికి దాదాపు 98 శాతం చార్జింగ్ ఉన్నట్లు గుర్తించాం. దీనిపైన కూడా విచారణ జరగాలని కోరాం. ఏపీలో సాయంత్రం 6 గంటల తర్వాత ఎక్కువ నియోజకవర్గాలలో పోలింగ్ శాతం పెరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4 కోట్ల ఓట్లలో దాదాపు 51 లక్షల ఓట్లు చివరి గంటలో పోలవ్వడం అనేక సందేహాలకు తావిస్తోంది. దీనిపై విచారణ జరపాలని కోరాం. అయితే ఎన్నికల సంఘం అధికారులు మాత్రం వివి ప్యాట్ ల కంపారిజన్ చేయడంకుదరదని తెగేసిచెప్పారు. బ్యాటరీ చార్జింగ్‌విషయంలో అవి రీచార్జ్‌బుల్ బ్యాటరీలు కావడం వల్ల చార్జింగ్ పెరగడం, తగ్గడం అంటూ జరగదని ఎన్నికల సంఘం అధికారులు వివరణ ఇచ్చారు. ఆరు తరువాత పోలింగ్ జరిగిన చోట్ల, ఎక్కువ శాతం పోలింగ్ నమోదైన ఘటనలపై డేటా తెప్పించుకుని పరిశీలిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అలాగే కొన్ని నియోజకవర్గాల్లో ఓట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. రాయచోటి నియోజకవర్గంను ఉదాహరణగా చూపించడం జరిగింది. దీనికి ఎన్నికల కమిషన్ సానుకూలంగా స్పందించింది. ఈ నియోజకవర్గం నుంచి డెటా తెప్పించుకుని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఓటర్ల పెంపుదలపై బీహార్ తరహాలో ఏపీలో కూడా స్పెషల్ ఇంటెన్సిఫై రివిజన్ చేయాలని కోరిన నేపథ్యంలో దానికి ఎన్నికల అధికారులు అంగీకరించారు.

హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం పోలింగ్ బూత్ నెంబర్ 157, 28వ పోలింగ్ బూత్ ల్లో అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు భిన్నమైన పోలింగ్ నమోదు అయ్యింది. 28 వ బూత్‌లో వైయస్ఆర్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థికి 472 ఓట్లు వస్తే, అసెంబ్లీ అభ్యర్థికి కేవలం 1 ఓటు మాత్రమే వచ్చింది. అలాగే రాష్ట్రంలో నామమాత్రంగా ప్రభావం చూపించే కాంగ్రెస్‌పార్టీకి చెందిన పార్లమెంట్ అభ్యర్థికి 1 ఓటు వస్తే, అసెంబ్లీ అభ్యర్థికి 464 ఓట్లు వచ్చాయి. అలాగే టిడిపికి పార్లమెంట్ అభ్యర్థికి 8 ఓట్లు వస్తే, అసెంబ్లీకి 95 ఓట్లు వచ్చాయి. ఈ ఓటింగ్ సరళిని గమనిస్తేనే అనేక సందేహాలు వ్యక్తమవుతు న్నాయి. వీటిపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరడంతో, దీనిపై డేటా తెప్పించుకుని పరిశీలిస్తామని ఇసి హామీఇచ్చింది. ఇటువంటి ఘటనల నేపథ్యంలో ఇవిఎంలపై అనుమానాలు ఉన్నాయని వివరించాం. అందుకే రాబోయే రోజుల్లో జాతీయ స్థాయిలో అన్ని ఎన్నికలు బ్యాలెట్ విధానంలో జరగాలని సూచించాం. అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో బ్యాలెట్ విధానం అమల్లో ఉంది. యూఎస్, జర్మన్, యూరోప్ దేశాల్లో బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు జరుగుతున్నాయి. కాబట్టి రాబోయే రోజుల్లో ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే, బ్యాలెట్ పేపర్ తో ఎన్నికలు జరగాలనేదే వైయస్ఆర్సీ ఉద్దేశమని వివరించాం. ఇప్పటికే మాజీ ఎంపి బెల్లాన్న చంద్రశేఖర్ తన నియోజకవర్గంలో వీవీప్యాట్‌లను లెక్కించా లని కోర్టులో కేసువేశారు. కానీ ఎన్నికలఅధికారులు మాక్ పోలింగ్ నిర్వహించి చేతులు దులుపుకున్నారు. వివి ప్యాట్‌లను లెక్కించేది లేదని చెబుతున్నారు. కనీసం సీసీ ఫుటేజీ అడిగినా ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. మా మార్గదర్శకాలు ఇలాగే ఉన్నాయని స్పష్టం చేస్తున్నారు. ఈఅనుమానాలను తొలగించేందుకు బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరపాలనికోరామని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి వెల్లడించారు.

VJA 3rd Pg3exHMNWJQEPR.qxd:04-07Pg3exHMNWJQEPR.qxd 01/01/01 9:24 AM Page 1






## రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలన లక్ష్యంగా అడుగులు : ఆకె రవికృష్ణ

**విజయవాడ,జులై 3,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి సరఫరా చేసిన అడ్డుకొని తీరుతామని ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ స్పష్టం చేశారు. గంజాయి సప్లై చేస్తున్న వారిని గుర్తించి ఆస్తులను అటాచ్ చేశామని పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి అమ్మినా, కొన్నా, సరఫరా చేసినా ఎవ్వరినీ వదిలి పెట్టమని రవికృష్ణ హెచ్చరించారు.ఏపీ డిజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు డ్రగ్స్ రవాణాపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లలో రైళ్ళలో ఈగల్,జీఆర్పీ,ఆర్పీఎఫ్ విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇతర రాష్ట్రాలకు కోరమాండల్ రైలులో తరలిస్తున్న గంజాయి చాక్లెట్లను, గంజాయినీ ఈగల్ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా రవి కృష్ణ మీడియాతో మాట్లాడారు. గంజాయి సాగుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగుచేయిస్తున్నామని చెప్పుకొచ్చారు.ఏపీలో ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి సరఫరా చేసినా అడ్డుకొని తీరుతామని ఆకే రవికృష్ణ స్పష్టం చేశారు. గంజాయి సప్లై చేస్తున్న వారిని గుర్తించి వారి ఆస్థులను అటాచ్ చేసామని పేర్కొన్నారు. డ్రగ్స్,గంజాయి అమ్మినా,కొన్నా,సప్లై చేసిన ఎవ్వరిని వదిలి పెట్టమని హెచ్చరించారు. గంజాయి,నిషేధిత డ్రగ్స్ సప్లై చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. రూ.21 వేల గంజాయిని ఆరు నెలల్లో పట్టుకున్నామని తెలిపారు. గంజాయిని రైళ్ళ ద్వారా ఇతర రాష్ట్రాకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించామని చెప్పుకొచ్చారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ, రైల్వే,ఈగల్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టిందని ఆకే రవి కృష్ణ వెల్లడించారు.

# పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి 'మీడియేషన్ ఫర్ ది నేషన్' క్యాంపైన్

### రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ బి.ఎస్.వి.హిమబిందు



**విజయవాడ,జూలై 3, ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలనే ఉద్దేశంతో సుప్రీం కోర్టు మీడియేషన్, కన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ ఈ నెల 1 వ తేదీ నుండి 90 రోజుల పాటు నిర్వహిస్తున్న దేశవ్యాప్త మధ్యవర్తిత్వ క్యాంపైన్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యారు సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ (డిస్ట్రిక్ట అండ్ సెషన్స్ జడ్జి) బి.ఎస్.వి.హిమబిందు విజ్ఞప్తి చేశారు. సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించేందుకు ఈ నెల 5 వ తేదీన నిర్వహించే 2 వ జాతీయ లోక్ అథాలత్ ను కూడా సద్వినియోగం చేసుకోవాలన ఆమె కోరారు. బుధవారం రాష్ట్ర సచివాలయం దగ్గర్లోనున్న రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ మీడియేషన్ ఫర్ ద నేషన్ క్యాంపైన్ మరియు లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీచేసుకుంటే ఇరు పక్షాలు విజయం సాధించినట్లే అన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు ఈ నెల 1 వ తేదీ నుండి సెప్టెంబర్ 30 వ తేదీ వరకు 90 రోజులపాటు దేశవ్యాప్తంగా మీడియేషన్ ఫర్ ద నేషన్ క్యాంపైన్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెలలో పరిష్కరించ దగ్గ కేసులను గుర్తించి, మధ్యవర్తిత్వం ద్వారా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందుకై మధ్యవర్తిత్వంలో శిక్షణ పొందిన దాదాపు 893 మంది విశ్రాంత న్యాయమూర్తులు, సమాజ సేవకులు మరియు న్యాయవాదులకు ఆయా కేసులను అప్పగించి, వారి మధ్యవర్తిత్వంలో పరిష్కారమైన కేసులకు కోర్టులో రాజీ మార్గంలో తీర్పు ఇవ్వడం జరుగుతుందన్నారు. సాధారణంగా ఏ కోర్టులో అయినా తీర్పు చెపితే, ఎవరో ఒకరు మాత్రమే విజయం సాధించే అవకాశం ఉంటుందని, దాని పైన అప్పీళ్లకు కూడా వెళ్ళే అవకాశం వుందని ఆమె తెలిపారు. అలా కాకుండా మధ్యవర్తిత్వం ద్వారా కానీ లేదా లోక్ అదాలత్ ద్వారా గాని పరిష్కరించుకున్నట్లైతే, కక్షిదారులు ఇరువురూ విజయం సాధిస్తారన్నారు. అదే విధంగా, జాతీయ న్యాయసేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు ఏడాదికి 3 నుండి 4 జాతీయ లోక్ అథాలత్ లను నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 5 వ తేదీన 2వ జాతీయ లోక్ అథాలత్ ను రాష్ట్రంలోని అన్ని న్యాయస్థానాల్లోనూ, హైకోర్టులోనూ మరియు విశాఖపట్నంలోని డెట్ రికవరీ ట్రిబ్యునల్ లోనూ ఈ అథాలత్ లను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ అథాలత్ తో వివాహ, ఆస్తి, సివిల్ తగాదాలు, మనీ సూట్లు, వాహన ప్రమాదాల ఇన్సూరెన్స్ కేసులు. చెక్ బౌన్స్ కేసులు రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను కూడా రాజీ చేసుకోవచ్చని ఆమె వివరించారు. హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ, 13 డిఎల్ఎస్ఏ లు మరియు 147 ఎంఎల్ఎస్ఏ లు గత కొద్ది కాలంగా కృషి చేసి లోక్ అదాలత్ లో రాజీపడ దగ్గ కేసులు మొత్తం 1,15,071 రాష్ట్రంలో ఉన్నట్లు గుర్తించడం జరిగిందని ఆమె తెలిపారు. లోక్ అదాలత్ లో కేసులు పరిష్కరించుకోవడంవల్ల కక్షిదారుల సమయం డబ్బు కూడా ఆదా అవుతుందని, మానవ సంబంధాలు మెరుగు పడతాయని ఆమె వివరించారు.

# జగన్ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బతీసింది: బిజెపి ఎంపి లక్ష్మణ్

**తిరుమల,జూలై 3ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో గత ఐదేళ్ళ వైసిపి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరుమల పుణ్యక్షేత్ర పవిత్రతను దెబ్బతీసిందని బిజెపి ఎంపి లక్ష్మణ్ ఆరోపించారు. దేవుని లడ్డూప్రసాదంలో జరిగిన నకిలీనెయ్యి కల్తీ భక్తులను ఆందోళనకు గురిచేసిందని అన్నారు. గత ప్రభుత్వంలో తిరుమలలో జరిగిన అవినీతి,అక్రమాలపై విచారణ జరపాలని సిఎం చంద్రబాబునాయుడుకు లేఖరాస్తానని ఆయన తెలిపారు.గతంలో ఉన్న టిటిడి పాలకమండళ్ళు భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడ్డాయని విమర్శించారు. గురువారం ఉదయం ఎంపి లక్ష్మణ్ కుటుంబం ,టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డితో కలసి తిరుమల ఆలయంలోనికి చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. శ్రీవారి ఆశీస్సులందుకున్న లక్ష్మణ్‌కు ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.


**IN THE COURT OF HONORABLE XIth ADDL DISTRICT JUDGE AT. GUDIVADA**

**E.P.No.37/2020 in Arb Case No.203/2016**

Between :

**SAKTHI FINANCE LIMITED**
Rep:by its Authorised Signatory
**MAKKE RAJASEKHAR** ....... DHR
**AND**
**KOLLI VIJAYA LAKSHMI**
and 3 others .... JDR's

**Substitute Service Notice**

**JDR No.3**
**KOLLI SRINIVASA RAO**, S/o. Chalapathi Rao, D.No. 16-71A, Velamapeta Colony, Kaikalur, Krishna Dist - 521333.

పై నెంబరు గల ఇ.పి.లో JDR No.3 అయిన మీకు పలుమార్లు నోటీసు పంపిననూ అందుకొనక కాలయాపన చేయుచున్నారు. కనుక శ్రీ కోర్టువారు మీకు రూల్-54 నోటీసు అందచేయు నిమిత్తం ఈ పేపరు ప్రకటన ద్వారా ది.21.07.2025 వాయిదాగా నిర్ణయించుచున్నామని ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.కావున ఆ రోజు ఉదయం 10.30ని॥లకు మీరు స్వయంగా గాని లేక న్యాయవాది ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపణలను తెలుపు కొనవలయునులేని యెడల శ్రీ కోర్టువారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

( శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)

వాయిదాతేది : 21.07.2025

ఇట్లు :
బి.క్రాంతి
యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ న్యాయవాదులు
గుడివాడ,సెల్:9963103456


# శ్రీవాణి దర్శన భక్తుల ఆరోపణలు బాధాకరం

**తిరుమల,జూలై 3ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి యాజమాన్యం ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్న దర్శన టిక్కెట్లలో శ్రీవాణిబ్రేక్ దర్శనాలు ఒకభాగం. ఈ టిక్కెట్ల జారీ తిరు మలలోని అదనపు ఇఒ క్యాంపు కార్యాలయం (గోకులం విశ్రాంతి భవనం) ప్రాంతంలోని కౌంటర్‌నుండి ప్రతిరోజూ ఉదయం 8.30 గంటల నుండి శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లు జారీ అవుతాయి. ఉదయం గంటముందు వస్తే కౌంటర్ వద్దకు భద్రత సిబ్బంది అను మతినిస్తారు. అయితే గురువారం మధ్యాహ్నం ముగ్గురు శ్రీవాణి బ్రేక్ దర్శనాల భక్తులు దర్శనానంతరం ఆలయం వెలుపల శ్రీవాణి టిక్కెట్ల జారీలో ఆలస్యమవుతోంద ని, గదులు కూడా మంచివి ఇవ్వడంలేదని ఆరోపణలు చేశారు. సహజంగానే తిరుమలలో శ్రీవాణి బ్రేక్ దర్శనాల (10,500 రూపాయలు)భక్తుల కు అందుబాటులో ఉన్న నందకం, వకుళమాత, కౌస్తుభం, వరాహస్వామి విశ్రాంతి భవనం ఇలా ఎక్కడ గదులు లభ్యత ఉంటే అక్కడ టిటిడి అధికారులు కేటాయిస్తారు. కానీ బుధవారం తిరుమలలో కొందరు భక్తులు శ్రీవాణి బ్రేక్ దర్శనాల టిక్కెట్ల కోసం నిర్దేశిత సమయం కంటే ముందే వేకువజామున 3.30గంటలకు కౌంటర్ వద్దకు వచ్చి నిరీక్షించారు. టిక్కెట్ కోసం వచ్చిన భక్తులు నిరీక్షించారని, కనీసం అన్నప్రసాదాలు, తాగునీరు. టీ ఇవ్వలేదని మీడియాకు వెల్లడించారు. అయితే టిటిడి సిబ్బంది ఈ టిక్కెట్ల కౌంటర్‌వద్ద వేచివుండే భక్తులకు కౌంటర్‌లు తెరిచే సమయానికి సకాలంలో సమయానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. గురు,శుక్ర,శని వారాల్లో భక్తుల రద్దీ కారణంగా విఐపి బ్రేక్ దర్శనాలు లేకపోవడంతో అధికసంఖ్యలో శ్రీవాణి దర్శనాల కోసం వస్తుంటారు. ముందువచ్చిన వారికి ముందు ప్రాతిపదికలో టిక్కెట్లు జారీచేస్తారు. అలాగే వీరికి టిబిసి గదిని కేటాయించారు. ఈ గదిలో పారిశుద్యం సరిగాలేదని, బొద్దింకలు ఉన్నాయని అపరిశుభ్రతపై ఆరోపణలుచేశారు. ఇవన్నీ వాస్తవాం కాదని, టిబిసి గదులు మరమ్మతులు చేసి పరిశుభ్రత పాటిస్తున్నట్లు టిటిడి తెలిపింది.

# బాలాజీ యాదవ్, నవీన్ కృష్ణలు గుంటూరు జిల్లా జైలుకు తరలింపు

**విజయవాడ,జులై 3,ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో అరెస్టు అయిన వైకాంగ్రెస్ పార్టీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి అనుచరులు బాలాజీకుమార్ యాదవ్ (ఎ-35),ఎద్దల నవీన్ కృష్ణలకు(ఎ-36) ఈ నెల 15 వరకు రిమాండు విధిస్తూ విజయవాడ ఎసిబి న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. వీరిని గుంటూరు జిల్లా జైలుకు తరలించాలని ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో వారిద్దరినీ పోలీసులు గుంటూరు జిల ఆ జైలుకు తరలించారు. అంతకు ముందు ఏసీబీ న్యాయ స్థానంలో సిట్,నిందితుల తరపు న్యాయవాదులు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆదేశాల మేరకు మద్యం ముడుపుల సొమ్ము తరలింపులో వీరిద్దరూ ప్రత్యక్షంగా పాల్గొన్నారని సిట్ తరపు న్యాయవాది, ప్రాసిక్యూషన్స్ జెడీ రాజేంద్రప్రసాద్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. సాధారణ ఎన్నికల సమయంలో తీసుకొచ్చిన ఈ ముడుపుల సొమ్మును వీరు ఎవరెవరికి చేర్చారనేది రాబట్టాల్సి ఉందని,అందుకే వారికి రిమాండు విధించాలని కోరారు. అనంతరం నిందితుల తరపున న్యాయవాది శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ,వీరికి అవినీతి నిరోధక చట్టం లోని సెక్షన్లు వర్తించవని, మిగతావి ఏడేళ్ళ లోపు జైలు శిక్ష పడే సెక్షన్లే కనుక రిమాండు అవసరం లేదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయాధికారి... నిందితులకు 14 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులిచ్చారు. మరో వైపు సిట్ అధికారులు తనను దూషించారని, తెల్ల కాగితంపై సంతకాలు చేయాలని బెదిరించారని బాలాజీ యాదవ్ న్యాయాధికారికి ఫిర్యాదు చేశారు.ఇప్పటి వరకు మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయిన తొమ్మిది మంది విజయవాడ కారాగారంలో ఉన్నారు. తాజాగా రిమాండుకు వెళ్ళిన ఇద్దరితో కలిసి అరెస్ట్ అయిన వారి సంఖ్య 11కు చేరింది.

కీలకమైన ఈ కేసులో ఒకే జైలులో ఇంత మందిని ఉంచడం క్షేమం కాదని భావించి బాలాజీ, నవీన్‌లను గుంటూరుకు తరలించారు.

# సీమాంధ్ర మీదుగా తిరిగే పలు రైళ్లు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే, జూలై 3,ప్రభాతవార్త** ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ రాయలసీమ జిల్లాల మీదుగా బెంగళూరు-బీదర్-బెంగళూరుల మధ్య ప్రస్తుతం నడుపుతున్న ప్రత్యేక బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను సెప్టెంబరు 1వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. బెంగళూరు నుంచి బీదర్ వెళ్లే నెంబర్ 06539ప్రత్యేక బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 4నుండి ఆగస్టు 31వరకు పొడిగించారు. బెంగళూరు-నారంగీ మధ్య తిరిగే ప్రత్యేక రైళ్లు ఈ నెల 19వరకు పొడిగింపు :- అలాగే బెంగళూరు నుంచి నారంగీ(గౌహతి) వెళ్లే నెంబర్ 06559ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 15వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో నారంగి నుంచి బెంగళూరు వెళ్లే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ 19వరకు పొడిగించారు. బెంగళూరు-మల్డా టౌన్ మధ్య తిరిగే ప్రత్యేక రైళ్లు 16వరకు పొడిగింపు : బెంగళూరు నుంచి పశ్చిమ బెంగాల్ లోని మాల్డా టౌన్ మధ్య తిరిగే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ 13వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో మాల్డా టౌన్ నుంచి బెంగళూరు వెళ్లే నెంబర్ 06566ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 16వరకు పొడిగించారు.

# గుంతకల్లు రైల్వే డివిజన్ మెడికల్ బడ్జెట్‌ను దక్షిణ మధ్య రైల్వేలోనే కొనసాగించాలి

## రైల్వే కార్మికులు




**గుంతకల్లు రైల్వే, జూలై 3,ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం మేరకు కొత్తగా ఏర్పడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో విలీనం చేసిన గుంతకల్లు డివిజన్‌లోని డివిజనల్ రైల్వే ఆసుపత్రికి వచ్చే రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోనే కొనసాగించాలని రైల్వే కార్మికులు,కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి. రాయలసీమకే తలమానికమైన గుంతకల్లు డివిజనల్ రైల్వే ఆసుపత్రిలో 98వేల మంది రైల్వే కుటుంబాలు చికిత్స నిమిత్తం నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. డివిజన్‌లో మెడికల్ బడ్జెట్ కింద రూ.15కోట్లు కేటాయిస్తున్నారు. ఇందులో సాధారణ మెడికల్ బడ్జెట్‌లో రూ.7కోట్లు, రెఫరల్ ఆసుపత్రులకై చెల్లించేందుకు మరో రూ.8కోట్ల వ్యయం చేస్తున్నారు. గుంతకల్లు డివిజనల్ రైల్వే ఆసుపత్రిలో 131బెడ్లు ఉండేవి, డివిజన్ పరిధిలోని తిరుపతిలోని సబ్ డివిజన్ ఆసుపత్రికి 30పడకలను బదలాయించడంతో గుంతకల్లు రైల్వే ఆసుపత్రిలో ప్రస్తుతం 101పడకలున్నాయి. అలాగే రాయచూరు,డోన్, గుత్తి,కడప, నందలూరు,రేణిగుంట, పాకాల, మదనపల్లి, ధర్మవరంలలో మరో 9ఆరోగ్య కేంద్రాలు రైల్వే కుటుంబాలకు సేవలందిస్తున్నాయి. ఇదిలావుండగా గుంతకల్లు రైల్వే డివిజన్‌ను విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో విలీనం చేయడంతో రైల్వే కార్మిక కుటుంబాల్లో ఆందోళనలు మొదలయ్యాయి. ఇకపై రైల్వే సెంట్రల్ ఆసుపత్రికి రెఫర్ చేస్తే 786కి.మీల దూరంలో ఉన్న విశాఖ రైల్వే సెంట్రల్ ఆసుపత్రికి వెళ్లాల్సి ఉంటుంది. రైల్వే కార్మిక కుటుంబాల జీవన్మరణాల సమస్యలను దృష్టిలో ఉంచుకొని గుంతకల్లు రెఫరల్, మెడికల్ బడ్జెట్ రూ.15కోట్లను 366కి.మీ దూరంలోని సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు కేటాయించి రైల్వే కుటుంబాల ప్రాణాలను కాపాడవలసిన బాధ్యత రైల్వే యాజమాన్యంపైనే ఉంది. ఈ విషయమై దక్షిణ కోస్తా రైల్వే/దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సందీప్ మాధూర్ ప్రత్యేక దృష్టి సారించి రైల్వే కుటుంబాలను రక్షించవలసిన బాధ్యత ఉంది.

# తోమాలసేవ, అభిషేకం దర్శనాల పేరుతో దళారీ మోసం

**తిరుమల,జులై 3ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దగ్గరగా తమ కళ్ళారా వీక్షించుకోవాలనే తపన ప్రతి భక్తునికి కలుగుతుంది. అలాంటి భక్తుల అమాయ కత్వాన్ని, దర్శనాలను ఆసరాగా చేసుకుంటున్న కొందరు దళారులు సులభంగా తమ వలలోవేసుకుని వేలల్లో, లక్షల్లో డబ్బులు తీసుకుని చివరకు చేతులెత్తేస్తుండటం కొందరైతే,మరికొందరు ఏకంగా నకిలీ దర్శన టిక్కెట్లు సృష్టించి భక్తులను మోసం చేస్తున్నారు. ఇలాంటి కోవకు చెందిన ఓ దళారీ తెలంగాణ సిరిసిల్ల వాసులను భారీగా మోసం చేశాడు. ఆ భక్తులు తమకు తోమాలసేవ దర్శనం అదృష్టమని భావించి తిరుమలకు చేరుకుంటే అసలు మోసంజరిగిందని తెలుసుకున్నారు. తిరుమల పోలీసుల కథనం మేరకు సిరిసిల్లకు చెందిన విజయ్ కుటుంబంతో శ్రీవారి తోమాల, అబిషేకసేవలు దర్శనం కావాలని కోరాడు. ఇందుకు అతనికి తెలిసిన వ్యక్తిద్వారా బాలాజీ అనే వ్యక్తి నంబర్‌ను తీసుకుని కోరిన దర్శనం చేయిస్తాడని నమ్మించాడు. బాలాజీని ఫోన్‌లోనే సంప్రదించడంతో కోరిన దర్శన టిక్కెట్లు ఇప్పిస్తానని అందుకు 65వేల రూపాయలు నగదును రెండు దశల్లో తీసుకున్నాడు. గత వారం క్రిందట విజయ్ తన కుటుంబంలోని ఐదుగురు సభ్యుల పేర్లతో టిటిడి లోగోతో ఉన్న నకిలీ తోమాలసేవ టిక్కెట్‌ను జైలూ 3వతేదీ గురువారం(నేడు)దర్శనానికి, మరుసటిరోజు 4వతేదీ శుక్రవారం రోజుకు 6మంది భక్తులకు అభిషేకం సేవ టిక్కెట్‌ను ఇప్పించాడు. భక్తులకు అనుమానం రాకుండా ఈ టిక్కెట్లను ఓ ఇంటర్‌నెట్ దుకాణం నుండి డౌన్లోడ్ చేయించి విజయ్ మొబైల్‌కు పంపించాడు. ఇది నిజమేనని నమ్మిన విజయ్ కుటుంబం సంతోషంగా తిరుమలకు బయలుదేరారు. అయితే ఇవి నకిలీ దర్శన టిక్కెట్లు అని తెలియకపోవడంతో తిరుపతిలో ముందస్తుగా టైమ్‌స్లాట్ టోకెన్లు కూడా పొందారు. ఈ నకిలీ దర్శన టిక్కెట్లతో తిరుమలకు వచ్చిన భక్తులు గురువారం వేకువజామున తోమాలసేవకు హాజరవడానికి రావడంతో నకిలీవిగా తేలింది. వసతి కోసం సూట్ రూమ్ బుక్‌చేశాడని చెప్పిన బాలాజీ చివరకు ఫోన్ తీయకపోగా స్పందించలేదు. దీంతో భక్తులు మోసపోయామని గ్రహించి తిరుమల 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తిరుమల పోలీసులు తదుపరి జరిగిన సంఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అయితే సాధారణంగా కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి మంగళ,బుధ, గురువారాల్లోనే తోమాల, అర్చనసేవలు గృహస్థ భక్తుల మధ్య జరిపిస్తారు. మిగిలిన మూడు రోజులు ఏకాంతంగా జరిపిస్తారు. అయితే రాజ్యాంగ పరిధిలోని విఐపిల సిఫార్సు లేఖలపై పరిమితంగా ఒకటిలేదారెండు తోమాల సేవా టిక్కెట్లు, ఒకటి అభిషేకంసేవ టిక్కెట్ మంజూరవుతాయి. అలాంటిది ఏకంగా దళారీ బాలాజీ ఎక్కువమంది భక్తులకు తోమాల, అభిషేకం సేవ టిక్కెట్లు నకిలీవి సృష్టించి పంపడంతో ఇప్పుడు దళారీ దందా మరోసారి టిటిడి విజిలెన్స్‌ను ఆశ్చర్యపరిచింది.


భారత ప్రభుత్వం
సాంస్కృతిక మంత్రిత్వ శాఖ

**టెండర్ ప్రకటన**

సాంస్కృతిక మంత్రిత్వ శాఖచే, **30 జూన్ 2025**న రూపొందించబడిన జ్ఞాన భారతం మిషన్‌కు వ్రాతప్రతుల యొక్క డిజిటైజేషన్ కొరకు ప్రతిపాదన అభ్యర్థిస్తున్నాము.

ఆసక్తి గల బిడ్డర్‌లు వివరాలను **eprocure.gov.in** పై చూడవచ్చును.

బిడ్ దాఖలుకు చివరి తేదీ: **21 జూలై 2025.**

CBC 09101/11/0008/2526


# వ్యవసాయ శాఖలో అందుబాటులోకి వచ్చిన అజైల్ యాప్

**విజయవాడ,జూలై 3,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యవసాయ శాఖ కొత్తగా రూపొందించిన అగ్రి ఇన్‌పుట్ లైసెన్స్ ఇంజిన్ (అజైల్) యాప్‌ను అందుబాటులోకి తీసుకుని వచ్చింది . వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీ రాజశేఖర్ ఈ విషయాన్ని మీడియా సమావేశంలో వివరిస్తూ ఈ యాప్ ద్వారా పల్నాడు జిల్లాకు చెందిన మహిళా డీలర్‌కు ఎరువుల తయారీకి అవసరమైన తొలి డిజిటల్ లైసెన్స్ జారీ చేసినట్లు వివరించారు..విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వంటి ఇన్‌పుట్స్ వ్యాపారానికి సంబంధించిన లైసెన్స్‌ల కోసం అజైల్ ఫ్లాట్ ఫాం తప్పనిసరిగా వినియోగించాలని వ్యాపారులకు సూచించారు. ఇది సెంట్రలైజ్డ్ డిజిటల్ ఇన్‌పుట్ మేనేజ్‌మెంట్ సిస్టం అని వివరించారు.

వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ... ఈయాప్ ద్వారా అందుబాటులోకి వచ్చే పర్యవేక్షక కార్యకలాపాలను, వ్యాపారులు, రైతులకు అందుబాటులోకి వచ్చే సేవలను తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, రైతు సాధికార సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, వ్యవసాయ, ఉద్యాన వర్సిటీల వీసీలు శారదా జయలక్ష్మి,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## 6 నుంచి డిఇఇసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్

**విజయవాడ జులై 3, ప్రభాతవార్త ప్రతినిధి:** డీఈఈసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ ఈ నెల 6 నుంచి ప్రారంభించనున్నారు. మొదలి విడత కౌన్సెలింగ్‌కు సంబంధించి సీట్ మ్యాట్రిక్స్‌ను 6,7 తేదీల్లో సిద్ధం చేస్తారు. కళాశాలల ఎంపిక కోసం వెబ్ ఐచ్ఛికాలకు 8 నుంచి 12 వరకు అవకాశం కల్పించారు. సీట్ల కేటాయింపు, ప్రొవిజనల్ లెటర్ల జారీ 13 నుంచి 16 వరకు కొనసాగనుంది. డైట్లలో సర్టిఫికెట్ల పరిశీలన 17 నుంచి 22 వరకు నిర్వహిస్తారు. 25 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

# అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

## మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,జూలై 3,ప్రభాతవార్తప్రతినిధి:** అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం లోని పలు ప్రాంతాల్లో మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించారు.ఇంటింటికీ వెళ్ళి ప్రజా సమస్యలను అడిగి మంత్రి తెలుసుకున్నారు. వీధి దీపాలు వెలగడం లేదని, తాగునీరు దుర్వాసన వస్తోందని మంత్రికి పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు. నెలల తరబడి వీధి దీపాలు వెలగడం లేదని మహిళలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణం వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కమీషనర్‌ను ఆదేశించారు.స్వచ్ఛమైన త్రాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాలు జారీ చేశారు. అధికారులు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మున్సిపల్,సచివాలయం అధికారులను మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. పలు అభివృద్ధి పనులపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.సకాలంలో పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని సంబంధిత అధికారులపై మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ దీపాల నిర్వహణ,తాగునీటి సరఫరాలో అధికారులు ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కారించాలని ఆదేశించారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.


కెనరా బ్యాంక్ Canara Bank — ప్రాంతీయ కార్యాలయం : భీమవరం
2వ అంతస్తు, జె.పి. రోడ్డు, చిన్నమీరాం, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా-534204.

**ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు**

టు:
ఋణగ్రహీత : శ్రీ ప్రతాప్ మారీదు, తండ్రి : సీతారామయ్య మారీదు, 5-179, ZP హైస్కూల్ దగ్గర, పెనమలూరు, ఆంధ్రప్రదేశ్-521139.
మరణించిన హామీదారు లేటు జంగం శివ కుమార్ యొక్క చట్టపరమైన వారసులు :
1) జంగం నాగమణి, భర్త : లేటు జంగం శివ కుమార్, 1-162-11, గోతులోమిల్లు వీధి, పెడన.
2) శ్రీ జంగం చంద్ర శేఖర్, తండ్రి : లేటు జంగం శివ కుమార్, 1-162-11, గోతులోమిల్లు వీధి, పెడన.
3) శ్రీ జంగం మణికంఠ, తండ్రి : లేటు జంగం శివ కుమార్, 1-162-11, గోతులోమిల్లు వీధి, పెడన.
4) జంగం బాలనళిని, తండ్రి : లేటు జంగం శివ కుమార్, 1-162-11, గోతులోమిల్లు వీధి, పెడన.
డియర్ సర్/మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా కెనరా బ్యాంక్, చాటపర్రు బ్రాంచ్ నుండి శ్రీ ప్రతాప్ మారీదు, తండ్రి : సీతారామయ్య మారీదు గారు పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

| లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం. | లోన్ మొత్తం మరియు లోన్ తేది | ప్రస్తుత తేదీ 31-03-2025 నాటికి బకాయి మొత్తం వడ్డీతో | వడ్డీ రేటు |
|---|---|---|---|
| KCCS లోన్ అకౌంట్ నెం. 1330840014150 | 19-12-2020 తేదీన రూ.60,00,000/- | రూ.41,20,233.52/- | (One Year MCLR+1.45)% per annum-presently 10.55% per annum |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని 19.12.2023 తేదీన నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ. 41,20,233.52 (అక్షరాల నలభై ఒక్క లక్షల ఇరవై వేల రెండు వందల ముప్పై మూడు రూపాయల యాభై రెండు పైసలు మాత్రమే) తేది 31.03.2025 నాటికి** + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

కంకిపాడు ఎస్ఆర్ఓ, పెనమలూరు మండలం, పెనమలూరు గ్రామ పంచాయితీ, పెనమలూరు గ్రామం వద్ద పాత ఆర్ ఎస్ నెం.7/1, ఆర్.ఎస్ నెం.224/3 నందు విస్తీర్ణం 168.77 చ॥గ॥లులోని డి నెం.5-179 తో ఉన్న ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్ మరియు మొదటి అంతస్తులతో ఉన్న రెసిడెన్షియల్ భవనం. **హద్దులు : తూర్పు:** మారీదు సుబ్బారావు మరియు మారీదు శ్రీనివాస రావు గార్ల ఆస్తులు 30-6 అ॥లు, **దక్షిణం :** చాగంటి రామచంద్ర రావు గారి ఆస్తులు 49 అ॥లు, **పడమర :** తాడేపల్లి సాంబ రావు మరియు వెంకటస్వామి గార్ల ఆస్తులు 31-6 అ॥లు, **ఉత్తరం :** మారీదు ప్రభాకర రావు గారి ఆస్తి 49 అ॥లు.
టైటిల్ హోల్డర్ పేరు : శ్రీ ప్రతాప్ మారీదు, తండ్రి : సీతారామయ్య మారీదు.
*గమనిక : ప్రస్తుత డిమాండ్ నోటీసు జారీతో సబ్జెక్టివ్ అకౌంట్ కోసం SARFAESI చట్టంలోని నిబంధనల ప్రకారం మునుపు జారీ చేయబడిన అన్ని నోటీసులు ఉపసంహరించబడ్డాయి.

తేది: 30-05-2025, ప్రదేశం: భీమవరం — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్



కెనరా బ్యాంక్ Canara Bank — ప్రాంతీయ కార్యాలయం : భీమవరం
2వ అంతస్తు, జె.పి. రోడ్డు, చిన్నమీరాం, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా-534204.

**ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు**

టు:
మరణించిన ఋణగ్రహీత లేటు శ్రీ జంగం శివకుమార్ యొక్క చట్టపరమైన వారసులు:
1) జంగం నాగమణి, భర్త: లేటు జంగం శివకుమార్, 1-162-11, గోతులోమిల్లు వీధి, పెడన.
2) జంగం చంద్ర శేఖర్, తండ్రి: లేటు జంగం శివ కుమార్, 1-162-11, గోతులోమిల్లు వీధి, పెడన.
3) జంగం మణికంఠ, తండ్రి: లేటు జంగం శివ కుమార్, 1-162-11, గోతులోమిల్లు వీధి, పెడన.
4) జంగం బాలనళిని, తండ్రి: లేటు జంగం శివ కుమార్, 1-162-11, గోతులోమిల్లు వీధి, పెడన.
డియర్ సర్/మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా కెనరా బ్యాంక్, చాటపర్రు బ్రాంచ్ నుండి ఋణగ్రహీత యొక్క చట్టపరమైన వారసులు: 1) జంగం నాగమణి, భర్త: లేటు జంగం శివకుమార్, 2) జంగం చంద్ర శేఖర్, తండ్రి: లేటు జంగం శివ కుమార్, 3) జంగం మణికంఠ, తండ్రి: లేటు జంగం శివ కుమార్, 4) జంగం బాలనళిని, తండ్రి: లేటు జంగం శివ కుమార్ గార్లు పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

| లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం. | లోన్ మొత్తం & లోన్ తేది | వడ్డీతో కలిపి తేది 26.04.2025 నాటికి మొత్తం బకాయి | వడ్డీ రేటు |
|---|---|---|---|
| కిషాన్ క్రెడిట్ కార్డు స్కీమ్ అకౌంట్ నెం. 1330840014142 | రూ.70,00,000/- తేది: 01.12.2020 | రూ. 1,06,14,176.6 | (ఒక సం॥ MCLR+1.45)% సంవత్సరానికి - ప్రస్తుతం సంవత్సరానికి 10.50% |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని తేది 02.12.2023 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ. 1,06,14,176.6 (అక్షరాల ఒక కోటి ఆరు లక్షల పద్నాలుగు వేల నూట డెబ్బై ఆరు రూపాయలు మరియు ఆరు పైసలు మాత్రమే)** + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.
SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసును పంపించడం జరిగింది.

**తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి**

కృష్ణా జిల్లా, పెడన మున్సిపల్ పరిధి, డి.నెం. 1-248-10, ఆర్.యస్.నెం. 564/2 లో ఎ. 0.50 సెంట్లులో 242 చ॥గ॥లు లేదా ఎ. 0.05 సెంట్లు స్థలం నందు ఆర్‌సిసి రూఫ్ రెసిడెన్షియల్ బిల్డింగ్ యావత్తు. **హద్దులు: తూర్పు:** ఉమ్మడి లైన్ లో కొంత భాగం మరియు పిచ్చుక మల్లయ్య యొక్క కొంత భాగం భూమి 104", **దక్షిణం:** జంపన వసంతరాయలు యొక్క భూమి 45", **పడమర:** వీర్లంక వెంకటసుబ్బయ్య యొక్క భూమి 109", **ఉత్తరం:** వడుగు పోతురాజు యొక్క భూమి 49".
టైటిల్ హోల్డర్: శ్రీ జంగం శివ కుమార్, తండ్రి: జంగం కోటయ్య.
* గమనిక : ప్రస్తుత డిమాండ్ నోటీసు జారీతో సబ్జెక్టివ్ అకౌంట్ కోసం SARFAESI చట్టంలోని నిబంధనల ప్రకారం జారీ చేయబడిన మునుపటి అన్ని నోటీసులు ఉపసంహరించబడ్డాయి.

తేది: 30.05.2025, ప్రదేశం: భీమవరం — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్


# న్యాయవాదులకు రూ.4.42 కోట్ల ఆర్థిక ప్రయోజనాలు

**విజయవాడ జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** న్యాయవాదుల మరణ ప్రయోజనాలు , వైద్య ఖర్చుల కోసం ఆర్థికసాయం అందించాలంటూ వచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తూ ఏపీ న్యాయవాదుల సంక్షేమ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఇటీవల జరిగిన సంక్షేమ కమిటీ సమావేశంలో హైకోర్టు, ఏపీ న్యాయశాఖ ప్రతినిధులతో పాటు ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథరెడ్డి సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, పి.నరసింగరావు పాల్గొన్నారు. మృతి ప్రయోజనం కింద 75 మంది న్యాయవాదుల కుటుంబసభ్యులకు రూ.3.77 కోట్లు వైద్య ఖర్చుల నిమిత్తం 85 మంది న్యాయవాదులకు ఆర్థిక సాయంలో రూ.50.40 లక్షలు, పదవీవిరమణ ప్రయోజనం కింద ఐదుగురు న్యాయవాదులకు రూ.15 లక్షలతో మొత్తం కలిపి రూ.4.42 కోట్లను మంజూరుచేసింది.

# తల్లికి వందనం రెండో విడత నగదు విడుదలకు తేదీ ఖరారు!

### - జులై 10న విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి..

**విజయవాడ,జులై 3,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం రెండో విడత డబ్బుల విడుదలకు తేది ఖరారు అయ్యింది.జులై 10న విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నగదు జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే లబ్ధిదారుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. తొలి విడతలో డబ్బులు వాని వారితో పాటు ఒకటో తరగతి,ఇంటర్ ఫస్ట్‌ఇయర్‌లో చేరిన వారు ఈ విడతలో లబ్ధి పొందనున్నారు. మొదటి విడతలో 67.27 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందారు.ఒకటో తరగతి,ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌కు అడ్మిషన్లు ఇంకా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది లబ్ధి పొందేందుకు వీలుగా జులై 10న మెగా పేరెంట్-టీచర్స్ సమావేశం జరిగే రోజు రెండో విడత నిధులు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

వార్త

తప్పులు చేయకుండా ఉండే శక్తి మనిషికి లేదు. కాని తమ తప్పులు, దోషాల ద్వారా వివేకవంతులు భవిష్యత్తుకవసరమైన జ్ఞానం సంపాదించుకుంటారు.

-ఒవిడ్

# పతనం అంచున ప్రజారోగ్యం?

జనారోగ్యమే జాతి మహాభాగ్యమనే ఆశయం, లక్ష్యంకోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని, దేశ ప్రజలందరికి వైద్యసేవలు అందుబాటులోకి తెస్తామని పాలకులు ఎంతగా చెప్తున్నా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎన్నో లక్షల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా ఆశించిన ఫలితాలు చేకూరడం లేదు. దేశానికి పట్టుగొమ్మలైన గ్రామసీమల్లో ఆరోగ్యపరిస్థితి ఆందోళనక రంగా ఉందని చెప్పొచ్చు. అందరికి వైద్యం అనేదిఇన్నేళ్ల దాటిపోయినా కనుచూపుమేరలో కన్పించడం లేదు. నేటికీ భారత్‌లో దాదాపు నలభైకోట్ల మందికిపైగా అత్యవ సర మందులు అందుబాటులో లేవని అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. అన్నింటికంటే ప్రధానంగా దిగువ, మధ్య తరగతి పెట్టే ఖర్చులో దాదాపు డెబ్బైశాతానికిపైగా మం దుల కొనుగోళ్లకే ఖర్చు చేస్తున్నారు. అందులో నాసిరకం, నకిలీవి కూడా ప్రజారోగ్యాన్ని పతనం అంచునకు తీసుకు పోతున్నాయి. దేశవ్యాప్తంగా దాదాపు ఇరవైఐదువేలకు పైగా రకాల మందులు నమోదై ఉంటే అంతకు రెట్టింపు స్థాయిలో అనధికారికంగా చెలామణి అవుతున్నాయి. ఒక వ్యూహం ప్రకారం నకిలీ, నాణ్యతలేని మందులను మార్కె ట్లో ప్రవేశపెడుతున్నారు. మందుల్లో ప్రామాణికత దెబ్బతి నడం వల్ల చోటుచేసుకుంటున్న అనర్థాలు అన్నీఇన్నీకావు. గతంలో నకిలీ మందులు వాడడంతో ఎందరో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ముంబయిలో నాసిరకంమందు లతో డజన్ మందికిపైగా మరణించడంతో జస్టిస్ లెంటిన్ కమిషన్‌ను ఆనాటి ప్రభుత్వం నియమించింది. సమగ్ర దర్యాప్తు, అధ్యయనం అనంతరం మంత్రిత్వస్థాయి మొద లు దిగువస్థాయి వరకు ఆరోగ్య ఔషధాలలోని లొసుగు లను, వైఫల్యాలను ఎత్తిచూపుతూ లెంటిన్ తన నివేదిక లో స్పష్టంగా ఆనాడే పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వం కానీ, ఆ తర్వాత కానీ ఆ ప్రతిపాదనలు పట్టించుకున్న ట్లు కన్పించదు. చివరకు విదేశాలకు ఎగుమతులు చేసే మందుల్లో కూడా నాసిరకం బయటపడింది. ఇంత భారీ ఎత్తున నకిలీ, నాసిరకం విస్తరిస్తున్నా అవసరమైన చర్య లు తీసుకొని నివారించడంలో విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. నకిలీ మందుల వల్ల కలిగే దుష్ఫలితాలు అటుంచి జబ్బుతగ్గకపోవడంతో వైద్యుడి వైఫల్యమా? ఉపయోగించిన మందులు కారణమా? అర్థంకాక వైద్యు లు కూడా మళ్లీ మళ్లీ పరీక్షలు చేయిస్తూ ఇతర మందుల తో రోగులపై ప్రయోగాలు చేస్తున్నారు. అందువల్ల రోగి ఆరోగ్యంతోపాటు ఆర్థికపరంగా కూడా కుప్పకూలిపోతు న్నాడు. అసలు వైద్య, ఆరోగ్యం విషయంలో నిర్దిష్టమైన ప్రణాళికలు, ముందుచూపు లేకపోవడమే వల్లనే ఈ పరి స్థితులు దాపురిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. ముఖ్యంగా అవినీతి, అంతకుమించి నిర్లక్ష్యం, ఉదా సీనతతోపాటు వైద్యఆరోగ్య రంగంలో సిబ్బంది కొరత కూడా ఈ పరిస్థితికి కారణాలనేది కాదనలేని వాస్తవం.

గత నాలుగైదు వారాలుగా దేశంలో విస్తరిస్తున్న విష జ్వరాలు, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఇటీవల దేశంలోని అనేక రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లో డెంగ్యూ వ్యాధి పంజా విసురుతుంది. ఈ యేడాది తెలంగాణలో జనవరి నుంచి మార్చి చివరి నాటికి దాదాపు రెండువందల డెబ్బై కేసులు నమోదు కాగా మార్చి నుంచి జూన్ చివరి వరకు ఎనిమిదివందల డెబ్బై కేసులకుపైగా నమోదయ్యాయి. గత నెలలోనే ఐదు వందలకుపైగా కేసులు నమోదైనట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. గత యేడాది రాష్ట్రవ్యాప్తంగా పదివేల కేసులు నమోదుకాగా అందులో జులై నుంచి డిసెంబర్ వరకే తొమ్మిదివేల కేసులు రికార్డుఅయ్యాయి. ఈయేడాది ఇది మరింత విస్తరించే అవకాశం ఉందని వైద్యరంగ నిపు ణులే హెచ్చరిస్తున్నారు. డెంగ్యూ వ్యాధికి నిర్దిష్టమైన చికి త్స లేదనే చెప్పొచ్చు. దీనికితోడు సోకింది మామూలు జ్వరమా? లేక డెంగ్యూనా, లేక ఇంకొకటాని తెలుసుకోవ డానికే గ్రామీణులకు రోజుల తరబడి సమయం పడుతు న్నది. ఈలోగా వ్యాధి ముదిరి ప్రాణాలకు ముప్పు తెస్తు న్నది. వీటితోపాటు చికెన్‌గున్యా, స్వైన్‌ఫ్లూ లాంటి వ్యాధు లు కూడా విస్తరిస్తున్నాయి. వాస్తవానికి సీజన్ వ్యాధుల కట్టడికి పటిష్టమైన ప్రణాళిక చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా నిర్దిష్టమైన అడుగులు వేస్తున్నట్లు కన్పిం చడం లేదు. పెరుగుతున్న వ్యాధులకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా పరిశీలించినా ఆస్పత్రులు కానీ, సిబ్బందిగాని లేరనే చెప్పొచ్చు. ఉన్న సిబ్బందిని కూడా మారుమూల గ్రామాలకు పంపి వైద్యసేవలు అందించడంలో పాలకులు విఫలమవుతున్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న బడుగు వర్గాల కుటుంబాలకు కనీస వైద్యం అందుబాటులోలేదు. దీంతో గ్రామాల్లో వచ్చీరాని వైద్యంతో డాక్టర్లుగాచెలామణి అవుతూ తోచినమందులు ఇచ్చేవారు కూడాతక్కువసంఖ్య లో లేరు. కనీసం మందుల పేర్లు రాయలేనివారు డాక్టర్ల జాబితాలో చేరిపోతున్నారు. చిన్నచిన్న ఆపరేషన్లు చేయ డానికి వెనుకాడడం లేదు. అర్హతలేని ఇలాంటివైద్యులు చేసే చికిత్సలతో కొన్నిసందర్భాల్లో ప్రాణాలుగాలిలో కలిసి పోతున్నాయి. ఈపరిస్థితి అంతకంతకు పెరుగుతుండడం ఆందోళన కలిగించేఅంశం. ప్రపంచ ఆరోగ్యసంస్థ గతంలో విడుదలచేసిన నివేదికప్రకారం వైద్యం చేసేవారిలో యాభై ఏడు శాతానికిపైగా ఎటువంటి విద్యార్హతలు లేనివారనే విషయం బయటపడింది. అల్లోపతితోపాటు, హోమియో పతి, ఆయుర్వేదం, యునాని, సిద్ధ, యోగా విధానాల్లో వైద్యులతో కలిపి భారత్‌లో లక్ష జనాభాకు ఎనభై నుంచి వంద మందికంటే మించిలేరు. రాబోయే రోజుల్లో ప్రజా రోగ్యం అత్యంత క్లిష్టపరిస్థితులు ఎదుర్కోబోతున్నట్లువైద్య నిపుణులే అభిప్రాయపడుతున్నారు. పాలకులు ఇప్పటికైనా గత అనుభవాలతో పాఠాలునేర్చుకొని ప్రజారోగ్యంఎదుర్కో బోతున్న సవాళ్లకు అనుగుణంగా సమాయత్తం కావాలి.

ఘర్షణ వల్ల శక్తి వృథా అవుతుంది.
హెచ్చుతగ్గులు వస్తాయి.
ఆందోళనలు చెలరేగుతాయి.
అశాంతి కలుగుతుంది.



ఐ.జాన్సన్

చీకటిలో ఉన్నప్పుడు తప్పాడి వెలుగు కోసం ప్రయత్నించాలి గాని, ఎవరో వెలుగును ప్రసాదిస్తారని ఉన్న చోటనే ఉండకూడదు.



వీరేశలింగం

# ప్రజావాక్కు



### విచారణ జరిపించాలి

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు దగ్గరున్న పాశమైలారంలో గల సిగాచి ఫార్మాకంపెనీలో జూన్‌నెల ముగియనుండగా జరిగిన ఘోర ప్రమాదంలో ప్రస్తుతానికి నలభై రెండు మంది మరణించగా అందులో కొందరు గుర్తుపట్టలేనం తగా మాడిమసైపోయారు. ఈ ప్రమాదాలకు ముఖ్య కార ణాలు మొదటిది సేఫ్టీకి ఎంత బడ్జెట్‌ను కేటాయించారు? దీనికో లెక్కుంది. దీని ప్రకారం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారా? నియమిత కాల ప్రకారం ప్రభుత్వ కార్మిక శాఖ, పరిశ్రమ యాజమాన్యం అన్ని యంత్రాలు, ఇతర సాంకేతిక పనిముట్లు లోప భూయిష్టంగా లేకుండా ఉన్నాయా? పని వారందరికి కంపెనీ వారు ఇన్సూరెన్స్ చేసారా? ఏడాదికోసారి పూర్తిగా బయటి నిపుణులతో నిర్వహణా కార్యక్రమాలు చేపడుతున్నారా? కార్మికులకు సంబంధిత కార్మాగారాలలో పనిచేసే సర్టిఫికెట్లు, అనుభ వం ఉన్నదా? ఇలా అనేక విషయాల మీద సంపూర్ణ విచారణ జరిపించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ఉపాధి హామీని అవకాశంగా తీసుకోవాలి

తెలంగాణలో బీడు భూములు దాదాపు 5 శాతం ఉన్నా యి. గాలిలో తేమ పెరిగిన నేపథ్యం లో వర్షం కూడా సమృద్ధిగా కురుస్తుంది కావున నీటి పారుదల వసతులు పెరగడం మూలంగా బీడుగా ఉన్న భూములు సాగులోకి తేవడంవల్ల రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఉపాధి హామీలో భూమి అభివృద్ధి కార్యక్రమం చేపట్టడం వల్ల దాని చుట్టూ పండ్ల తోటలు ఉదాహరణకు కొబ్బరి లాంటి తోటల వల్ల అభివృద్ధి చేసిన భూమిలో అంతర పంటలకు ఆస్కారం వుంటుంది.

- భారత అవినాష్, జనగాం

### ఉగ్రవాదం అంతమైందా!

ఆపరేషన్ బ్లూస్టార్ సైనిక చర్యతో స్వర్ణదేవాలయంలో నక్కి ఉన్న ఉగ్రవాదులను మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పారద్రోలగలిగారు. కానీ ఇందిరాగాంధీఉగ్రవాదుల చేతుల్లో ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఉగ్రవాదసమస్య తీవ్రరూపం దాల్చింది. ఎంతో మంది నాయకులు, పౌరులు ఉగ్రవాదుల ఉగ్రరూపానికి బలయ్యారు. ఆపరేషన్‌బ్లూస్టార్, ఆపరేషన్ సింధూర్ వాటి వల్ల కలిగే ప్రయోజనాలు తాత్కాలికమే.

- ఎమ్.ఎస్. శర్మ, హైదరాబాద్

### లాటరీ పద్ధతిలో పాఠశాల ప్రవేశాలు

నేటితరం తల్లిదండ్రులు విద్యావంతులైనప్పటికీ తమ పిల్లలకు తీర్చిదిద్దగల సమర్థత, వాళ్లకు ఉన్నప్పటికీ సమయం వెచ్చించ లేనందువలన, వారికోసం డబ్బులు సంపాదించాలనే ఒక పిచ్చి కోరికతో వారిపిల్లలను పిల్లలమాటలను, ఆలోచనలను పట్టించు కోకుండా వారిని ప్రైవేట్ స్కూళ్లలో, కార్పొరేట్ స్కూళ్లలో చేర్పి స్తూ ఉన్నారు. కార్పొరేట్ లేదా ప్రైవేట్ స్కూల్లోని టీచర్లు పట్ల సదరు తల్లిదండ్రులకు చులకన భావం ఉంటుంది. నిజానికి తల్లిదండ్రులు చదువులు చెప్పే ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు దేవుడి కంటే ఎక్కువగా గౌరవించబడాలి. అలా గౌరవించడానికి ఇష్టం లేని నేటి తరం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు లేదా కార్పొరేట్‌స్కూల్లో చేర్పిస్తూఉన్నారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేటు విద్యను ప్రోత్సహిస్తూ ఒక అడుగు ముందుకు వేసి నిరుపేద లైన తల్లిదండ్రుల పిల్లలను ప్రైవేటు లేదా కార్పొరేట్ స్కూల్లో చేర్పించడానికి ఇష్టపడితే వారికి లాటరీ పద్ధతిలో ఎన్నిక చేసి ప్రైవేట్ పాఠశాలలకు, కార్పొరేట్ పాఠశాలలకు ప్రభుత్వ పాఠశాలల నుండి పంపిస్తూ ఉన్నారు.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### పర్యవేక్షణ ఉండాలి

ఇటీవలి పూరి జగన్నాథ రథయాత్రలో చోటుచేసుకున్న తొక్కిస లాట ఘటన ముగ్గురు భక్తుల మృతి, 50 మందికిపైగా గాయ పడటం అత్యంతవిషాదకరం. ఈతరహా సంఘటనలు మతపర మైన ఉత్సవాల్లో భద్రతా చర్యలను పునర్విమర్శించా ల్సిన అవసరాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ప్రతి ఉత్సవా నికి ముందస్తు ప్రణాళిక, సమగ్ర భద్రతా ఏర్పాట్లు అత్య వసరం. భద్రతా చర్యల్లోభాగంగా, భక్తుల ప్రవాహాన్ని నియంత్రించేందు కు టికెట్ లేదా టోకెన్ విధానం రూపొందించాలి. స్పష్టమైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, వాలంటీర్లు ముందుగానే నియ మించాలి. ఆధునిక సాంకేతిక పరికరాలు డ్రోన్లు, సీసీటీవీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వికలాంగులకు డిప్యూటేషన్ రద్దు చేయాలి

వికలాంగుల ఉద్యోగులు వారి ఇష్ట ప్రకారం వారు కోరుకొంటేనే డిప్యూటేషన్‌లో పంపాలి. కానీ బలవంతంగా పంపవద్దు. వారు దృష్టి లోపంతో, వివిధ రకాల వైకల్యంతో బాధపడుతున్నారు. ఒక సంవత్సర కాలం కూడా పూర్తి కాకముందే డిప్యూటేషన్ అని అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# బాలల్లో 'మానసిక ఆరోగ్యం' పెంచాలి

***గ్రామీణ, పట్టణ పాఠశాలల్లో మానసిక ఆరోగ్య సలహాలు (కౌన్సిలింగ్) అందుబాటులోకి తేవాలి. కథా వేదికలు, ఆటల పండుగలు నిర్వహించాలి. పల్లెల్లో పిల్లల క్లబ్‌లు, కథా వనాలు, గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి. చైతన్య కార్యక్రమాలు జరగాలి. నేరరహిత సమాజాన్ని నిర్మించాలంటే చిన్నతనం నుండే పిల్లలకు విలువలు, సంస్కారంతో కూడిన నడవడినకు అల వాటు చేయాలి. బాల్యం మొగ్గ లాంటింది. దానిని ఎలా పెంచుతామో అలాగే అది వికసిస్తుంది. ప్రేమతో, సహనంతో, మంచి విలువలతో బాల్యాన్ని బలంగా తీర్చిదిద్దితే రేపటి సమాజం కూడా బాగుంటుంది. తిరిగి రానిది ఎంతో మధురమైనది బాల్యం. దానిని వ్యసనాలకు బానిసలుగా మార్చుకొని భవిష్యత్తును అంధకారంగా మార్చుకోకండి. నేటి బాలలే రేపటి దేశ భవిషత్తు. అలాంటి భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులతోపాటు సమాజంలో ప్రతి ఒక్కరికీ, వ్యవస్థలకు వుంది. బాల్యాన్ని జ్ఞాపకంగా మార్చుకోండి గాయంగా కాదు.***

జి. అజయ్ కుమార్

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు మనల్ని తీవ్ర ఆవేదనలో ముంచుతున్నాయి. ఫోన్ ఇవ్వలేదని, మొబైల్‌లో గేమ్ ఆడనివ్వలేదని 12, 14, సంవత్సరాల పిల్లలు ప్రాణాలు తీసుకోవడం, తన ప్రేమకు అడ్డు వస్తుం దని ఒక బాలిక వాళ్ల తల్లిని చంపడం, వంటివి ఎన్నో సంఘటనలు నిత్యం నేటి సమాజంలో జరుగుతున్నాయి, వీటిని మనం ఎప్పుడైనా ఊహించమా? ఒక్కసారి ఆలో చించండి – ఏ వయసులో జీవితం ప్రారంభించాలో ఆ వయసులోనే జీవితం ముగింపు చూపడం ఎలాంటి ప్రమా దకర పరిస్థితికి సంకేతం?. పిల్లలను చిన్నతనం నుండి పద్ధతిగా పెంచకుండా, విలువలు నేర్పకుండా, మంచి చెడు చెప్పకుండా పెంచితే వారు పెద్దవాళ్ళు అయ్యాక దాని పర్య వసానాలు చాలా ప్రమాదకరంగా ఉంటాయి. అవి కుటుంబం మీదే కాకుండా సమాజం మీద కూడా చెడు ప్రభావాన్ని చూపిస్తాయి. ఒకప్పుడు అమ్మ చందమామను చూపిస్తూ అన్నం తినిపించేది ఇప్పుడు మొబైల్ చూపిస్తూతినిపిస్తుంది. అదే వ్యసనంగా మారి పిల్లలలో మానసిక వైకల్యానికి దారి తీస్తుంది. తల్లిదండ్రులు తమ ప్రశాంతత కోసం పిల్లలకు మొబైల్ ఫోన్లు అలవాటు చేస్తే భవిష్యత్‌లో ఎవ్వరికీ ప్రశాంతత లేకుండా చేస్తున్నారనేది నిజం. దానితో పాటు నేడు పాఠశాల, కళాశాలల స్థాయిలోనే పిల్లలు మత్తు పదా ర్థాలకు బానిసలుగా మారి టీనేజ్ వయసు కూడా దాటక ముందే అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడడం, నేరస్తులుగా మారడం అనేది కూడా ఆందోళన కలిగించే అంశం. ఇది ప్రతీ ఇంట్లో, సమాజంలోనూ, దేశంలో బలంగా చర్చించా ల్సిన అంశం. బాల్యం అనేది ఒక వ్యక్తి జీవితానికి పునాది. అది బలంగా విలువలతో కూడి ఉంటేనే మనిషి మంచి జీవితాన్ని నిర్మించుకోగలడు. కానీ అదే బాల్యం దారి తప్పితే జీవితం దిక్కుతెలియని దారిలో నడుస్తుంది. అదే కాకుండా కుటుంబం, సమాజం, దేశం కూడా దాని పర్యవసానాలు ఎదుర్కొంటుంది. ఒకప్పుడు మట్టిలో ఆడిన బాల్యం ఇప్పుడు స్క్రీన్‌లోనే బంధించబడింది. చెట్టు కింద కథలు విన్న ఆ రోజులు.. ఇప్పుడు ఆన్లైన్ ఆటలతో సాగిపో తోంది స్నేహితులతో పెట్టిన ముచ్చట్లు నవ్వుకున్న రోజులు ఇప్పుడు సోషల్ మీడియా మాయలో కనుమరువుతున్నా యి. పిల్లలకు నీతి కథలు చెప్పేవారు కరువయ్యారు, ఉమ్మడి కుటుంబాలు లేక పెద్దవారి పర్యవేక్షణ లోపించి పిల్లలలో మానసిక వికాసాన్ని పెంపొందించే విధానం లోపించింది. మొబైల్ స్క్రీన్ బానిసత్వం ఒంటరితనం, మూడ్ స్వింగ్స్ మానసిక ఒత్తిడి, డిప్రెషన్ మత్తుపదార్థాల వ్యసనం, చిన్న వయసులో ఆత్మహత్యల యత్నాలు, నేర పూరిత స్వభావం ఈ పరిస్థితులన్నీ మాటల్లో చెప్పదగ్గవే కాదు. గణాంకాలు కూడా చెబుతున్నాయి. ఇటీవల ఒక సంస్థ లెక్కల ప్రకారం 12–17 ఏళ్ల వయసు పిల్లల్లో 26 మంది డిజిటల్ అడిక్షన్ బారినపడ్డారు. వారిలో డిప్రెషన్



కేసులు కూడా 40వరకు పెరిగాయి. రోజుకి 2 గంటలకంటే ఎక్కువ స్క్రీన్ టైమ్ వల్ల పిల్లల్లో మానసిక స్థిరతపై తీవ్ర మైన ప్రభావం పడుతోంది. దీనివలన మానసిక కుంగు బాటు, ఒంటరితనం, ఆత్మహత్య అలోచనలు కలుగుతాయి. చైల్డ్ లైన్ నివేదిక ప్రకారం బాలలపై వేధింపుల కేసులు 300వరకు పెరిగాయి. యూనిసెఫ్ లెక్కల ప్రకారం భారత దేశంలో మత్తుపదార్థాల తొలిసారి వినియోగం వయస్సు – సగటున 11.5 ఏళ్లు అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పిల్లల్ని ఏడవకుండా ఉంచేందుకు ఫోన్ ఇవ్వడం ప్రేమను పంచకుండా స్క్రీన్‌ని ప్రత్యామ్నా యంగా ఉపయోగించడం, ఎప్పుడూ బిజీగా ఉండి వారితో రోజుకు కొంత సమయం కూడా గడపకపోవడం, పిల్లలకు వ్యక్తిగత గదులు ఇచ్చి వాళ్ళు ఏం చేస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు, వంటివి పట్టించుకోకపోవడం, మార్కు లు, ర్యాంకుల మాత్రమే ప్రాధాన్యంగా నడిచే విద్యాసంస్థ లు ఆటలకు, భావోద్వేగాలకు, విలువలు నేర్పడానికి మొగ్గు చూపకపోవడం విలువలతో కూడిన విద్యాబోధన లేకపోవ డం, విద్యాలయాల్లో పిల్లలు ఎంచేస్తున్నారు, చేడుఅలవాట్ల కు ఏమన్నా బానిసలుగా మారుతున్నారా అనే పర్యవేక్షణ లేకపోవడం, హింసాత్మక, అసభ్య కంటెంట్ సులభంగా అందుబాటులో ఉండటం, ప్రతి ఇంట్లో ఇంటర్‌నెట్ అందు బాటులోకి రావడం, పిల్లలు ఏం చూస్తున్నారో తల్లిదండ్రు లు పట్టించుకోవడం వల్ల వారికి స్వేచ్ఛ పెరగడం, గేమ్స్, రీళ్లు మానసికంగా కలుషితపరచడం, పిల్లల ఆటలకు స్థలాల లేమి, మితిమీరిన పోటీ వాతావరణం, పిల్లల ప్రవర్తనను గమనించకుండా పెద్దలు తమ జీవితాల్లోనే బిజీగాగడపడం, ఇలాంటి దుష్పరిణామాలకు కారణంగా ఉన్నాయి. పిల్లలు మొబైల్ చూసే స్క్రీన్ టైమ్‌పై పరిమితి విధించాలి పిల్లలతో రోజూ కనీసం 1 గంట కలసి గడపాలి. ప్రేమతో కూడిన సంభాషణలు, విలువల బోధన అవసరం. ప్రకృతి, పుస్తకా లు, ఆటలవైపు వారిని ప్రోత్సహించాలి. విలువల బోధనను పాఠ్యాంశాల్లో భాగం చేయాలి. ఆటలు తప్పనిసరి భాగంగా ఉండాలి. పిల్లల మనోభావాలను గుర్తించి ఆ దిశగావిద్యార్థు లను ప్రోత్సహించాలి. హానికర కంటెంట్‌పై నియంత్రణ విధించాలి. స్క్రీన్ టైమ్ నియంత్రణ విధానాలు పెట్టాలి. గ్రామీణ, పట్టణ పాఠశాలల్లో మానసిక ఆరోగ్య సలహాలు (కౌన్సిలింగ్) అందుబాటులోకి తేవాలి. కథా వేదికలు, ఆటల పండుగలు నిర్వహించాలి. పల్లెల్లో పిల్లల క్లబ్‌లు, కథా వనాలు, గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి. చైతన్య కార్య క్రమాలు జరగాలి. నేరరహిత సమాజాన్ని నిర్మించాలంటే చిన్నతనం నుండే పిల్లలకు విలువలు, సంస్కారంతో కూడి న నడవడినకు అలవాటు చేయాలి. బాల్యం మొగ్గ లాంటిం ది. దానిని ఎలా పెంచుతామో అలాగే అది వికసిస్తుంది. ప్రేమతో, సహనంతో, మంచి విలువలతో బాల్యాన్ని బలం గా తీర్చిదిద్దితే రేపటి సమాజం కూడా బాగుంటుంది. తిరిగి రానిది ఎంతో మధురమైనది బాల్యం. దానిని వ్యసనాలకు బానిసలుగా మార్చుకొని భవిష్యత్తును అంధకారంగా మార్చు కోకండి. నేటి బాలలే రేపటి దేశ భవిషత్తు. అలాంటి భవి ష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులతోపాటు సమాజంలో ప్రతి ఒక్కరికీ, వ్యవస్థలకు వుంది. బాల్యాన్ని జ్ఞాపకంగా మార్చుకోండి గాయంగా కాదు. •

# విమానయానంపై బెదురు తగ్గాలంటే..

ఐ.ప్రసాదరావు

అహ్మదాబాద్ విమానం ప్రమాదంలో దాదాపు 274 మంది మరణించడంతో ముఖ్యంగా మన భారతదేశం లో విమాన ప్రయాణం చేసే వారిలో ఒక్కసారిగా 'ఫ్లయిట్ ఫియర్' పెరిగింది. దీంతో ఒక్కసారిగా నలభై శాతం విమాన ప్రయాణం చేసే వారు తాము చేసుకున్న టికెట్ బుకింగ్స్ క్యాన్సిల్ చేసుకోవడం జరుగుతుంది. దీనికితోడు ప్రయాణించే విమానాలు తరచూ వివిధ కారణాల వల్ల చేరవలసిన గమ్యస్థానాలకు చేరకుండా వెనుదిరిగడం లేదా వేరే విమానాశ్రయాల్లో అత్యవసర ల్యాండింగ్ జరగడం వల్ల విమాన ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణం చేయ డం అంటే భయపడే పరిస్థితికి వచ్చింది. ఇటీవల విమాన ప్రయాణం చేసే వారు, విమానాలకు సంబంధించిన పూర్తి వివరాలు అనగా విమానం తయారుచేసిన కంపెనీ, మోడల్, వాటి పూర్తి చరిత్ర తెలుసుకుని టికెట్ బుకింగ్స్ చేసుకోవ డం జరుగుతుంది.' డ్రీమ్ లైనర్' విమానం అంటే ఆమ డదూరం పారిపోతున్న పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా ఎయిర్ ఇండియా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.. ప్రయాణికులకు భరోసా కల్పించాలి. ముఖ్యంగా అన్ని విషయాల్లో అన్ని సంస్థల విమానాలు డి.జి.సి.ఏ గైడ్లైన్స్ తూ.చ తప్పకుండా పాటించాలి. తరచూ విమానాలను తనిఖీ చేయాలి. ము ఖ్యంగా మనదేశంలో ఉన్న విమానాశ్రయాల పరిసరాల్లో అనేక చర్యలు తీసుకోవాలని. విమానాశ్రయాల చుట్టుప్రక్కల నివాసప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించాలి. అదే సమయం లో విమానాల ఫిట్నెస్‌పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. టైర్లు, ఇంధనం, ఇంజన్లు తదితర విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. సాంకేతిక సమస్యలపై దృష్టి సారించాలి. సిబ్బంది, పైలెట్లు స్థితిగతులు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. ఒత్తిడి లేకుండా చూడాలి. ప్రస్తుతం సంవత్సరా నికి 40 కోట్లకు పైబడిన సంఖ్యలో ప్రయాణాలు నమోదు అవుతున్నాయి. రోజూ లక్షల సంఖ్యలో ప్రయాణికులు విమానయానం చేస్తున్నారు. 'ఉదాన్' పథకం ద్వారా విమా నయానానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, దేశంలో అనేక చోట్ల నూతన విమానాశ్రయాలు నిర్మిస్తున్నారు. కొత్త కొత్తవిమాన సర్వీసులు ప్రారంభిస్తున్నారు. నిమిషాలు, గంటల వ్యవధి లో దూర ప్రాంతాలకు చేరేవిధంగా వివిధ చర్యలు రూప కల్పన చేస్తున్నారు. ఏవియేషన్ దగ్గర అందరికీచేరవుతుంది.




గతంలో ధనికులకు మాత్రమే అందుబాటులో ఉండే విమా నప్రయాణం ఇటీవల కాలంలో సామాన్యులకు కూడాఅందు బాటులోకి వచ్చింది. ముఖ్యంగా సాఫ్ట్వేర్‌రంగం ఊపుఅందు కోవడం వలన విమాన ప్రయాణం సులభతరం అవుతుంది. ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం చదువుకున్న వారు దేశం లో వివిధ పెద్దపెద్ద నగరాలకు, పట్టణాలకు వెళ్ళటంవలన, త్వరితగతిన వెళ్ళడానికి విమాన ప్రయాణాన్ని వాడుతున్న పరిస్థితి. అదే సందర్భంలో చదువుల నిమిత్తం, వ్యాపారా ల నిమిత్తం, ఉద్యోగ ఉపాధి అవకాశాల నిమిత్తం, దేశ వ్యాప్తంగా పల్లెటూరి నుంచి పట్టణాల నుంచి దేశ విదేశాల కు ప్రజలకు వలస వెళ్లడం ప్రారంభమైంది. దీనికి విమాన యానం అత్యవసరంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో విమాన ప్రమాదాలు సర్వత్రా ఆందోళన కలిగిస్తున్నాయి. ఇకనైనా తగు భద్రతా చర్యలు తీసుకోవాలి. ఒకప్పుడు దూర ప్రాంతాలకు వెళ్ళాలన్నా, విదేశాలకు వెళ్ళాలన్న నౌకాయా నమే సాధనం. కానీ కాలానుగుణంగా విమానయానం త్వరి తగతిన దాదాపు అన్ని చోట్లకు అందుబాటులోకి వచ్చింది. అవసరాలు పెరిగాయి. కొంతమేరకు ప్రజల ఆర్థిక పరిస్థితు లు మెరుగుపడ్డాయి. దీంతో ఆకాశమే హద్దుగా అందరూ ఆకాశయానం అనగా విమానయానం ద్వారా ప్రపంచ దేశా లను చుట్టేస్తున్నారు. ఇక ఇటీవల కాలంలో 'టూరిజం' ఒక ఫ్యాషన్‌గా మారింది. దీంతో అవకాశం ఉన్నవారు అందరూ దేశంలో వివిధ ప్రాంతాలకు, అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాలకు పర్యటనకు వెళుతున్నారు. దీనికి ప్రధాన కారణం 'విమానయానం' అందుబాటులోకి రావడమే. ఇక భవిష్యత్తు అంతా 'టూరిజమే' అంటున్న ప్రస్తుత తరుణంలో విమాన రంగాన్ని అభివృద్ధి పరుచుకోవాలి. ఆధునిక విమానాలు, సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం తోపాటుప్రయా ణికులకు భద్రత కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానికి, విమానయాన సంస్థలకు, రక్షణ సంస్థలకు, ఎయిర్ లైన్స్ సంస్థలకు, సంబంధిత ప్రభుత్వ సంస్థలపై ఉంది. ఇప్పుడే ఊపు అందుకున్న విమాన సర్వీసులు, విమాన ప్రయాణికు లకు భరోసా కల్పించాలి. భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ఎయిర్ ఇండియా, కేంద్ర ప్రభుత్వం సరైన నిర్ణ యాలు తీసుకోవాలి. ప్రతిష్టాత్మకంగా చర్యలు తీసుకోవాలి. ప్రయాణికుల్లో ప్రబలుతున్న 'ఏవియో( ఏరో) ఫోబియా' కు ఫుల్‌స్టాప్ పెట్టాలి. ప్రయాణికులు కూడా భయాందోళనలకు గురి కాకూడదు. ముఖ్యంగా మానసిక ధైర్యాన్నిఇనుమడింప చేసుకోవాలి. ధైర్యంగా ముందుకు సాగాలి. అవసరమైన సందర్భాల్లో వైద్య నిపుణులను సంప్రదించాలి. సాధ్యమైనం త త్వరలో మన విమానయానం గాడిలో పడుతుంది అని ఆశిద్దాం. ఆ విధంగా పటిష్టమైన చర్యలు ప్రభుత్వం, విమా నయాన సంస్థలు తీసుకుంటాయని ఆశిద్దాం. •

# విద్యలో విప్లవాత్మక మార్పులు ఏఐతో సాధ్యమా?



డాక్టర్ మోటె చిరంజీవి

విద్యార్థుల్లో చదవడం, రాయ డం, లెక్కలు చేయడం వంటి సామర్థ్యాలు పెంపొందించేందుకు ఏఐ ఎంతగానో దోహదపడనుంది. వారి సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచే విధానంలో ఎంతో ఉపయోగపడు తుంది. ఇంతకు ముందు ప్రాథమిక విద్యార్థులకు కనీస అభ్యర్థన సామ ర్థ్యాల పెంపునకు ఫౌండేషనల్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) ప్రోగ్రామ్‌ను అమలు చేశారు. ఇప్పుడు, మరోసారి ఏఐ విద్యతో విద్యార్థుల్లో మరింత నైపుణ్యాలు మెరుగుపడతాయని యోచిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచాన్ని శాసించే దిశగా పయనిస్తున్న అత్యాధునిక సాంకేతికత కృత్రిమ మేధ (ఏఐ) యుగంలో జీవిస్తున్నాం. ఈ మధ్యకాలంలో విడుదలవుతున్న దాదాపు ప్రతి సాధనం (సాఫ్ట్‌వేర్) ఏఐ వెర్షన్‌ను అందిస్తూ ప్రస్తుత పోటీ ప్రపంచం లో నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఒక సర్వే ప్రకారం, ప్రతి ఇద్దరు భారతీయుల్లో ఒకరు ఏదో ఒక రూపంలో ఏఐ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. విద్యలో ఎఐ (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్) అనేది విద్యార్థులకు అభ్యాస అనుభవాలను వ్యక్తిగతీకరించడానికి ఎక్కువగా ఉపయోగిం చబడుతోంది. ఇది వారి నైపుణ్యాలు, ఆసక్తులు అభ్యాస శైలుల ఆధారంగా రూపొందించబడిన విద్యా కంటెంట్‌ను అందిస్తుంది. ఎఐ విద్యార్థుల పనితీరు డేటాను విశ్లేషిస్తుంది అభ్యాస ఇబ్బందులు లేదా అవగాహనలో అంతరాలను గుర్తిస్తుంది. బ్రిటానికా ఎడ్యుకేషన్ పరిశోధనల ఆధారంగా, మొదటి ఎఐ ప్రోగ్రామ్ 1951లో వ్రాయబడింది. 1950 లలో, బ్రిటిష్ లాజిషియన్ కంప్యూటర్ మార్గదర్శకుడు అలాన్ ట్యూరింగ్ ఒక యంత్రానికి ఆలోచించే సామర్థ్యం ఉందా అని ప్రశ్నించాడు. ఎఐ కేంద్ర భావనలను ప్రవేశ పెట్టాడు. తరువాతి దశాబ్దాలలో సాంకేతికత ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందుతూనే ఉంది. ఈ విధంగా తరగతి గదిలోకి ప్రవేశించింది. తరువాతి దశాబ్దాలలో సాంకేతికత తరగతి గదికి ప్రవేశించడంతో, కె 12 విద్యలో విశ్లేషణలకు ఎఐ పరివర్తన కలిగిస్తుందని నిరూపించబడిం ది. ఎఐ ఆధారిత సాధనాలతో ఈ పెరిగిన వినియోగం విద్యా, పర్యావరణ వ్యవస్థకు బోధన అభ్యాస అవకాశాలను ప్రభావితం చేసింది. ఒకే రకమైన అభ్యాసన పద్ధతులు విద్యార్థులకు భిన్నంగా నేర్చుకుంటున్నందున నిరాశ కలుగు తుంది. విద్యార్థులకు సంబంధిత లేదా ఆసక్తికరమైన విష యం దొరకకపోవడంతో వారు నిరాశకు లోనవుతారు. తర గతితో ముందుకు సాగడానికి విద్యార్థులకు తరచుగా కొన్ని



అంశాలపై అదనపు సహాయ సహకారాలు అవసరం అవుతాయి. మానవుల వలె ఆలోచించడానికి నేర్చుకోవ డానికి రూపొందించబడిన, ప్రోగ్రామ్ చేయబడిన కంప్యూ టర్లలో కృత్రిమ మేధస్సు మానవ మేధస్సును ప్రేరేపిస్తుం ది. ప్రస్తుతం, స్మార్ట్ కంటెంట్ అభివృద్ధి అనుకూలీక రించిన ట్యూటరింగ్ నుండి ఆటోమేటిక్ గ్రేడింగ్, వర్చువల్ తరగతి గదుల వరకు విద్యకు సంబంధించిన వివిధ రంగాలకు ఎఐ వర్తించబడుతుంది. ఇటువంటి సాంకేతికత, సాంప్రదాయ బోధనా పద్ధతులను విప్లవాత్మకంగా మార్చ డమే కాకుండా, మొత్తం అభ్యాస ప్రక్రియ ప్రాధాన్యతను మరింత పెంచడానికి అడ్డంకులను కూడా తొలగిస్తున్నాయి. సాంప్రదాయ బోధన విద్యార్థులు తమ సందేహాలకు వివ రణ కోరుకోవడానికి తరగతి గది సమయంపై ఆధారపడి ఉంటుంది. ఉపాధ్యాయులు పాఠాలతో ముందుకు సాగే ముందు ప్రశ్నలను పరిష్కరించడానికి నిర్దిష్ట సమయాన్ని కేటాయిస్తారు. కృత్రిమ మేధస్సు ఏకీకరణతో, ఉపాధ్యాయు లు వర్చువల్ అప్లికేషన్ల ద్వారా రియల్‌టైమ్ సహాయాన్ని అందించడం ద్వారా ఈ ప్రక్రియను మెరుగు పరచవచ్చు. ఇది విద్యార్థులకు అవసరమైనప్పుడల్లా తక్షణ సహాయం పొందడానికి వీలు కల్పిస్తుంది. తరగతి గదిబోధనను పూర్తి చేస్తుంది. ఉపాధ్యాయులు తరగతి సమయంలో మరింత లోతైన చర్చలు, వ్యక్తిగతీకరించిన మద్దతుపై దృష్టి పెట్టడా నికి వీలు కల్పిస్తుంది. ఇంగ్లీష్, మ్యాథ్స్ సబ్జెక్టులను పిల్లలకు సంపూర్ణంగా అర్థం అయ్యేలా బోధించాలని గత విద్యా సంవత్సరం (2024–2025) చివరిలో నిర్ణయించారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని ఏక్ స్టెప్ ఫౌండేషన్ సహకారంతో ప్రయోగాత్మకంగా పలు జిల్లాల్లో ఏఐ ఆధా రిత బోధనను విద్యాశాఖ స్టార్ట్ చేసింది. రాబోయే విద్యా సంవత్సరంలో వందల స్కూల్లో దాన్ని అమలు చేయను న్నారు. అందుకోసం యాభై మందికి మించి విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలకు కంప్యూటర్లు అందించాలని విద్యాశాఖ ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లో విద్యార్థులు వారి నైపుణ్యాలు మరింత మెరుగుపర్చుకునేలా వారి సామర్థ్యాన్ని పెంచేందుకు సర్కార్ వివిధ రకాలుగా పథకాలను సృష్టిస్తున్నారు. అంతేకాకుండా, విద్యార్థులకు వివిధ కోర్సులను, సబ్జెక్టులను కూడా బోధిస్తున్నారు. వారి పరిజ్ఞానం, నైపుణ్యం పెరిగేందుకు చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా రాష్ట్రంలోని సర్కార్ బడుల్లో విద్యార్థుల పఠన సామర్థ్యాలను పెంచేందుకు ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయిం చింది. ఇలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యార్థులు అధ్యాపకులు తెలియని విషయాలను తెలుసుకోవడం జరు గుతుంది. కృత్రిమమేధా ద్వారా తెలుసుకొని జ్ఞానాన్నిపొందు తున్నారు. భవిష్యత్తులో కూడా దీని ఉపయోగం, వినియో గం ఎక్కువగా అవసరమవుతుందని మేధావులు యోచిసు న్నారు. విద్యా సంస్థల స్థాయిలో డిజిటల్ పౌరసత్వం అనే అంశాన్ని పాఠ్యాంశాల్లో ప్రవేశపెట్టాలి. తల్లిదండ్రులు పిల్లల మొబైల్ వాడకాన్ని పర్యవేక్షించి, సరైన మార్గనిర్దేశనంచేయా లి. మీడియా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి, అశ్లీలతకు బలపడేకంటెంట్‌ను ప్రోత్సహించకూడదు. •

విజయవాడ వార్త

## అడ్మిన్ సెక్రటరీలు,ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి సర్వేను పూర్తి చేయాలి : డిప్యూటీ కమిషనర్ సృజన

**విజయవాడ కార్పొరేషన్,జులై 3,ప్రభాతవార్త:** ఇంటి పన్నులు ఉన్న అసెస్మెంట్లకు నగరపాలక సంస్థ జారీ చేస్తున్న డిమాండ్‌కు తగ్గట్టుగా ఉందా లేదా, ఒక వేళ అదనంగా రూములు నిర్మిస్తే,ఫ్లోర్లు నిర్మించినా, ఆ మార్పుకు తగ్గట్టుగా పన్నును సర్వే ద్వారా మార్చాలని,అడ్మిన్ స్థలాలు గానే ఉన్నాయా లేదా వాటిపై ఇల్లు నిర్మించారా,ఒకవేళ ఇళ్లను నిర్మిస్తే వాటికి తగ్గట్టుగా ఖాళీ స్థలాల పన్నును,ఇంటి పన్నుకు మార్చాలని, ఇంటి పన్నులు ఉన్న అసెస్మెంట్లకు నగరపాలక సంస్థ జారీ చేస్తున్న డిమాండ్‌కు తగ్గట్టుగా ఉందా లేదా,ఒకవేళ అదనంగా




సెక్రటరీలు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి ఖచ్చితంగా ఈ సర్వేను పూర్తి చేయాలని డిప్యూటీ కమీషనర్(రెవిన్యూ) జి.సృజన అన్నారు. మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు గురువారం ప్రధాన కార్యాయలం ఉన్న నూతన భవనంలోని మీటింగ్ హాల్లో రెవిన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నగరంలో జరుగుతున్న సర్వే స్థితిగతులను సమీక్షించారు. ఈ సర్వేలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ఖాళీ స్థలాలు,ఖాళీ రూములు నిర్మించినా,ఫ్లోర్లు నిర్మించినా,ఆ మార్పుకు తగ్గట్టుగా పన్నుఉ ఈ సర్వే ద్వారా మార్చాలని ఆమె పేర్కొన్నారు. అడ్మిన్‌లు,సెక్రటరీలు,ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి ఖచ్చితంగా ఈ సర్వేను పూర్తి చేయాలన్నారు. ప్రజలు కూడ సిబ్బంది తమ వద్దకు వచ్చినప్పుడు సహకరించాలని పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ కమీషనర్లు హెలెన్,బి.శ్రీనివాసరావు,ఏయూబి శర్మ,రెవిన్యూ ఆఫీసర్లు,ఇనస్పెక్టర్లు,అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## గొర్రెలకు,మేకలకు ఉచిత నట్టల నివారణ మందు పంపిణీ

**తిరువూరు, జులై 3, ప్రభాతవార్త :** తిరువూరు మండలం మల్లేల గ్రామంలో ఉదయం గొర్రెలకు మేకలకు ఉచిత నట్టల నివారణ మందు త్రాగించుట జరిగింది. 451 జీవాలకు మందులు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా.డి అభిలాష్, విఎఎస్ఎం గోపాలకృష్ణ, విఎల్‌వో భూక్యా విజయ్ ఎవిహెచ్ కెవి రామారావు, రైతులు గానుగపాడులో కూడా జరిగిన ఈ కార్యక్రమంలో డా.టి.శ్వేతా, విఎఎస్, పాల్గొన్నారు.



## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,జులై 3,ప్రభాతవార్త :** నగర సుందరీకరణకు ప్రత్యేక దృష్టి వహించాలని, నిర్మాణ వ్యర్థాలు,కేబుల్ వైర్‌లు,నగర సుందరీకరణానికి భంగం కల్గించేలా కన్పించినా వాటిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. గురువారం ఆయన తన పర్యటనలో భాగంగా ప్రకాశం బ్యారేజి,వన్‌టౌన్,ఎంజీ రోడ్,బెంజి సర్కిల్, రామవరప్పాడు,రింగ్ రోడ్డు ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రతి రోజు ప్లానింగ్ సెక్రటరీలు ఫీల్డ్‌లో తిరిగి నిర్మాణ వ్యర్థాలు ఎక్కడా లేకుండా చూసుకోవాలని అధికారులకు ఎప్పటికప్పుడు వాటిపై నివేదికను సమర్పించాలన్నారు. నగరాన్ని



పరిశుభ్రంగా,సుందరంగా ఉంచాలని ఎప్పటికప్పుడు రోడ్లను పరిశుభ్రపరుస్తూ వ్యర్థాలను వెంటనే తొలగిస్తూ ఉండాలని ప్రజారోగ్య సిబ్బందికి తెలిపారు. పగిలిపోయిన ఫుట్‌పాత్‌లు,పాడైపోయిన డివైడర్ల గుంతలు పడిన రోడ్లను ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు తీసుకుంటూ మరమ్మత్తులు చేయిస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో ఛీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి,చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్,ఇన్‌ఛార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీససర్ గోపాలకృష్ణ నాయక్,పర్యవేక్షణ ఇంజనీర్లు పి.సత్యన్నారాయణ,పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాసరెడ్డి,అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గంజెషకర్ మహాత్ముల జెండా గంధ మహోత్సవం

**ఎ కొండూరు, జులై 3, ప్రభాతవార్త :** హుజూర్ హజరత్ సర్కార్ సయ్యద్ బాబా ఫరీదుద్దీన్ గంజెషకర్ పాక్ పటన్ షరీఫ్ మహాత్ముల జెండా గంధ మహోత్సవాన్ని భారతదేశ నలుమూలల నుండి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి దర్బార్ అండ్ దర్గాకు కులమతాలకతీతంగా వచ్చిన వేలాది మంది భక్తులకు మహాదివ్య అన్న సమారాధన (లంగర్



మంగళవారం రాత్రి ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు ఎఎంటికె దర్బార్ బాబె ఎ బాగ్దాద్ షరీఫ్‌లో అలుపెరుగని అన్నదాత నఖీబుల్ ఔలియా హజరత్ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ తాజ్ ఖాదరీబాబా దర్బార్ అండ్ దర్గాలో బాబా వారి దివ్య ఆశీస్సులతో బాబా వారి ఆధ్యాత్మిక వారసుడు పీఠాధిపతి పీర్‌జాదా ముహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షాతాజ్ ఖాదరీ బాబా అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిపారు. ఈ సందర భంగా షరీఫ్) దిగ్విజయంగా నిర్వహించారు. అంతకు ముందు బాబా ఫరీదుద్దీన్ మహాత్ముల జెండా గంధ మహోత్సవాన్ని భక్తి శ్రద్దలతో నిర్వహించి జెండాను ప్రతిష్టించారు. అతావుల్లా బాబా భక్తులు బాబా వారి గంధాన్ని జెండాకు పూసి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వాస్తు శిల్పి దైవజ్ఞ జాఫర్ షరీఫ్, బొగ్గాది, తాజ్ ఖాదర్ బాబు, మదని భక్తులు పాల్గొని సేవలందించారు.

## చోరీ కేసులో నిందితుని అరెస్టు

### -రూ.6 లక్షల విలువైన 60 గ్రాముల బంగారం,50 గ్రాముల వెండి స్వాధీనం

**విజయవాడ క్రైం,జులై 3,ప్రభాతవార్త:** ఎన్టీఆర్ జిల్లా సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఇన్‌ఛార్జి డిసిపీ కెజివి సరిత పర్యవేక్షణలో సెంట్రల్ డివిజన్ ఏసిపి దామోదరరావు అధ్వర్యంలో గుణదల పోలీస్ స్టేషన్ సిఐ వాసిరెడ్డి శ్రీనివాసరావు



వారి సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి చోరీలు చేసే అనుమానితుల కదలికలపై పూర్తి నిఘాను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో సదరు ప్రత్యేక బృందానికి రాబడిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం ప్రభుత్వాసుపత్రి సమీపంలో వెహికల్ చెకింగ్ చేస్తున్న సమయంలో పోలీసు వారి తనిఖీలను గమనించి పారిపోవడానికి యత్నించిన ఒక వ్యక్తిని అదుపు లోకి తీసుకుని విచారించారు. సదరు వ్యక్తి వద్ద నుండి రూ.6లక్షల విలువ చేసే బంగారు,వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకుని అతనిని అరెస్ట్ చేశారు. విచారణలో సదరు వ్యక్తి అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన ఉయ్యాల రాజేష్‌గా తేలింది.ఈ సందర్భంగా గుణదల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎసిపి మాట్లాడుతూ ఇతను ఏడో తరగతి వరకు చదువుకొని కొంత కాలం కూలి పనులు చేసుకునేవాడు,జల్సాలకు అలవాటు పడి వచ్చిన డబ్బులు జల్సాలకు సరిపోక పోవడంతో చోరీలు చేయడం ప్రారంభించాడని తెలిపారు.ఇతనిపై సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైం సస్పెక్ట్ షీటు కూడ ఓపెన్ చేశారు. అతన్ని చివరి సారిగా 2024 సెప్టెంబరు నెలలో గుణదల పోలీసులు చోరీ కేసులో అరెస్ట్ చేసి జైలుకు పంపారని ,అనంతరం జనవరి నెలలో బెయిలుపై విడుదలై తన ప్రవృత్తిని తిరిగి కొనసాగించాడని పేర్కొన్నారు. ఈ నాలుగు నెలల కాలంలో ఇతను పటమట,రాజోలు,నూజివీడు,నర్సాపురం,నాయుడుపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలు చేశాడని పేర్కొన్నారు. సాంకేతిక ఆధారాలుపయోగించి గుణదల పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసులను ఛేధించడంలో కీలక పాత్ర పోషించిన గుణదల సిఐ వారి సిబ్బందిని ఈ సందర్భంగా అధికారులు అభినందించారు.

## కోటిన్నర వ్యయంతో శివదత్తసాయి మందిర నిర్మాణం

**ఎ కొండూరు, జులై 3, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రుడు గుంటక సుదర్శన్ రెడ్డి (అమ్ములుబాబు) మాతృభూమిపై ఉన్న మమకారంతో తన స్వంత గ్రామంలో భక్తుల్లో ఆధ్యాత్మిక చింతన దైవభీతి పెంపొందించాలనే ఒక ధార్మిక సంకల్పంతో



రూ.1.5కోటిన్నర స్వంత వ్యయంతో శివదత్త సాయి మందిర నిర్మాణం ఎంతో పట్టుదలతో స్వయంకృషితో 90శాతం నిర్మాణం పూర్తి చేశారు. ఇంకా 10శాతం నిర్మాణపనులను ఈ నెలాఖరుకు పూర్తిచేయనున్నట్లు తెలిపారు. ఆగష్టు 4న ఈ గుడి ప్రతిష్ట అట్టహాసంగా వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తామని తిరువూరు నియోజకవర్గం మైలవరం నియోజకవర్గం నూజివీడు నియోజకవర్గం విజయవాడ పార్లమెంటు పరిధిలోని వివిధ నియోజకవర్గాల నుండి వేలాదిగా భక్తులు ఆగష్టు 4న జరిగే ఈ గుడి ప్రతిష్ట మహోత్సవానికి హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రవాసాంధ్రుడు తండ్రి స్వర్గియ గుంటక లక్ష్మారెడ్డి స్థానికంగా హైస్కూల్ నిర్మాణం కొరకు భూరి విరాళం అందచేశారు. అలాగే ఎన్నారై అమ్ములు బాబు చుట్టుపక్కల గ్రామాల్లో అనేక సంఘ సేవా కార్యక్రమాలు ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

## వినగడప కట్టలేరుపై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం లేక ప్రజల అగచాట్లు

**ఎ కొండూరు, జులై 3, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం మండలం వినగడప తోటమూల గ్రామాల మధ్య నూజివీడు గంపలగూడెం ఆర్ అండ్ బి రాష్ట్ర రహదారిపై ఉన్న కట్టలేరు వాగు ఎగువన తెలంగాణ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు పొంగి ప్రవహిస్తోంది. ఈ కట్టలేరు యేరు చప్టాపై నుండి పొంది ప్రవహిస్తుండటం వల్ల సుమారు 100 గ్రామాల ప్రజలకు ఆంధ్రా తెలంగాణ రాష్ట్రాలకు రాకపోకలు స్థంభించి ప్రజా జీవనానికి ప్రతి ఏడాది వర్షాకాలంలో తుఫాన్



సమయంలో వరదపోటుకు ఆటంకం ఏర్పడుతుంది. గత తెలుగుదేశం ప్రభుత్వం తిరిగి మళ్లీ అధికారంలోకి వచ్చిన టిడిపి పాలకులు ఈ వాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా విమర్శించారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో తిరువూరు వచ్చినప్పటి సిఎం జగన్ ఈ కట్టలేరు వంతెన నిర్మాణానికి రూ.23కోట్లు కేటాయిస్తున్నానని అప్పటి ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి సమక్షంలో ప్రకటించినా ఆ వాగ్దానం నీటిమూటగానే మిగిలిందని ప్రజలు ఆక్షేపించారు.

## గత వైకాపా విధ్వంసక అరాచక పాలన నేడు సిఎం చంద్రబాబు కూటమి వికాసం వైపు పరిపాలన

**ఎ కొండూరు, జులై 3, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో జగన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసం అయిన తరుణంలో ప్రజలు తెలుగుదేశం కూటమికి పట్టంకట్టి సిఎం చంద్రబాబు గత లేకుండా ఛీ కొట్టిన జగన్‌రెడ్డి సిగ్గు లేకుండా చంద్రబాబు సుపరిపాలన తొలి అడుగులో సూపర్-6 పథకాలను విమర్శించడం జగన్‌రెడ్డి కళ్ళులేని కబోది అని కృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులు



సార్వత్రికి ఎన్నికల్లో ప్రజలకిచ్చిన సూపర్-6 పథకాలు ఒక్కొక్కటి అమలుచేస్తూ ప్రజలకిచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకుని వికాసం వైపు ప్రజలను రాష్ట్రాన్ని నడుపుతున్నారని ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్ర సిఎం చంద్రబాబు పిలుపు మేరకు నెల రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కంభంపాడు మత్రియా తండా గ్రామాల్లో బుధవారం గడ్డి కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌రెడ్డి అరాచక విధ్వంసక పాలనలో విసిగి వేసారిన ప్రజలు రైతులు వివిధ రంగాల కార్మికులు 11 సీట్లు ఇచ్చి కనీసం ప్రతిపక్ష హోదా కూడా నాయకులు ప్రజల్లో చొచ్చుకుని వెళ్లి కూటమి మంచి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించి ప్రజలను చైతన్యం చేయాలని కృష్ణారెడ్డి కోరారు. సిఎం చంద్రబాబు అహర్నిశలు రాష్ట్రాభివృద్ధి సంక్షేమాన్ని రెండు కళ్ళుగా భావించి సుపరిపాలన అందిస్తున్న విజనరీ సిఎం చంద్రబాబు అని రాబోయే రోజుల్లో ఎన్నికల్లో ప్రజల కిచ్చిన వాగ్దానాలన్నింటిని అమలు చేసి హామీలను నిలబెట్టుకుని ప్రజా క్షేత్రంలో ఇది మంచి ప్రభుత్వం అనే రీతిలో తెలుగు ప్రజలకు సేవలందిస్తుందని కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వనపర్ల దేవిడ్‌రాజు, కంభంపాడు గ్రామ టిడిపి అధ్యక్షుడు భీమాల నాగేశ్వరరావు, కొంగల కృష్ణ, వెంకటరత్నం, పందుబాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో ఇద్దరు నిందుతుల అరెస్టు

**ఎ కొండూరు, జులై 3, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు మైలవరం ఎసిపి తిరువూరు సిఐ ఎ కొండూరు ఎస్సై సిబ్బంది గత నెల 26న రెడ్డిగూడెం మండలం పాత మద్దుల పర్వ గ్రామానికి చెందిన కోట రామారావు(46)ను వివాహేతర సంబంధం కారణంగా హత్యచేసిన ఇద్దరు నిందితులను బుధవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు సిఐ గురువారం మీడియాకు తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం కోట



రామారావు అనే హతుడు కూనపరాజు పర్వ గ్రామానికి చెందిన బత్తుల కుమారిని గత కొంతకాలం నుండి తన కామవాంఛ తీర్చమని వేధిస్తున్నాడని ఈ విషయం తెలుసుకున్న తూర్పు మాధవరం గ్రామానికి చెందిన మరో ప్రియుడు ఎ చార్లెస్ కుమారితో కలిసి పథకం రచించి కుమారి ద్వారా కోరిక తీర్చుకునేందుకు ఎన్ఎస్‌పి కాల్వ పక్కన రఘుపతిరెడ్డి మామిడి తోటకు రావాలని రామారావును నమ్మించి పథకం ప్రకారం తోటలోకి రాగానే మాటువేసి ఉన్న కుమారి రెండో ప్రియుడు ఛార్లెస్ రామారావును లావుపాటి వెదురు కర్రతో తలపై బలంగా కొట్టి హత్య చేసినట్లు సిఐ తెలిపారు. ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేసి కోర్టుకు పంపుతున్నట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ తెలిపారు.

## ఉచిత నత్తల నివారణ మందు పంపిణీ

**ఎ కొండూరు, జులై 3, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామంలో ఎన్‌టిఆర్ జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం హనుమంతరావు గురువారం గొర్రెలు, మేకలకు ఉచిత నత్తల నివారణ మందు పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలంలో జులై 10వరకు అన్ని గ్రామాల్లో పంపిణీ చేయడం జరుగుతుందని జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హనుమంతరావు గురువారం ప్రభాతవార్తకు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎ కొండూరు మండల పశువైద్యాధికారి డాక్టర్ భరత్, సిబ్బంది, ఎ కొండూరు వైస్ ఎంపిపి గుంటక శివారెడ్డి పాల్గొన్నారు.



## అత్యంత విలువైన అగార్ ఉడ్ పై అవగాహన సదస్సు

**విజయవాడ, జులై 3, ప్రభాతవార్త :** అత్యంత విలువైన అగార్డ్ సమిష్టి వ్యవసాయ పెట్టుబడి, లాభాలపై మందిర డెవలపర్స్ వారి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎన్‌టిఎఫ్‌పి డైరెక్టర్ ప్రసాదరావు తెలిపారు. ప్రాచీన ఆయుర్వేదంలో విరివిగా వాడే అగార్‌వుడ్ ను మెడిసన్, సౌందర్య సాధనాల్లో కూడా వాడుతున్నారన్నారు. ఈశాన్యభారతంలో విరివిగా లభించే అగార్ ఉడ్ మొక్కలు ప్రస్తుతం కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఏపిల్లో సాగు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని ఎగుమతుల క్లియరెన్స్‌లు అందిస్తు కొన్ని వేలకోట్ల బిజినెస్ అంచనాతో ప్రోత్సహిస్తుందన్నారు. మందిర డెవలపర్స్ చైర్మన్ జివి శేషగిరి మాట్లాడుతూ తక్కువ కాలంలో కోట్లరూపాయల రాబడి అగార్ వుడ్‌తో లభిస్తుందన్నారు. ఒక లీటర్ అగార్‌వుడ్ ఆయిల్ ధర రు.70లక్షలుంటుందన్నారు.

## అర్ధవార్షిక అమ్మకాలు సాధించిన స్కోడా ఆటో ఇండియా

**విజయవాడ, జులై 3, ప్రభాతవార్త :** 2025 మొదటి అర్ధభాగంలో 36,194 యూనిట్ల అమ్మకాలను సాధించినట్లు స్కోడా ఆటోఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశీష్ గుప్తా తెలిపారు. 25 సంవత్సరాల చరిత్రలో అత్యధిక వార్షిక అమ్మకాలు నమోదు చేసిందన్నారు.

## అక్రమ పొగాకు వాణిజ్య నిర్మూలనకు పిఎంఐ సిద్ధం

విజయవాడ, జులై 3, ప్రభాతవార్త : అక్రమ పొగాకు వాణిజ్యం విచ్ఛిన్నం చేసేందుకు ధృడంగా చర్యలు తీసుకుంటున్నామని ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ ఇంక్ ఇండియా అనుబంధ సంస్థ ఐపిఎం ఇండియా ప్రతినిథులు తెలిపారు. ప్రపంచ నకిలీ ఉత్పత్తుల దినోత్సవాన అనధికార ఆర్థిక వ్యవస్థను ఎదుర్కొటానికి ప్రతిజ్ఞ చేశామన్నారు. నకిలీ పొగాకు వాణిజ్యం అరికట్టడం ద్వారా పొగాకు రైతుకు పిఎంఐ సహాయపడుతుందని, తద్వారా 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, గ్లోబల్ సౌత్‌కు నాయకత్వం వహించే భారతదేశం హోదాకు అనుగుణంగా వుంటుందన్నారు.

## స్మార్ట్ స్ట్రీట్‌లో స్టాల్స్ ఏర్పాటుకు ధరఖాస్తులకు ఆహ్వానం

**విజయవాడ కార్పొరేషన్,జులై 3,ప్రభాతవార్త:** విజయవాడ నగరపాలక సంస్థ అధ్వర్యంలో భవానీపురం,ఆర్టీసి వర్క్‌షాపు రోడ్‌లో ఎన్‌యుఎల్‌ఎం 2.0 పైలెట్ ప్రాజెక్ట్ కింద స్మార్ట్ స్ట్రీట్ ఏర్పాటు చేయడానికి టౌన్ వెండింగ్ కమిటీ తీర్మానించడమైందని,వీధి వ్యాపారుల జీవనోపాధి మెరుగుపర్చ డానికి,వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేయటానికి నగరపాలక సంస్థ వారు స్మార్ట్ స్ట్రీట్ నందు గూడ్స్ అండ్ సర్వీసెస్‌కు సంబంధించి 40 స్టాల్స్ ఏర్పాటు చేయడానికి నిర్ణయించారని ప్రాజెక్ట్ ఆఫీసర్(యుసిడి) తెలిపారు. ఈ నెల 7 నుండి 11 వరకు ఆసక్తి గల వీధి వ్యాపారులు ధరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ తెలిపారని ఆయన పేర్కొన్నారు. ధరఖాస్తు చేసుకున్న వీధి విక్రయదారులకు ఈ నెల 16న 17న ఉదయం 10.30 నుంఇ సాయంత్రం 5 గంటల వరకు విజయవాడ నగరపాలక సంస్థ టౌన్ వెండింగ్ కమిటీ (టివిసి) అధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరుపబడునని,అదే విధంగా,అనివార్య కారణాలతో వాయిదా లేక రద్దు పర్చడానికి కమీషనర్‌కు పూర్తి అధికారముందని ఆయన తెలిపారు.ధరఖాస్తు చేసుకోడానికి 18 సంవత్సరాలు పైబడిన వారు అర్హులని, అదే విధంగా ధరఖాస్తు దారులు ఖచ్చితంగా వీధి వ్యాపారులుగా ఉంటూ,విజయవాడ నగరపాలక సంస్థలో నమోదు కాబడిన వారై ఉండాలన్నారు. వారు తమ ఆధార్ కార్డు,రేషన్ కార్డు,పాన్ కార్డు,బ్యాంకు పాస్ బుక్కు,మూడు ఫొటోలతో నగరపాలక సంస్థ లోని యుసిడి విభాగం నందు ధరఖాస్తు చేయాలని ఆయన పేర్కొన్నారు.

## గోశాలను సందర్శించిన వ్యవసాయశాఖ చీఫ్ సెక్రటరీ

**మంగళగిరి, జులై 3, ప్రభాతవార్త :** పెదవడ్లపూడి భగవాన్ శ్రీ సత్య షిరిడి సాయిబాబా మందిరం గోమాత గోశాలను గురువారం వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బీ రాజశేఖర్, డైరెక్టర్ ఢిల్లీరావుతో కలిసి సందర్శించారు. స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయంలో గ్రామంలోని రైతులు, వ్యవసాయ అధికారులతో జరిగిన



సమావేశానికి వారు హాజరై అనంతరం గోశాలను సందర్శించారు. గోశాల నిర్వహణ, గోవుల గురించి చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ గోశాల కన్వీనర్ పాతూరి శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. గోవులకు వేసే దాణా గురించి ఆయన అడిగారు, దీంతో శ్రీనివాసరావు ప్రకృతి వ్యవసాయం ఆధారితంగా వచ్చే పచ్చి గడ్డి, డ్రై ఫీడ్ దాణా వేయడం జరుగుతుందన్నారు. పది రకాలతో దాణా ఏర్పాటు చేసి రాజశేఖర్ ద్వారా గోవులకు తినిపించారు. గోశాల నిర్వహణ తీరుపై, కన్వీనర్ శ్రీనివాసరావును ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చరల్ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఐ నాగేశ్వరరావు, జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రాజకుమారి, మంగళగిరి పశువైద్యశాల ఏడి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి శైలజ, గోశాల కన్వీనర్ పాతూరు శ్రీనివాసరావు, దేశం నాయకులు అన్నే శరత్, ముసునూరి నాగయ్య, అన్నే ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మేడిన్ఇండియా సర్జికల్ రోబోట్ యాత్ర ప్రారంభం

**విజయవాడ, జులై 3, ప్రభాతవార్త :** ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ ఆధ్వర్యంలో గురుగ్రామ్లోని ప్రధాన కార్యాలయం నుండి మేడిన్ఇండియా ఎస్ఎస్ఐ మంత్రం సర్జికల్ రోబోట్ యాత్రను హర్యానా ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి రావ్ సర్బీర్‌సింగ్ చేతులమీదుగా ప్రారంభించినట్లు సంస్థ నిర్వహకులు తెలిపారు. దేశంలోని మొదటిగా మొబైల్ రోబోటిక్ శస్త్రచికిత్స శిక్షణ, ప్రదర్శన యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ వినూత్న టెలిసర్జరీ ఆన్ వీల్స్ ఆధునిక సర్జికల్ సాంకేతికతను శిక్షణావకాశాలను హాస్పటల్స్ వైద్య నిపుణుల వద్దకు తీసుకెళుతుందన్నారు.

## టొయోటా సర్వీస్‌క్యాంపెయిన్లో ఆఫర్ల వెల్లువ

**విజయవాడ, జులై 3, ప్రభాతవార్త :** సర్వీస్, టైర్లు, ఉపకరణాలు, మరిన్నింటిపై అద్భుతమైన ఆఫర్లను టొయోటా సర్వీస్ క్యాంపెయిన్లో అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిథులు తెలిపారు. వర్షాలకు మీ వాహనాన్ని సిద్ధంచేయడం, ఇంటీరియర్ రిఫ్రెషింగ్, టైర్, బ్యాటరీ తనిఖీలు, 20 పాయింట్ల ఉచిత వాహన తనిఖీ, లేబర్ చార్జీల్లో 10శాతం తగ్గింపు, టిగ్లోస్ మన్నూన్ కేర్ ప్యాకేజ్‌పై 10శాతం తగ్గింపు, విండ్‌షీల్డ్ పాలిష్, హెడ్లాంప్ పునరుద్దరణ, వాసన తటస్థీకరణ లందిస్తామన్నారు.

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL SENIOR CIVIL JUDGE: MEDCHAL-MALKAJGIRI DISTRICT: AT MALKAJGIRI
IA No. 420 OF 2025
IN
OS No. 1837 OF 2007
Between:
**Ramidi Malla Reddy (Died) as per LRs ...Petitioners/Plaintiffs**
AND
**Ramidi Narasimha Reddy (Died) as per LRs ...Respondents/Defendants**
To,
**28. MD Kalamuddin** S/o. MD. Suleman Aged 44 years, Occ: Business, R/o. H.No. 67-6-12, Patamata Ramalyam Veedhi, Krishna, Vijayawada.
Please take notice in the above IA that the petitioners/plaintiffs herein have filed the above suit for partition and separate possession against you before the Hon'ble Court. Therefore, you, the above respondent / defendant, hereby informed that if you have got any objection or interest should appear and file the same before the above said Hon'ble Court on **15/07/2025 at 10.30 A.M** through counsel or in person failing which the matter will decided on merits.
(BY ORDER OF THE COURT)
**Sd/- KOTA RAMCHANDRA REDDY**
**Advocate**
**M/S. KOTA LAW ASSOCIATES**
H.No. 40-254/1/1, Raghavendra Nagar, Moula Ali, Hyderabad-40.
**Cell No. 98493 25055.**

# అరాచక పాలనకు విముక్తి కలిగి యేడాది : ఎమ్మెల్యే యరపతినేని

**గురజాల, జూలై 3 ప్రభాతవార్త:** అరాచక పాలనకు విముక్తి కలిగి యేడాది పూర్తయిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి యేడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గురువారం



మండలంలోని రామాపురం క్యాంపు, మాడుగుల, చర్లగుడిపాడు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. పింఛన్ పెంపుదల, దీపం 2, అన్న క్యాంటీన్, తల్లికి వందనం, డీఎస్సీ ఇలా ఎన్నో పథకాలను అమలు చేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం ఎంతో భయాందోళన ఉందన్నారు. మైనింగ్, బెదిరింపులు, ఇచ్చిన మాటను తుంగలో తొక్కడం, అక్రమ అరెస్టులతో రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం కంపెనీలు రాష్ట్రానికి పిలిచి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో యువతను రెచ్చగొట్టి భవిష్యత్తు లేకుండా కేసులు బనాయించడం, అక్రమంగా అరెస్ట్ చేయడం, అభివృద్ధి లేకుండా చేశారన్నారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి తప్ప వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. మాడుగుల గ్రామంను తాను వ్యక్తిగతంగా దత్తత తీసుకొని గురుకుల పాఠశాల, సీసీ రోడ్లు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మండలంలో పుణ్యక్షేత్రమైన దైద బిలాన్ని పుష్కర ఘాటు ఏర్పాటు చేసి అభివృద్ధి చేశామని, గురజాల ప్రభుత్వ కళాశాల, పట్టణంలో రోడ్ల విస్తీర్ణం అన్నీ టీడీపీ హాయంలోనే జరిగాయని అన్నారు. ఇప్పటికి వైసీపీ ప్రజలకు కళ్లబొల్లి మాటలు చెప్పడానికి ప్రయత్నం చేస్తోందని, ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కళ్లం రాజశేఖరరెడ్డి, నాగార్జునసాగర్ కుడి కాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు, టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, చావా రామారావు, యాగంటి రామారావు, పోటు నాగేశ్వరరావు, పదో వార్డు కౌన్సిలర్ నేలవల్లి బొల్లయ్య, శరమాల హనుమంతురావు, శివనాగు, వేముల విశ్వేశ్వరరావు, పల్చూరి నాగేశ్వరరావు, కోయ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : కొమ్మాలపాటి

**నరసరావుపేట, జూన్ 3 ప్రభాతవార్త :** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏడాది పాలన విజయవంతంగా సిఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పూర్తి చేసుకోవడం



జరిగిందన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో గ్రామ, మండల, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జి నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలన్నారు. ఏడాది కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.12 వేల కోట్ల ఖర్చుతో 20 వేల కిలో మీటర్ల రోడ్లను బాగు చేసినట్లు తెలిపారు. చెత్త పన్నును రద్దు చేసి ప్రజలకు ఊరట కలిగించామన్నారు. ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోపే రూ.9 లక్షల కోట్లను రాష్ట్రానికి పెట్టుబడులుగా తీసుకురావడం జరిగిందన్నారు. మంచి ప్రభుత్వానికి మద్దతుగా ఉండాలని ప్రజలను కొమ్మాలపాటి శ్రీధర్ కోరారు.

# తిమ్మాపురం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు

**నూజెండ్ల,జులై3,ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని మండలంలోని తిమ్మాపురం గ్రామంలో మండల తెదేపా



నాయకులు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి బచ్చు అంజిరెడ్డి, బోట్ల అంజయ్య,శ్రీను,నాసరయ్య, చిన్న, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 10న గురు పూర్ణిమ వేడుకలు

**పొన్నూరు, జూలై 3,ప్రభాతవార్త:** పట్టణంలోని తెలగపాలెం రామమందిరం సమీపంలోని జీబిసి రోడ్డు పక్కన కొలువై వున్న శ్రీ షిరిడి సాయి మందిరంలో ఈ నెల 10వ తేదీన గురు పూర్ణిమ వేడుకలను నిర్వహించనున్నట్లు శ్రీ షిరిడి సాయి కార్యవర్గం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వివిధ రకాల కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి రోజు భజన, సంకీర్తన కార్యక్రమాలు, హారతి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. గురువారాన్ని పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి ప్రీతిపాత్రమైన అప్పాలు, చపాతీలు, నారికేళములు, కథలీఫలములు తదితరాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



# పొదుపు చేయడం ప్రతి ఒక్కరి కర్తవ్యం

### -మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఊహారాణి

**పొన్నూరు, జూలై 3,ప్రభాతవార్త:** ప్రతి వ్యక్తి సంపాదనలో 20శాతం పొదుపు చేయాలన్నదే



భారతీయ రిజర్వు బ్యాంకు ఉద్దేశమని చేబ్రోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.ఊహారాణి అన్నారు. చేబ్రోలు ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగడమనేది పొదుపు చేయడం ద్వారా సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ల్యాప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి స్యాల్మన్‌పాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ సర్వే ప్రకారం పురుషులకంటే మహిళలు సంపాదనలో 84శాతం పొదుపు చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ భారం ఎక్కువగా పేద మహిళలపై ఉందన్నారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఖచ్చితమైన లావాదేవీలు నడపాలని, డిపాజిట్లుగా ఉంచకూడదన్నారు. సిబిల్ స్కోర్ కలిగి బ్యాంకు ద్వారా రుణాన్ని పొంది వ్యాపారాభివృద్ధి పొందాలన్నారు. గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ సంధ్య మాట్లాడుతూ బ్యాంకు ద్వారా ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్షలాంటి బీమా సౌకర్యాలను కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆయా సంస్థలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఎఓ ఉమాదేవి, వెలుగు ఏపిఎం శ్రీలక్ష్మి, ల్యాప్ సంస్థ రీసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు, షేక్ బాజి, తురకా మంగయ్య,ఆంజనేయులు, లీలమ్మ, అరుణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## శకుంతల హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**నరసరావుపేట, జూన్ 3 ప్రభాతవార్త :** శకుంతల హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. వివరాలను డాక్టర్ ఐలా శ్రీనివాస్ తెలిపారు. సాతులూరు గ్రామంలోని పాలకేంద్రం వద్ద గ్రామ పెద్దల సహకారంతో వైద్య



శిబిరంఏర్పాటు చేసారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్‌తో పాటు డాక్టర్ దత్తు, వారి సిబ్బంది హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా వారికి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేసారు. రోగులకు షుగర్, బిపి, థైరాయిడ్ వంటి సమస్యలకు పలు సూచనలు చేసారు. మొత్తం 100మందికి పైగా తమ ఆరోగ్య సమస్యలు వైద్యులకు తెలియచేసారు. కార్యక్రమంలో గ్రామస్తులను ఉద్దేశించి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ శకుంతల వైద్యశాలలో అందించే వైద్య సేవలను వివరించారు. అత్యధునిక వైద్య పరికారాలు, నిపుణులైన వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. శకుంతల వైద్యశాలలో అందించే సేవలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా డాక్టర్ ఐలా శ్రీనివాస్ కోరారు.

## త్రికోటేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.82,05,746,000 లు

**నరసరావుపేట టౌన్, జూన్ 3 ప్రభాతవార్త :** మండలంలోని కోటప్పకొండపై వేంచేసియున్న



శ్రీ త్రికోటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపులను గురువారం ఆలయ కార్య నిర్వహణాధికారి, సహాయక కమిషనర్ చంద్రశేఖరరావు పర్యవేక్షణలో నిర్వహించారు. మొత్తం 126 రోజులకు గాను హుండీ లెక్కింపులు జరిగినట్లు ఈవో తెలియజేశారు. కొండ పై భాగాన ఉన్న హుండీలకు సంబంధించి రూ.74,54,621,00 లు ఆదాయం వచ్చిందన్నారు. అదే విధంగా కొండ క్రింద భాగమున రూ.1,72,385,00లు, అన్నదానానికి రూ.5,78,740,00లు భక్తులు సమర్పించారని తెలిపారు. అదే విధంగా హుండీల నందు బంగారం 28 గ్రాములు, వెండి 562 గ్రాములు రావడం జరిగిందన్నారు. మలేషియాకు సంబంధించి ఒక డాలర్, బంగ్లాదేశ్‌కు సంబంధించి 12 నోట్లు, సింగపూర్‌కు సంబంధించి రెండు డాలర్లు, అమెరికన్ డాలర్స్‌కు సంబంధించి 48 డాలర్స్ వచ్చినట్లు ఆలయ ఈవో చంద్రశేఖరరావు తెలియజేశారు.

# ఏఐ-నేటి అవసరంగా మారిపోయింది

### -ఏపిఎస్ఎస్‌డీసి మాజీ సీఈవో, ఎండి గంటా సుబ్బారావు


పొన్నూరు, జూలై 3,ప్రభాతవార్త: ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అనేది భవిష్యత్‌ను మలచే సాదనం మాత్రమే కాదు, నేటి అవసరంగా మారిపోయిందని ఏపిఎస్ఎస్‌డీసి మాజీ సీఈవో, ఎండీ గంటా సుబ్బారావు అన్నారు. విద్యార్థులు ఏ



విభాగంలో ఉన్నా ఏఐపై ప్రాథమిక అవగాహన ఉండాల్సిన అవసరం ఏర్పడిందన్నారు చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ అకడమిక్స్, అస్సెస్‌మెంట్, అవార్డ్స్ అండ్ ఫ్యాకల్టీ అఫైర్స్ ఆధ్వర్యంలో ఇంటరాక్టివ్ సెషన్ ఆన్ ఏఐ ఫోకస్డ్ యూనివర్సిటీ అనే అంశంపై యూనివర్సిటీలోని ఆయా విభాగాల డీన్స్, డైరెక్టర్స్ విభాగాధిపతులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంటా సుబ్బారావు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక యుగంలో ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యత దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. పరిశ్రమలే కాదు, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, న్యాయవ్యవస్థ, ప్రజాసేవ వంటి అన్ని రంగాలలో ఏఐ విస్తృతంగా విస్తరిస్తోందన్నారు. అందుకు అనుగుణంగా విజ్ఞాన్స్ యూనివర్సిటీలో అందుబాటులో ఉన్న కోర్సులు విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వారిని సిద్ధం చేయడం చాలా మంచి విషయమన్నారు. విజ్ఞాన్ విశ్వవిద్యాలయం అందిస్తున్న ఈ కోర్సులు ఇంటర్ ప్రొడెసిప్లినరీ యాక్సెస్ కలిగించే విధంగా రూపొందించడం వల్ల విద్యార్థులను కేవలం ఉద్యోగం కోసం కాకుండా పరిశోధన, ఆవిష్కరణ దిశగా నడిపించే మార్గంగా నిలుస్తుందన్నారు. మరో అతిథి మద్రాస్ పూర్వ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ ఎన్.శివప్రసాద్ మాట్లాడుతూ విద్యా విధానాలను పూర్తిస్థాయిలో డేటా ఆధారంగా రూపుదిద్దడం, విద్యార్థుల వ్యక్తిగత అవసరాలకు తగిన విధంగా అభ్యాసాన్ని మలచడం, విద్యాసంస్థల నిర్వహణలో ఏఐ వినియోగంపై అధ్యాపకులు దృష్టి సారించాలన్నారు. విద్యా, పరిశోధన, పరిశ్రమల మధ్య గల వ్యత్యాసాలను తగ్గించడానికి యూనివర్సిటీల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పరిశ్రమ, అభ్యాస, పరిశోధన వంటి అన్ని రంగాలలో ఏఐని సమగ్రంగా ఎలా అనుసంధించాలి అనే అంశంపై చర్చించారు. మౌలిక సదుపాయాలు, శిక్షణ, విధానాలను ఆధునీకరించాల్సిన అవసరం ఉందని సూచించారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వీసీ కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

# వైకాపా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డికి కలిసిన నాయకులు

**నరసరావుపేట , జూన్ 3 ప్రభాతవార్త :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని గురువారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణంలోని వివిధ వార్డుల నుండి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కలిసారు.



ఆయనకు శుభకాంక్షలు తెలిపారు. శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కారించారు. ఈసందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్నా నాయకులు, కార్యకర్తలతో డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడారు. మాజీ సియం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన పై నమ్మకంతో జిల్లా బాధ్యతలను అప్పగించటం సంతోషంగా ఉందన్నారు. వారి నమ్మకాన్ని ఖచ్చితంగా నిలబెట్టు కునే విధంగా జిల్లాలో పార్టీని ముందుకు తీసుకుని వెళతామన్నారు. అన్ని నియోజకవర్గలలో పార్టీ అనుబంధ విభాగాలనుపటిష్టం చేయటం జరుగుతుందన్నారు. అదే విధంగా కూటమి సర్కారు మోసాలను ప్రజలకు వివరిస్తామని, తిరగి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకునేందుకు అందరూ కృషి చేయాలని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.

## భారీ వాహనాల డ్రైవర్లకు సిపిఆర్‌పై శిక్షణ

**నరసరావుపేట, జూన్ 3 ప్రభాతవార్త :** భారీ వాహనాల డ్రైవర్లకు రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో సిపిఆర్‌పై శిక్షణా కార్యక్రమాన్ని గురువారం



ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రహదారి భద్రత కమిటీ మెంబర్, రోడ్లు, భవనాలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.రాజానాయక్ పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమానికి సెంటర్ నిర్వాహకులు బి.కె.దుర్గపద్మజా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలపై ఎటువంటి భారం లేకుండా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం సంతోష మన్నారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. సుమారు రూ.20 లక్షలను ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ యోజన కింద బ్యాంక్ ద్వారా రుణం తీసుకొని ఎంఎస్ఎంఈ యూనిట్‌గా శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించడమే లక్ష్యంగా రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్‌ను ప్రచారాల ద్వారా నిర్వహిస్తున్నట్లు బి.కె.దుర్గపద్మజా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సభ్యులు బంగారయ్య, సాంబశివరావు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డెంగ్యూ మాసోత్సవాలు

**కారంపూడి, జులై 3 ప్రభాతవార్త:** కారంపూడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డా॥



ఎం.రమ్య, డా॥ కె.లక్ష్మీమౌనిక ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. దోమలు కుట్టడం ద్వారా వ్యాపించే వ్యాధులు మలేరియా, చికెన్ గున్యా, డెంగూ ఫీవర్, ఫైలేరియా, మెదడువాపు గురించి, నివారణ చర్యలు దోమలు పుట్టకుండా, దోమలు కుట్టకుండా ఇంటి పరిసరాల్లో చేపట్టాల్సిన చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది సీహెచ్ఓ కె.మల్లయ్య, ఎంపీహెచ్ఈఓ ఎస్‌కే రసూల్, సూపర్‌వైజర్స్ టి.అంకమరావు, కె.వి.మణి, ఇ.శ్రీనివాసరావు, ఆరోగ్య సహాయకులు ఎం.లాలునాయక్, టి.రామ మోహన్, ఏఎన్ఎం జి.ఈశ్వరి, ఆశ కార్యకర్తలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు

### -అర్బన్ సిఐ లావూరి వీరానాయక్

**పొన్నూరు, జూలై 3,ప్రభాతవార్త:** శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా వదిలిపెట్టే ప్రశ్నే లేదని అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ హెచ్చరించారు. పట్టణంలోని డీవీసీ



కాలనీలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీవీసి కాలనీలోని ప్రతి వీధిలో పోలీసులు పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. అసాంఘిక కార్యక్రమాలు ఏమైనా జరుగుతున్నాయా..?అనే విషయాలపై ఆరా తీశారు. కొత్త వ్యక్తులు ఎవరైనా కాలనీలో సంచరిస్తున్నట్లు గుర్తిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. మద్యం బహిరంగ ప్రదేశాల్లో సేవించడం చట్టరీత్యా నేరమన్నారు. అదేవిధంగా పేకాట, కోడిపందాలు తదితర జూదాలను నిర్వహించినా, ప్రోత్సహించినా, ఆడినా నేరమన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు డ్రగ్స్‌కు అలవాటుపడితే జీవితాన్ని నాశనం చేసుకోవడమే అవుతుందన్నారు. కాలనీవాసులకు ఏ అవసరం వచ్చిన పోలీస్ స్టేషన్‌లో పోలీసులను సంప్రదించవచ్చున్నారు. ప్రతి ఒక్కరూ స్నేహ భావంతో మెలగాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహించడమే ప్రధాన ఉద్దేశంగా పోలీసులు పనిచేస్తున్నారన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మీకు లాటరీ తగిలిందనో...మీ ఫోన్ నెంబర్ మీద పలానా దానికి ఎంపికయ్యారనో మీకు ఎవరైనా ఫోన్ చేస్తే వాటి జోలికి వెళ్ళవద్దన్నారు. అదేవిధంగా ఓటీపిని ఎవరికీ తెలియజేవద్దని చెప్పారు. ప్రస్తుతం సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# డిగ్రీ ఫలితాలలో కృష్ణవేణి విద్యార్థులకు అత్యధిక మార్కులు

నరసరావుపేట, జూన్ 3 ప్రభాతవార్త : డిగ్రీ ఫలితాలలో కృష్ణవేణి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. వివరాలను ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలియజేశారు. బుధవారం విడుదల చేసిన సెకండ్ బిఎస్సీ, బికాం కంప్యూటర్స్ ఫోర్త్ సెమ్ ఫలితాలలో కృష్ణవేణి డిగ్రీ విద్యార్థులు యూనివర్శిటీ స్థాయి మార్కులు సాధించడం జరిగిందన్నారు. ఎం.ప్రశాంత్, వై.వెంకటనాగలక్ష్మి, ఇ.దీపికరెడ్డి, వి.వి.ఎన్. మల్లేశ్వరి, పి.భాగ్యలక్ష్మి, షేక్.మీరా, పి.నాగేశ్వరి, బిఎస్సీలోని వివిధ విభాగాలలో అత్యధిక మార్కులు సాధించారు. బిసిఏలో షేక్.ఇష్రాత్



అత్యధిక మార్కులను సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు యోగేశ్వరరావు, సురేఖ, బాలకోటేశ్వరరావు పాల్గొన్నారు.

# బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి

### -మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్

**పొన్నూరు, జూలై 3,ప్రభాతవార్త:** ప్రతి పాఠశాల పరిధిలో బడిబయట పిల్లలను బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో



పనిచేయాలని మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, గ్రామ, వార్డు ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడం కష్టమేమీ కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే విషయంలో ప్రత్యేక ప్రణాళికలను రూపొందించుకొని ముందుకు సాగాలన్నారు. యుడైస్‌లో అందరు విద్యార్థుల వివరాలను నమోదు చేయాలన్నారు. నూరుశాతం అపార్ జనరేట్ చేయాలన్నారు. ఉపాధ్యాయుల, విద్యా ర్థుల హాజరును సకాలంలో పూర్తి చేయాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనానికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. విద్యార్థుల సర్వతోముఖా భివృద్ధికి ఉపాధ్యాయులే కీలకమన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కుంకలగుంట గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించిన డాక్టర్ సాయికృష్ణ

**నకరికల్లు, జూన్ 3 ప్రభాతవార్త :** మండలంలోని కుంకలగుంట గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని



బుధవారం ప్రముఖ వైద్యులు, టిడిపి నాయకులు డాక్టర్ సింగరాజు సాయికృష్ణ నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలో గత ఏడాది పాలనలో జరిగిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఇంటింటికి వెళ్ళి జరుగుతున్న కార్యక్రమాలను తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో అద్భుతమైన పాలన జరుగుతుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి సహకారం అందిస్తుందన్నారు. ఇప్పటికే తల్లికి వందనం పథకం అందించారని, ప్రతి నెల పెన్షన్ ఇస్తున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వంలో కష్టపడిన ప్రతి కార్యకర్తను అధిష్ఠానం గుర్తిస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించే విధంగా తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు గడపగడపకు వెళ్ళి జరుగుతున్న అభివృద్ధిని వివరించాలని డాక్టర్ సింగరాజు సాయికృష్ణ తెలియజేశారు.

# అప్పాపురం గ్రామానికి చెందిని జి సహదేవుడు భౌతికకాయానికి నివాళులు అర్పించిన మర్రి రాజశేఖర్

**నాదెండ్ల,జులై3,ప్రభాతవార్త:** మండలంలోని అప్పాపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు గుమ్మడి గోపాల్రావు తండ్రి సహదేవుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. విషయం తెలుసుకున్న మర్రి రాజశేఖర్ అప్పాపురం గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి సహదేవుడి భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. రాజశేఖర్‌తో పాటు సోమేపల్లి వెంకటసుబ్బయ్య,



సోమేపల్లి వాసు, నాయుడు రమేష్, పెదవలి చినబాబు, నార్నె హనుమంతురావు, కె రామకృష్ణ, గుమ్మడి అప్పారావు, డి అప్పారావు,టి సాంబశివరావు, ఎన్ హరిబాబు, జి రామారావు, కె జయరావు, టి అప్పయ్య, బి ఆంజనేయులు, కె వెంకటసుబ్బారావు, టి శ్యాం, అక్బర్‌ఖాన్, హరిబాబు, ఎమ్ఎస్‌కె సుభాని, కందుల హరీష్‌లు పాల్గొని నివాళులు అర్పించారు.

# భక్తుల సౌకర్యార్థం అరుణాచలంకు ప్రత్యేక బస్ సర్వీసులు

**నరసరావుపేట టౌన్, జూన్ 3 ప్రభాతవార్త :** నరసరావుపేట ఆర్టీసీ బస్ డిపో నుండి భక్తుల సౌకర్యం కొరకు ఈ నెల 8వతేదీన అరుణాచలం వెళ్ళేందుకు ప్రత్యేక బస్ సర్వీసులను ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ అరుణాచలంకు భక్తుల కొరకు ఏర్పాటు చేసిన బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలన్నారు. టిక్కెట్లను ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చని, లేదా స్వయంగా బస్టాండ్‌కు వచ్చి రిజర్వేషన్ చేయించుకోవచ్చున్నారు. 8వతేదీ రాత్రి బయల్దేరి శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం వెళ్ళడం జరుగుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో 10వతేదీ ఉదయం నరసరావుపేటకు బస్సు సర్వీసు చేరుతుందన్నారు. టిక్కెట్ ఒక్కరికి రూ.2550లుగా నిర్ణయించడం జరిగిందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు తెలియజేశారు.

# తెదేపా కౌన్సిలర్ కంచర్ల కరుణను పరామర్శించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,జులై3,ప్రభాతవార్త:** టిడిపి 23వ వార్డుకు చెందిన మహిళా కౌన్సిలర్ కంచర్ల కరుణ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. కాగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పట్టణంలోని పద్మసాలీపేట బజారులో ఉన్న వారి నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ప్రత్తిపాటితో పాటు టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు,



షేక్ కరిముల్లా, కందుల రమణ, గంగా శ్రీనివాసరావు, కంచర్ల శ్రీనివాసరావు, మేకపోతుల బొల్లయ్య, తెల్లబాటి మోహనకృష్ణ, వార్డు నాయకులు పాల్గొన్నారు.

# సుపరిపాలనలో తొలి అడుగులు

## వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్సీ ఆలపాటి

**తెనాలి, జులై 3 (ప్రభాతవార్త) :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాను సారం సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు గురువారం శాసన మండలి, సభ్యులు, తెనాలి మత్తులో కొందరు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, బయటకు రావాలంటే భయం వేస్తోందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా



నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పట్టణంలోని 24, 25వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పథకాలు గురించి తల్లికి వందనం, పెన్షన్లు పంపిణీ గురించి తెలుసుకుని ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కారిస్తామని ప్రజలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు గంజాయి, మద్యం ఆలపాటి మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో కూటమి ప్రభుత్వం కఠినంగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మాజీ మున్సిపల్ ఛైర్మన్ పెండేల వెంకట్రావు, ఎం.డి.ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, జెట్టి రునుక, వసంతం అశోక్, పినపాటి రవీంద్ర, అత్తోట శరత్, మైలా కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు పెంచటంతో ప్రజారోగ్యానికి మేలు

### -ఏజీఎం శ్రీనివాసన్

కొల్లిపర,జూలై 3 ప్రభాతవార్త: మొక్కలు నాటి వాటిని పెంచటంతో ప్రజారోగ్యానికి మేలు జరుగుతుందని ఏజీఎం శ్రీనివాసన్ అన్నారు.గురువారం వనమహోత్సవంలో భాగంగా విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు మొక్కలను నాటారు.ఈ సందర్భంగా శ్రీనివాసన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటటం సామాజిక బాధ్యతగా తీసుకోవాల న్నారు. కొల్లిపర బ్రాంచి ఛీఫ్ మేనేజర్ బాజీబాబా



మాట్లాడుతూ వర్షాలు సకాలంలో పడాలంటే చెట్లను పెంచాలన్నారు.కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు సూపర్‌వైజర్ టి.ప్రవీణ్,పీఏసీఎస్ సీఈవో గుదిబండి శివనాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

## నాగార్జునసాగర్, పులిచింతల జలాశయాల్లో చేపల వేట నిషేధం అమలు

**విజయపురిసౌత్, జులై 3 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉత్వర్వుల మేరకు పల్నాడు జిల్లాలోని నాగార్జునసాగర్, కెఎల్‌రావు పులిచింతల రిజర్వాయర్లలో రెండు నెలలపాటు చేపల వేట నిషేధిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.సంజీవరావు గురువారం తెలిపారు. రిజర్వాయర్లలో చేపల సంతానోత్పత్తి సమయం జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు 62 రోజులపాటు చేపల వేట నిషేధం అమలవుతుందన్నారు. ఈ సమయంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. ఎవరైనా అతిక్రమిస్తే వారి లైసెన్సు రద్దు చేయడంతోపాటు అపరాధ రుసుం విధించబడుతుందని ఆయన హెచ్చరించారు.



## నేడు మాచర్ల పట్టణంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం

**మాచర్ల, జులై 3 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలోని సుద్దగుంతల, పీడబ్ల్యూడీ కాలనీల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్తు శాఖ అధికారులు తెలిపారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి వస్తున్న 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు

## సేవలకు గుర్తింపుగా అవార్డులు అందుకున్న మాచర్ల రోటరీ క్లబ్

**మాచర్ల, జులై 3 ప్రభాతవార్త:** రోటరీ జిల్లా 3150కు సంబంధించి 2024-25 సంవత్సరానికి రోటరీ సేవా అవార్డుల ప్రధాన




కార్యక్రమం హైదరాబాదులో ఘనంగా జరిగింది. ఈ అవార్డుల ప్రధానోత్సవంలో మాచర్ల రోటరీ క్లబ్ సేవలకు గుర్తింపుగా ఎనిమిది సర్టిఫికెట్లు సభ్యులు అందుకున్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల కార్యవర్గ సభ్యులు అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, ట్రెజరర్ అన్నపురెడ్డి లక్ష్మి, డిప్యూటీ గవర్నర్ కొండవీటి రామకోటయ్య ద్వారా అందుకున్నారు. వీటితోపాటుగా వ్యక్తిగత అవార్డు పిల్లర్ ఆఫ్ ది రోటరీ క్లబ్ మాచర్ల అవార్డును డాక్టర్ కొండవీటి రామకోటయ్య అందుకున్నారు. అమరావతి రీజియన్ రోటరీకన్లబ్‌లలో రెండో అత్యున్నత సిల్వర్ అవార్డు పురస్కారాన్ని క్లబ్ కార్యదర్శి నిమ్మగడ్డ సురేఖ అందుకున్నారు. ఈ అవార్డుల కార్యక్రమంలో తుమ్మల సత్యప్రసాద్, ఆలేటి కోటేశ్వరరావు, కర్నాటి శ్రీనివాసరావు, పఠాన్ నాగూర్‌వలి పాల్గొన్నారు.


## మద్యం షాపుల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయండి: సిఐ వెంకటరమణ

**మాచర్ల, జులై 3 ప్రభాతవార్త:** మద్యం షాపుల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ వెంకటరమణ అన్నారు. మాచర్ల పట్టణంలోని కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ లైసెన్సు లేని, అనధికార వ్యక్తుల నుంచి మద్యం కొనుగోలు చేయడం చాలా ప్రమాదకరమన్నారు. అది నకిలీ మద్యం కావచ్చన్నారు. వివాహాలు, పార్టీలు, ఇతర సామూహిక వేడుకలకు మద్యం తగ్గింపు ధరకు సరఫరా చేస్తాని చెప్పేవారు మిమ్మల్ని మోసం చేసే అవకాశముందన్నారు. వారు సరఫరా చేసే నకిలీ మద్యం వల్ల ఆరోగ్యానికి తీవ్రహాని కలిగిస్తుందన్నారు. మరణాలకు సైతం దారి తీస్తుందన్నారు. అలాంటి అనుమానిత వ్యక్తుల వివరాలను ఎక్సైజ్ శాఖకు తెలియజేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. టోల్ ఫ్రీ నంబరు 14405లో కానీ, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి 9440902487 నంబరుకు తెలియజేయాలన్నారు.



## తహశీల్దార్‌కు జనసేన నాయకులు వినతిపత్రం అ ందజేత

రాజుపాలెం, జూలై 3 ప్రభాతవార్త : మండల జనసేన పార్టీ నాయకులు గురువారం ఆర్‌టిఐ యాక్ట్ ద్వారా రాజుపాలెం మండల పరిధిలో అటవీ భూములు, అసైన్డ్ భూముల వివరాలను తెలపాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తోట నరసయ్య, బత్తుల హనుమంతరావు, రుసుం వెంకటేశ్వర్లు, పసుపులేటి వెంకటేశ్వర్లు, పగడాల నరసింహారావు, శ్రీకాంత్, తరుణ్ పాల్గొని మాట్లాడారు. జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ కార ్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.



## ఫ్రైడే 2025 డీల్ ప్రకటించిన అమేజాన్ ఇండియా

**విజయవాడ, జూలై 3, ప్రభాతవార్త :** ఫ్రైండే 2025 డీల్ ్ను జూలై 12న ఉదయం 12 నుండి జూలై 14 రాత్రి 11.59 వరకు ప్రత్యేకించి సభ్యులకు అందుబాటులో వుంటుందన్నారు. నిరంతరంగా 72గంటలు కొనుగోలు చేయడానికి, సాటిలేని డీల్స్, బ్లాక్‌బస్టర్ వినోదం కోసం షాపర్ ఎదురుచూడవచ్చన్నారు. స్మార్ట్‌ఫోన్లు, టివిలు, ఉపకరణాలు, బ్యూటి, హోం , కిచెన్, ఫర్నిచర్, రోజువారీ అవసరాలు ఈ డీల్‌లో అందిస్తామన్నారు.

## కూటమి పాలనలో ఏపీ ప్రజలు స్వర్ణయుగాన్ని చూస్తున్నారు : ఎమ్మెల్యే జూలకంటి

**మాచర్ల, జులై 3 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వ పాలనలో ఏపీ ప్రజలు స్వర్ణయుగాన్ని చూస్తున్నారని, ఏడాది పాలనలో సుపరి పాలన ఫలాలను అందుకున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి అన్నారు. మాచర్ల పట్టణంలోని మానుకొండ కల్యాణ బాధ్యత పసుపు సైన్యంపైనే ఉదని ఆయన వివరించారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్క కార్యకర్తలకు అన్నివిధాలుగా వెన్నుదన్నుగా నిలిచేందుకు పార్టీ కట్టుబడి ఉందన్నారు. కార్యకర్తలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అన్ని విధాలుగా ఆలోచిస్తున్నా



మండపంలో జరిగిన నియోజకవర్గ స్థాయి టీడీపీ క్లస్టర్, యూనిట్, బూత్ లెవల్ ఇన్‌ఛార్జుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మై టీడీపీ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో లక్షల కోట్ల నిధులతో సాగుతున్న అభివృద్ధి, సంక్షేమాలను ప్రతి ఇంటికి తీసుకోవాల్సిన మన్నారు. కొంత సంయమనం పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి క్లస్టర్, యూనిట్, బూత్ లెవల్ ఇన్‌ఛార్జిలు, పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ ఛైర్మన్ షేక్ మదార్‌సాహెబ్, పంగులూరి అంజయ్య, ఎనుముల కేశవరెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, టీడీపీ మాచర్ల పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, కజ్జం సైదయ్య, టీడీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి అన్వర్‌బాష, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆర్‌విఆర్‌జెసి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభమైన

## ఐడియా, డిజైన్ ఎంట్రిప్రెన్యూర్‌షిప్" ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

**గుంటూరు విద్య. జూలై 3 ప్రభాతవార్త:** భవిష్యత్‌లో నూతన ఆవిష్కరణల విషయంలో విద్యార్థుల్లో పోటీ పెరగనున్నదని, దేశ ఆర్థిక పురోగతికి వినూత్న ఆవిష్కరణలే కీలకంగా మారనున్నాయని, అందుకు తగ్గట్టు అధ్యాపక బృందం విద్యార్థులకు తగిన శిక్షణతో ప్రోత్సాహించే విధంగా తయారవ్వాలని, కర్ణాటక నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ, అసోసియేట్ ప్రొఫెసర్ మరియు వాధ్వాని ఫౌండేషన్ గ్లోబల్ జ్యూరీ మెంబెర్ డా. సుప్రభా కే.ఆర్ పేర్కొన్నారు. స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ నిధి, ఐటీ.బీ.ఐ, సహకారంతో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నఐడియా, డిజైన్ ఎంట్రిప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని గురువారం డా. సుప్రభా ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ లోని వివిధ కళాశాలల నుండి అధ్యాపకబృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డా. సుప్రభా ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యావేత్తలకు, పరిశోధకులకు, మరియు యువ అధ్యాపకులకు ఆవిష్కరణాత్మక ఆలోచనలు అభివృద్ధి చెందిన డిజైన్ పద్ధతులు, మరియు స్టార్టప్ వ్యాపారాల ప్రారంభానికి అవసరమైన ఎంట్రిప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాలపై లోతైన అవగాహన కల్పించారు.ఇటీవల తమ కళాశాల సందర్శనలో భాగంగా రాష్ట్ర ముఖ్య మంత్రి ఆశించిన "ప్రతి కుటుంబం నుండి ఒక ఎంట్రిప్రెన్యూర్ తయారవ్వాలి" అనే అంశం సఫలీకృతం కావాలంటే విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా.జగదీష్ కె. ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ అండ్ ఆర్ డి డైరెక్టర్ డా. కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాస రావు,_గితీ। ప్రధాన పరిశోధకులు డా.ఎం.వి.పి. చంద్ర శేఖర రావు, ఇన్క్యూబేషన్ మేనేజర్ డా.కె.శోభ, డా.ఆర్.హాఫీజ్ బాషా, డా.సజ్జా రాధికా, వివిధ కళాశాలల నుండి వచ్చిన అధ్యాపకబృందం, తదితరులు పాల్గొన్నారు. ధికా, వివిధ కళాశాలల నుండి వచ్చిన అధ్యాపకబృందం, తదితరులు పాల్గొన్నారు.

## నూటా అధ్యక్ష బరిలో బ్రహ్మాజీ, సుమంత్‌కుమార్

### - నూటా ఏకగ్రీవానికి పాలకమండలి సభ్యులు చెక్

### - మూడు పోస్టులకు నామినేషన్ ధాఖలు చేసిన ఇద్దరు ఈసి మెంబర్స్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై3, ప్రభాతవార్త:** నాగార్జున యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్స్ (నూటా) నూతన కార్యవర్గానికి పలువురు అధ్యాపకులు నామినేషన్ దాఖలు చేశారని ఎన్నికల అధికారి ఆచార్య యస్.మురళీమోహన్ తెలిపారు. వీరిలో ఒక ప్యానల్ నుంచి అధ్యక్ష పదవికి ఆచార్య పి.బ్రహ్మాజీరావు (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్), ఉపాధ్యక్ష పదవికి ఆచార్య యం.సుబ్బారావు (కెమిస్ట్రీ), కార్యదర్శి పదవికి ఆచార్య యం.త్రిమూర్తిరావు (సోషియాలజీ/సోషల్‌వర్క్), సంయుక్త కార్యదర్శి పదవికి ఆచార్య డి.రామచంద్రన్ (కెమిస్ట్రీ), కోశాధికారి పదవికి ఆచార్య సి.హెచ్.లింగరాజు (ఫిజిక్స్), సైన్స్ ప్రతినిధులుగా డాక్టర్ పి.సుధాకర్ (బయోటెక్నాలజీ), డాక్టర్ లావణ్య(కంప్యూటర్ సైన్స్), ఆర్ట్స్ కోర్సుల ప్రతినిధులుగా ఆచార్య వై.అశోక్ కుమాం(డాక్టర్ అంబేద్కర్ చైర్), ఆచార్య వి.తులసీదాసు (హెచ్‌ఆర్‌యం)లు నామినేషన్‌లు దాఖలు చేశారు. వీరు వేసిన నామినేషన్‌లు ఏకగ్రీవం అవుతాయనేలోగా పాలకమండలి సభ్యులు ఆ ప్యానల్‌కు చెక్ పెట్టినట్లు నామినేషన్‌లు దాఖలు చేశారు. అధ్యక్ష పదవికి పాలకమండలి సభ్యులు ఆచార్య కె.సుమంత్‌కుమార్ (జువాలజీ-ఆక్వాకల్చర్), కార్యదర్శి పదవి, కోశాధికారి వంటి రెండు పదవులకు మరొక పాలకమండలి సభ్యులు ఆచార్య జగదీష్ నాయక్ (జువాలజీ-ఆక్వాకల్చర్)లు నామినేషన్‌లు దాఖలు చేశారు. కాగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు మాత్రమే ఎలక్షన్ జరిగే అవకాశం ఉంది. శుక్రవారం మధ్యాహ్నం లోగా నామినేషన్‌లు ఉపసంహరణకు అవకాశం ఉంది. దాని ప్రకారం రెండు ప్యానల్స్ మధ్య రాజీ కుదురుతుందా? లేదా ఎలక్షన్ జరుగుతుందా? అనేది రేపటికి క్లారిటీ రానుంది. రాజీ కుదిరితే ఎన్నిక ఏకగ్రీవం అవుతుంది. ఒకవేళ రాజీ కుదరకపోతే పోటీ రసవత్తరంగా మారుతుంది. బరిలో నిలిచిన వారికి ఈనెల 9వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలలో 70మంది అధ్యాపకులకు ఓటు వేసే అవకాశం ఉంది. పాలకమండలి సభ్యులు మాత్రం అధ్యాపకులకు కలిసి వారి మద్దతు కోరేందుకు సమాయత్తమౌతున్నారు.





## ఆగస్టు5 తరువాత సంక్షేమం అమలులో దేశంలోనే ఏపి అగ్రస్థానంలో ఉంటుంది : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, జులై3, ప్రభాతవార్త:** ఆగస్ట్ 15 తరువాత సంక్షేమం అమలులో దేశంలోనే ఏపి అగ్రస్థానంలో ఉంటుందని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం మండలంలోని పసుమర్రు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పసుమర్రు వాగు పరిధిలో ఓగేరు వాగు ఆధునీకరణ పనులను ప్రొక్లయిన్ నడిపి



స్వయంగా ప్రత్తిపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగన నష్టాన్ని, గత పాలకులు చేసిన విధ్వంసాన్ని మర్చిపోతే ఎలాగని అన్నారు. ప్రజలు నేడు ప్రశాంతంగా తమ పని తాము చేసుకుంటూ కుటుంబాలతో సంతోషంగా జీవిస్తూ. హాయిగా ఉండటానికి కారణం కూటమి ప్రభుత్వం, చంద్రబాబు నాయకత్వమేనని ప్రత్తిపాటి వివరించారు. చంద్రబాబు ఎన్నికల సందర్భంగా చెప్పింది చెప్పినట్లుగా తల్లికి వందనం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. గత పాలకుల్లా తల్లులను, విద్యార్థులను, ముఖ్యంగా ప్రజలను మోసగించలేదని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. సూపర్‌సిక్స్ హామీల అమలులో ముఖ్యమైంది తల్ ్లికి వందనం అమలులోకి వచ్చిందన్నారు. ఈ నెలలో అన్నదాత సుఖీభవ, వచ్చే నెలలో ఉచిత బస్ ప్రయాణం అమలుకానున్నదని అన్నారు. నిరుద్యోగ భృతికూడా త్వరలో అమలు చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి ఆదేశించారని ప్రత్తిపాటి వివరించారు. అన్నక్యాంటిన్లు, రోడ్లు, డ్రెయిన్లు, సామాజిక భవనాలు, ఇళ్ల నిర్మాణం వంటి ఎన్నో అభివృద్ధి పనులు కూటమి ప్రభుత్వం చేసిందన్నారు. మూడు పార్టీలు కలిసి ఉండబట్టే రాష్ట్రానికి, తమకు మేలు జరుగుతుందని ప్రజలు గ్రహించాలని అన్నారు. 15 సంవత్సరాలు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటుందని, చివరన ఉన్నవారికి కూడా న్యాయం జరుగుతుందని, పార్టీ అధికారంలో ఉండటం, ప్రజలకు సేవ చేయడమే గొప్ప బలమనే నిజాన్ని ప్రతి ఒక్కరూ అంగీకరించాలని ప్రత్తిపాటి సూచించారు.

**రాష్ట్రానికి, ప్రజలకు మంచి జరగాలంటే చంద్రబాబు నాయకత్వమే ఉండాలి**

చంద్రబాబు నాయకత్వంలో జరిగే అభివృద్ధిని చూసి తట్టుకోలేకనే వైసిపి దుష్ప్రచారం చేస్తుందని ప్రత్తిపాటి తెలిపారు. స్వంత కార్యకర్తను కారుకింద తొక్కించినవారు ప్రజలకు మేలు చేస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి, ప్రజలకు మంచి జరగాలంటే చంద్రబాబు నాయకత్వమే ఉండాలని, ఆయన లేకుంటే మరలా నిద్రలేని రాత్రులను గడపాల్సి వస్తుందని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. జగన్ మరోసారి గెలిచిఉంటే ప్రజల ఆస్తులు, భూములన్నీ స్వాహ అయ్యేయని, చంద్రబాబు ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుచేయబట్టే మీ భూములు మీరు సాగుచేసుకుంటున్నారని ప్రత్తిపాటి తెలిపారు. గతంలో అవినీతి మంత్రి, గణపవరం, మానుకొండవారిపాలెం,




పసుమర్రు గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేసి అభివృద్ధి లేకుండా చేసిందన్నారు. పసుమర్రు గురించి తెలియనివారికి, గ్రామస్థుల జీవనవిధానం తెలియనివారికి గతంలో ఓట్లు వేయబట్టే ప్రజలు నష్టపోయారని ప్రత్తిపాటి తెలిపారు. మిర్చి, బర్లీ పొగాకు కొనుగోళ్ల సహ, నియోజకవర్గంలోని పలు సమస్యలపై అసెంబ్లీలో తాను మాట్లాడానని ప్రత్తిపాటి ఈ సందర్భంగా వివరించారు. గ్రామాలలో సమస్యలు పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తున్నానని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

**గ్రామస్థులు ఐక్యంగా లేకపోతే, వారితో పాటు గ్రామం నష్టపోతుంది**

1999-2004 మధ్య పసుమర్రు రైతాంగం కోసం రూ 15 కోట్లతో లిఫ్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఆనాడు పెట్టిన ఖర్చు ఇప్పుడు 100 కోట్లకు సమానమని ప్రత్తిపాటి చెప్పారు. గ్రామానికి మేలు చేయటానికి ఎంతో కష్టపడి లిఫ్ట్ ఏర్పాటు చేస్తే దానిని దుర్వినియోగం చేయడం బాధ కలిగించిందని అన్నారు. గ్రామస్థులు ఐక్యంగా లేకపోతే వారితోపాటు గ్రామం కూడా నష్టపోతుందన్నారు. ఆ విషయాన్ని ఇప్పటికైనా గ్రామ ప్రజలు

గ్రహించాలని ప్రత్తిపాటి సూచించారు. ప్రభుత్వం, పార్టీ తమకు ఏమి చేయలేదని అనుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా, ధైర్యంగా బ్రతికేలా వారు పనులువారు చేసుకునేలా చేయటాన్ని మించిన సాయం ఉండదనే వాస్తవాన్ని గ్రహించాలన్నారు. గతంలో ఐదేళ్ల టిడిపి అధికారంలో లేకపోతే ఎంత నష్టం జరిగిందో, అందరూ ఎన్ని ఇబ్బందులు పడ్డామో ఇప్పటికైనా గ్రహించకపోతే ఎలాగని ప్రత్తిపాటి ప్రశ్నించారు. చంద్రబాబు అధికారంలో ఉండబట్టే మీరు, నేను అందరం ప్రశాంతంగా ఉన్నామని, అర్హత కలిగిన ప్రతి మహిళకు తల్ ్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలెండర్ పంపిణీ అమలయ్యాయని అన్నారు. గత పాలకులు పసుమర్రును దోచినట్లుగా నియోజకవర్గంలో మరే గ్రామాన్ని దోచుకోలేదని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. దోచుకోవడం తప్పమరేమి తెలియని వారిని గెలిపించారని, అటువంటి తప్పులకు చోటు లేకుండా అందరం ఎకతాటిపై నిలిచి రాష్ట్రప్రగతిలో భాగస్వాములవుదామని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, నియోజవర్గ పార్టీ పరిశీలకులరాలు ఉషారాణి, టిడిపి నాయకులు జవ్వాజి మదన్ మోహన్, కందుల రమణ, గంగా శ్రీనివాసరావు, జాలాది సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ నాయకులు కిషోర్, షేక్ జానీ, చైతన్య, చౌదరి, రాయుడు, రఫీ, మస్తాన్‌వలి, నాగూర్, మహ్మద్ రఫీ, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. తొలుగ గ్రామంలో ప్రత్తిపాటికి మహిళలు, యువకులు, పార్టీ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

## ప్రభుత్వం డిఎస్సీ నియామకాన్ని వెంటనే చేపట్టాలి

### ఎస్‌టియు రాష్ట్ర ఆర్థిక సంఘ కార్యదర్శి కె కోటేశ్వరరావు

**చిలకలూరిపేట, జులై3, ప్రభాతవార్త:** నెలరోజులుగా జరిగిన డిఎస్సీ పరీక్షలు నిన్నటితో ముగిసినందున నియామకాలు వీలైనంత త్వరగా చేపట్టాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం తరుపున రాష్ట్ర ఆర్థిక సంఘ కార్యదర్శి కె కోటేశ్వరరావు, రాష్ట్ర డైరీ కన్వీనర్ పోటు



శ్రీనివాసరావులు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని ఎస్‌టియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జూన్ నెలలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీలలో డిఎస్‌సి ఖాళీలు చూపించినందువలన మారుమూల ప్రాంతాలలో ఎక్కువ ఉపాధ్యాయ ఖాళీలు ఎర్పడ్డాయి. వీలైనంత త్వరగా మెరిట్ లిస్ట్ విడుదల చేసి తద్వారా సెలక్షన్ లిస్ట్ తయారుచేసి తద్వారా నియామకాలు చేపట్టాలని వారు కోరారు. ఉపాధ్యాయల బదిలీలు నిర్వహించడం వల్ల కొన్ని పాఠశాలలలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు రిలీవర్ లేక ఆగిపోయి ఉన్నారని తెలిపారు. హైస్కూల్స్ నందు సబ్జెక్ట్ టీచర్ల పోస్టు ఖాళీలు డిఎస్సీ కి రాసినందను వారు వచ్చేవరకు సబ్జెక్ట్ భోధన ఇబ్బందికరంగా మారుతుంది కావున డిఎస్సీ పోస్టులలో సెలక్టయిన వారు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్‌టియు నాయకుల వినుకొండ అక్కయ్య, మల్లేశ్వరరావు, ఎన్ కోటేశ్వరరావు, వి అజయ్‌ప్రకాష్, బి రవి, వీరయ్య, అట్లూరి శ్రీనివాసరావు, సోమ్లానాయక్, చిన వెంకటస్వామి, ఏడుకొండలు పాల్గొన్నారు.

## 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

### - ప్రజా సంఘాల సమావేశంలో వక్తల పిలుపు

**పెదనందిపాడు జూలై 3, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహ రించుకోవాలని దేశవ్యాప్తంగా కార్మిక, రైతు సంఘాల పిలుకు మేరకు జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామారావు పిలుపునిచ్చారు. గురువారం పెదనందిపాడు లోని తెళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగిన ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకట శివరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ




బిజెపి 11 సంవత్సరాల పాలనలో కార్మికులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని తొలగించి 12 గంటల పని విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. కార్మిక హక్కులను కాలరాసి, పెట్టుబడుదారులకు అనుకూలంగా చట్టాలు చేస్తున్నారని పేర్కొన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా కుదించి చట్టాలను మారుస్తున్నారన్నారు. స్కీం వర్కర్లకు అది తక్కువ వేతనాలను అందిస్తున్నారని అన్నారు. సుప్రీంకోర్టు నిర్ణయించిన విధంగా 26 వేల రూపాయల కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారు. దేశ సంపదను అప్పనంగా ఆదాని, అంబానీ లాంటి కొద్దిమంది వ్యక్తులకు దోచి పెడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా భారతదేశం లౌకిక దేశమని, కానీ బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మతతత్వాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య చీలికలను తీసుకువస్తుంది అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చివేసి, సనాతన ధర్మం పేరిట అరాచకాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. ఈ విధానాలను ప్రజలు తిప్పి కొట్టాలని చెప్పారు. ఇదిలా ఉంటే భారతదేశంలో నూటికి 60 శాతం మంది గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ రంగం మీద ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు దారా దత్తం చేస్తుందన్నారు. ఈ విధానాలు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు సంవత్సరం పాటు నిరసన దీక్షలు చేశారని తెలిపారు. అప్పుడు ఇచ్చిన కనీస మద్దతు ధరల చట్టం హామీని ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ఎమ్మెస్ స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని, సమగ్ర పంటల బీమా పథకం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలని, ఇతర ప్రభుత్వ పథకాలన్నీ అందించాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం 600 రూపాయలు ఇవ్వాలని, వందరోజుల పని దినాలు కల్పించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో అన్ని ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి జి రమణ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఇచ్చిన సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ 11 సంవత్సరాలుగా అమలు చేయలేదన్నారు. స్కీం వర్కర్లకు 10,000 నుంచి జీతాలు ఇవ్వడం లేదని తెలిపారు. మహిళల శ్రమను చౌకగా దోచుకుంటున్నారని పేర్కొన్నారు. కనీస హక్కులైన పెన్షన్, గ్రాట్యుటీలను కల్పించడం లేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు, ఆశాలకు అనేక నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. మహిళల మీద అఘాయిత్యాలు పెరిగిపోయాయని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జరిగే దేశవ్యాప్త సమ్మెలో అన్ని మహిళా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టే సమ్మెలో అన్ని ప్రజా సంఘాల నాయకులు ఉదయం 9 గంటలకు పెదనందిపాడు మండల కేంద్రానికి రావాలని, అన్ని ప్రజాసంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో విశ్రాంత ఉపాధ్యాయుల మండల అధ్యక్షులు జంపని రామారావు, నాయకులు గారపాటి రమేష్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, పోపూరి సుధీర్, బండి శంకరయ్య కౌలు రైతు సంఘం నాయకులు నల్లమోతు రాజేంద్ర, మహిళా సంఘం నాయకులు పి భువనేశ్వరి, మర్రి లక్ష్మి ్క, షేక్ షమీ, అంగన్వాడీల సంఘం మండల కార్యదర్శి శివ పార్వతి, ఆశా వర్కర్ల సంఘం నాయకులు పి సరళా దేవి, పి రాణి, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని అనుమతులతోనే నిధుల వినియోగం

### - ఆచార్యులు నాగరాజు, మధుబాబు, సునీత వెల్లడి

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై3, ప్రభాతవార్త:** వీసిగా ఆచార్య పి.రాజశేఖర్ పాలనలో నిధుల వినియెగం అన్ని అనుమతులతోనే జరిగిందని ఆచార్యులు బి.నాగరాజు, కె.మధుబాబు, కె.సునీతలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడిచిన 5ఏళ్ళలో వర్సిటీ అభివృద్ధి విశ్వవ్యాప్త ర్యాంకులు సాధించేలా జరిగిందని పేర్కొన్నారు. పలు అభివృద్ధి పనులకు, విద్యా విషయక కార్యక్రమాలకు వెచ్చించిన నిధులకు పాలకమండలి, ఫైనాన్స్ కమిటీ, అకడమిక్ సెనేట్‌ల ఆమోదం ఉందని స్పష్టం చేశారు. తమపై అసత్య ప్రచారాలు చేయవద్దని పేర్కొన్నారు. ఖర్చు చేసిన ప్రతీ రూపాయికి లెక్క ఉందని లేఖలు పేర్కొన్నారు. అంతటి అభివృద్ధి చేయడం ద్వారానే డ్యూయల్ మోడ్ కేటగిరిలో దేశంలోనే న్యాక్ ఏ ప్లస్ గ్రేడు 3.46 స్కోరు సాధించిన యూనివర్సిటీ నాగార్జున యూనివర్సిటీ నిలిచిందని తెలిపారు. గత 5ఏళ్ళలో జరిగిన అభివృద్ధి 30ఏళ్ళకు సమానంగా పేర్కొన్నారు. వ్యక్తిగతంగా ఎవరూ కూడా నిధులను దుర్వినియోగం చేయలేదని స్పష్టం చేశారు.

# 'సోలో బాయ్' విడుదలకు సిద్ధం

సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బిగ్ బాస్ ఫేమ్ గౌతమ్ కృష్ణ హీరోగా రమ్య పసుపులేటి, శ్వేత అవస్తి హీరోయిన్స్‌గా నవీన్ కుమార్ దర్శకత్వంలో సతీష్ నిర్మాతగా జులై 4వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సోలో బాయ్. త్రిలోక్ సుద్దు ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా చేయగా ప్రవీణ్ పూడి ఎడిటింగ్ చేశారు. సోలో బాయ్ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న ఈ తరుణంలో చిత్ర నిర్మాత సతీష్ మీడియా వారితో ఇంటర్వ్యూలో పాల్గొని మీడియావారు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం జరిగింది. **సోలో బాయ్ చిత్ర ప్రస్థానం ఎలా మొదలైంది?**




సోలో బాయ్ చిత్ర హీరో గౌతమ్ కృష్ణ నాకు చాలా మంచి స్నేహితుడు. అతను ఈ సినిమా లైన్ చెప్పినప్పుడు మధ్యతరగతి కుటుంబంలోని 17 సంవత్సరాల నుండి సెటిల్ అవ్వడానికి పడే కష్టం తాలూకా పాయింట్ నాకు చాలా బాగా నచ్చింది. **ప్రొడక్షన్ విషయంలో మీరు తీసుకున్న జాగ్రత్తలు ఏంటి?** అనవసరమైన ఖర్చులు ఎక్కడ పెట్టకుండా ప్రతి విషయంలో జాగ్రత్తపడి ఖర్చు పెట్టాము. చిత్రానికి పనిచేసిన యంగ్ టీం అంతా తక్కువ రెమ్యూనరేషన్ తీసుకుంటూ సినిమాకు బాగా సపోర్ట్ చేశారు. **ప్రస్తుత సినిమాలపై, బయట మార్కెట్ పై మీ ఉద్దేశం ఏంటి?** గతంలో బట్టల రామకృష్ణ బయోపిక్ సినిమా తీసినప్పుడు ఒక ఎక్స్పరిమెంట్ లాగా చేశాము. అది మాకు వర్కౌట్ అయింది. ఇప్పుడు ఆ సమయంలో నేర్చుకున్న వాటిని బేస్ చేసుకుని తగ్గ జాగ్రత్తలు తీసుకుంటూ సోలో బాయ్ సినిమా చేశాము. **సినిమా రన్ టైమ్ ఎం? ఎన్ని థియేటర్లలో విడుదల కానుంది?** ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకునేప్పటికీ రెండు గంటల పది నిమిషాలు ఫైనల్ అవుట్ పుట్ వచ్చింది. గౌతమ్ కృష్ణ బిగ్బాస్ ఫేమ్ **సినిమాకు ఎంతవరకు ప్లస్ అవుతుంది?** గౌతమ్ ఈ సినిమా ప్రమోషన్లలో 100 మంచి సపోర్ట్ ఇస్తున్నారు. బిగ్ బాస్ రెండు సీజన్లో ఉండటం వల్ల అతని ఫేమ్ ఈ సినిమాకు మరింత తోడ్పడు తుంది అనుకుంటున్నాను.

# 'హరి హర వీరమల్లు' ట్రైలర్ లాంచ్

పవన్ కళ్యాణ్ చారిత్రక యోధుడిగా కనువిందు చేయనున్న చిత్రం హరి హర వీరమల్లు. ప్రముఖ నిర్మాత ఎ.ఎం.రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఎ.దయాకర్ రావు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పీరియాడికల్ డ్రామాకు ఎ.ఎం.జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. జూలై 24న విడుదల కానున్న హరి హర వీరమల్లు సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలకు విశేష స్పందన లభించింది. తాజాగా విడుదలైన ట్రైలర్‌తో అంచనాలు రెట్టింపు అయ్యాయి. జూలై3 (గురువారం) హైదరాబాద్‌లోని విమల్ థియేటర్‌లో హరి హర వీరమల్లు ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. అలాగే అభిమానుల కోసం దేశవ్యాప్తంగా పలు థియేటర్లలో ట్రైలర్‌ను ప్రదర్శించారు. భారీ సంఖ్యలో అభిమానులు తరలి రావడంతో థియేటర్లన్నీ కళకళలాడాయి. హరి హర వీరమల్లు ట్రైలర్‌ను మూడు నిమిషాల నిడివితో రూపొందించారు. ట్రైలర్‌లో ప్రతి ఫ్రేమ్ అద్భుతంగా ఉంది. పవన్ కళ్యాణ్ మునుపెన్నడూ చూడని విధంగా సరికొత్తగా కనిపిస్తున్నారు. ఢిల్లీ సుల్తానుల నుండి సనాతన ధర్మాన్ని రక్షించడానికి నడుం బిగించిన యోధుడు, మొఘల్ శక్తిని ధిక్కరించిన వీరుడు వీరమల్లుగా పవన్ కళ్యాణ్ కనిపించిన తీరు కట్టిపడేసింది. మొఘల్ సామ్రాజ్యంలో అత్యంత అపఖ్యాతి పాలైన పాలకులలో ఒకరైన ఔరంగజేబు పాత్రలో బాబీ డియోల్ భయంకరంగా కనిపిస్తున్నారు. కోహినూర్ వజ్రం కోసం పోరాటం, మొఘలులతో వీరమల్లు తలపడటం వంటి సన్నివేశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.



గంభీరమైన రూపాన్ని కనబరుస్తూ, సనాతన ధర్మం పట్ల మక్కువను వ్యక్తపరుస్తూ.. భయమనేది ఎరుగని వీరుడు వీరమల్లుగా పవన్ కళ్యాణ్ కనిపించిన తీరు నభూతో నభవిష్యత్. వీరమల్లు పాత్ర కోసం తనని తాను మలచుకున్న తీరు అమోఘం. యాక్షన్ సన్నివేశాల్లో పవన్ కళ్యాణ్ మరింతగా ఆకట్టుకున్నారు. తన అద్భుతమైన అభినయం, ఆహార్యంతో వీరమల్లు పాత్రకు ప్రాణం పోశారు. ట్రైలర్‌లోని ఆంధి వచ్చేసింది అనే డైలాగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవన్ కళ్యాణ్ స్ఫూర్తి దాయక రాజకీయ ప్రయాణాన్నిఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన మాటను గుర్తు చేసేలా ఉన్న ఈ డైలాగ్.. అభిమానుల రోమాలు నిక్కబొడిచేలా చేస్తోంది. అందరూ నేను రావాలని దేవుడిని ప్రార్థిస్తారు.. కానీ మీరు మాత్రం నేను రాకూడదని కోరుకొంటున్నారు అనే మరో డైలాగ్ కూడా పవన్ కళ్యాణ్ ప్రస్తుత ఇమేజ్ కి తగ్గట్టుగా అభిమానులు మెచ్చేలా ఉంది.




# 25న 'ఫెంటాస్టిక్ ఫోర్:ఫస్ట్ స్టెప్స్' రిలీజ్

రీడ్ రిచర్డ్స్ (మిస్టర్ ఫెంటాస్టిక్) పాత్రలో పెడ్రోపాస్కల్ ఫెంటాస్టిక్ ఫోర్ నాయకుడు, రీడ్ రిచర్డ్స్ తన శరీరాన్ని తిరిగి ఆకృతి చేయడానికి తన సామర్థ్యాన్ని కలిగి ఉన్నాడు. కానీ ఈ వెర్షన్ ఒక కొత్త మలుపును పరిచయం చేస్తుంది: రీడ్ రబ్బరు లాగా ఉండడమే కాకుండా, అతను స్థలాన్ని కూడా తారుమారు చేస్తాడు, దాదాపు అపరిమిత స్థితిస్థాపకతను అనుమతిస్తాడు. అతని మానవాతీత తెలివితేటలతో కలిపి, అతను యొక్క అత్యంత బలీయమైన శాస్త్రీయ మనస్సులలో ఒకరిగా మిగిలిపోయాడు. అతని సాగతీత క్వాంటం షిమ్మర్‌తో చిత్రీకరించబడింది. సూ స్టార్మ్ (ఇన్విజిబుల్ ఉమెన్)గా వెనెస్సా కిర్బీ తరచుగా తక్కువ అంచనా వేయబడిన సూ స్టార్మ్ జట్టు యొక్క వ్యూహాత్మక మరియు భావోద్వేగ మిళితమైన వ్యక్తిగా ఉద్భవిస్తుంది. ఆమె తనను మరియు ఇతరులను అదృశ్యంగా మార్చుకోగలదు, కానీ ఆమె నిజమైన బలం క్షిపణుల నుండి ఇంటర్ డైమెన్షనల్ శక్తి వరకు దాడులను నిరోధించేంత శక్తివంతమైన సైయోనిక్ శక్తి క్షేత్రాలను ఉత్పత్తి చేయడంలో ఉంది.

# బెస్ట్ థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ మూవీ 'తమ్ముడు'

సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న మరో సూపర్ హిట్ మూవీ తమ్ముడు. నితిన్ హీరోగా దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమ్ముడు సినిమా ఈ నెల 4న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ హైలైట్స్‌ను ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో తెలిపారు ప్రొడ్యూసర్ దిల్ రాజు. శ్రీరామ్ వేణు మా సంస్థలో ఆర్య నుంచి వర్క్ చేస్తున్నాడు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా, అసోసియేట్ డైరెక్టర్‌గా, స్క్రిప్ట్ రైటర్‌గా మాతోనే ట్రావెల్ చేస్తున్నాడు. శ్రీరామ్ వేణు మా దగ్గరనే ఉన్నాడంటే అందుకు మా మధ్య ఉన్న రిలేషన్, వేవ్ లెంగ్త్ కారణం. ఇండస్ట్రీలో డబ్బుతోనే పనులు జరుగుతుంటాయి. నాది భిన్నమైన పద్ధతి. నేను వేవ్ లెంగ్త్ కలిసిన వాళ్లతోనే జర్నీ చేస్తుంటాను. అనిల్ రావిపూడి, శ్రీకాంత్ అడ్డాల, హరీశ్ శంకర్, వంశీ పైడిపల్లి, దశరథ్..ఇలా డైరెక్టర్స్ మా సంస్థలో వర్క్ చేసి హిట్ చిత్రాలు ఇచ్చారు. శ్రీరామ్ వేణు మా సంస్థలోనే ట్రావెల్ అవుతున్నాడంటే అతనికి భారీగా డబ్బు ఇవ్వడం వల్ల కాదు. మాతో ఆయనకు ఒక కంఫర్ట్ ఉంటుంది. అనిల్ రావిపూడితో నాకొక బాండింగ్ ఉంది. ఆ బాండింగ్ లో ఒక కంఫర్ట్ ఉంటుంది. ఈ డైరెక్టర్స్ టాలెంట్ నాకు తెలుసు. కాబట్టి కథ టైమ్ లో, ఎడిటింగ్ టేబుల్ దగ్గర నాకు అనిపించినవి అడుగుతా. నేను క్వశ్చన్ అడిగితే ఎందుకు అడిగాడు అని ఆలోచిస్తారు. అంతే గానీ వారి పనిలో ఇంటర్ ఫియర్ కాను. తమ్ముడు మూవీ మొదటి 20 నిమిషాల తర్వాత మిగిలిన కథంతా ఒక్కరోజులో జరుగుతుంది. ఐదారు యాక్షన్ ఎపిసోడ్స్ ఉంటాయి. వాటిలో రెండు యాక్షన్ ఎపిసోడ్స్ వైలెంట్‌గా ఉన్నాయని ఎ సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్ వాళ్లు చెప్పారు. ఆ రెండు ఎపిసోడ్స్ తీసేస్తే యు బై ఎ ఇస్తామని చెప్పారు. ఈ సినిమాను థియేటర్ ఎక్స్‌పీరియన్స్ కోసమే చేశాం కాబట్టి ఆ ఫైట్ సీక్వెన్సులు తీసేయకుండా ఎ సర్టిఫికెట్ కు అంగీకరించాం. ఇది సంక్రాంతికి వస్తున్నాం లాంటి ఎంటర్ టైనర్ అయితే ఫ్యామిలీ ఆడియెన్స్ అందరూ రండి అని చెబుతాం. తమ్ముడు మూవీ యాక్షన్ ఓరియెంటెడ్ కంటెంట్ ఉన్న మూవీ. థియేటర్స్‌కు వచ్చిన వాళ్లనైనా సంతృప్తి పరచాలి కదా అని ఎ సర్టిఫికెట్ తీసుకున్నాం. ఈ చిత్రాన్ని 150 రోజులు చిత్రీకరించారు. 80 పర్సెంట్ మూవీ అడవిలో ఉంటుంది. విజువల్స్, సౌండింగ్ హై క్వాలిటీతో ఉంటూ థియేటర్‌లో ఎంజాయ్ చేసేలా రూపొందించారు దర్శకుడు శ్రీరామ్ వేణు. పైరసీ అరికట్టేందుకు ఇండస్ట్రీ నుంచి గట్టి చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో సపోర్ట్ చేస్తోంది.




# 'అఖండ 2'లో భజరంగీ భాయిజాన్ బాలనటి

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను హైలీ యాంటిసిపేటెడ్ అఖండ 2: తాండవం కోసం నాల్గవ సారి కొలాబరేట్ అయ్యారు. ఈ హైఆక్టేన్ సీక్వెల్ కథ, స్కేల్, నిర్మాణం, సాంకేతిక నైపుణ్యం.. ప్రతి అంశంలో అఖండను మించి ఉంటుదని హామీ ఇస్తోంది. ప్రతిష్టాత్మకమైన 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట అత్యంత భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎం. తేజస్విని నందమూరి సగర్వంగా సమర్పిస్తున్నారు. మేకర్స్ జననిగా హర్షాలీ మల్హోత్రా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. సల్మాన్ ఖాన్ బజరంగీ భాయిజాన్‌లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా కనిపించిన హర్షాలీ మల్హోత్రా అఖండ 2తో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. ఆమె సాంప్రదాయ చీరలో అందమైన చిరునవ్వుతో అద్భుతంగా కనిపిస్తుంది. ఈ చిత్ర టీజర్‌కు నేషనల్ వైడ్‌గా ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. టీజర్‌లో బాలకృష్ణ మునుపెన్నడూ చూడని అవతార్‌లో కనిపించారు. టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్త ఈ చిత్రంలో హీరోయిన్ గా నటిస్తున్నారు. ఆది పినిశెట్టి పవర్ ఫుల్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. టాప్ టెక్నికల్ టీం ఈ సినిమాకి పని చేస్తోంది. ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. సి రాంప్రసాద్ డీవోపీగా పని చేస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్. ఎఎస్‌ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. అఖండ 2 దసరా కానుకగా సెప్టెంబర్ 25న భారీ స్థాయిలో పాన్‌ఇండియా రిలీజ్ కానుంది. నటీనటులు: గాడ్‌ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంయుక్త, ఆది పినిశెట్టి, హర్షాలి మల్హోత్రా.





తమన్నా నయా లుక్

# 'మార్గన్' సక్సెస్ మీట్

విజయ్ ఆంటోని నటిస్తూ, నిర్మించిన మార్గన్ చిత్రానికి లియో జాన్ పాల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంతో తన మేనల్లుడు అయిన అజయ్ ధీషన్‌ను విజయ్ ఆంటోని తెరకు పరిచయం చేశారు. ఈ సినిమాను విజయ్ ఆంటోని ఫిలింస్ కార్పొరేషన్ నిర్మించగా, సర్వాంత్ రామ్ క్రియేషన్స్ బానర్‌పై జె.రామాంజనేయులు సగర్వంగా సమర్పిం చారు. ఈ సినిమాను జూన్ 27న సురేష్ బాబు తెలుగులో రిలీజ్ చేశారు. రిలీజ్ అయిన ఈ చిత్రానికి మంచి రెస్పాన్స్ దక్కింది. ఈ క్రమంలో చిత్రయూనిట్ థాంక్యూ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో.. విజయ్ ఆంటోని మాట్లాడుతూ, మార్గన్ సినిమాను సురేష్ బాబు, రామాంజనేయులు చాలా గ్రాండ్‌గా తెలుగులో రిలీజ్ చేశారు. ఇకపై నా సినిమాల్ని తెలుగులో రిలీజ్ చేస్తానని సురేష్ బాబు అన్నారు. నాకు ఇంత మంచి మూవీని ఇచ్చిన లియో జాన్ పాల్‌కు థాంక్స్. అజయ్‌ను ఇంత బాగా లాంచ్ చేసినందుకు నాకు చాలా సంతోషంగా అనిపించింది. తెలుగు, తమిళంలో అజయ్‌కు మంచి పేరు వచ్చింది. అజయ్ ఇకపై ఇలానే మంచి కంటెంట్ చిత్రాల్ని చేస్తూ ఆడియెన్స్ నుంచి ప్రేమను సంపాదిస్తూనే ఉండాలి. బిచ్చగాడు 2, రోమియో చిత్రాలకు అజయ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కూడా పని చేశారు. అజయ్‌తో కలిసి నేను ఇక స్ట్రెయిట్ తెలుగు సినిమాల్ని నిర్మిస్తాను. తమిళంలో ప్రస్తుతం ఏడు చిత్రాల్ని చేస్తున్నాను. అందులో తెలుగు డబ్బింగ్ కోసం మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటాను. త్వరలోనే భద్రకాళి రానుంది. అదొక పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్. మార్గన్‌ను ఇంత పెద్ద సక్సెస్ చేసిన తెలుగు ఆడియెన్స్‌కు థాంక్స్ అని అన్నారు. అజయ్ ధీషన్ మాట్లాడుతూ, మార్గన్ సినిమాకు తెలుగులో ఇంత సక్సెస్ వస్తుందని అనుకోలేదు. ఇది తమిళ చిత్రం అయినా కూడా తెలుగు ఆడియెన్స్ పెద్ద విజయాన్ని అందించారు. నాకు ఈ అవకాశం ఇచ్చిన విజయ్ ఆంటోనీకి, ఫాతిమా విజయ్ ఆంటోనికి థాంక్స్. నాకు సపోర్ట్ చేసిన లియో జాన్ పాల్‌కి థాంక్స్. మా మూవీని తెలుగులో ఇంతబాగా రిలీజ్‌చేసిన సురేష్, రామాజనేయులుకి థాంక్స్ అని అన్నారు. భాష్య శ్రీ మాట్లాడుతూ, మార్గన్ మూవీని ఫస్ట్ నుంచి లాస్ట్ వరకు కూడా ఆడియెన్స్ అలా సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా ఫీల్ అయ్యారు. ఈ చిత్రానికి నేను మాటలు, పాటలు రాశాను. నా మీద నమ్మకంతో నాకు ఈ అవకాశం ఇచ్చిన విజయ్ ఆంటోనికి థాంక్స్ అని అన్నారు.




# నా మాటల్ని అపార్థం చేసుకోవద్దు: నిర్మాత శిరీష్ రెడ్డి

తెలుగు సినీ ప్రేక్షకులకు, మెగా అభిమానులకు నమస్కారం. మా ఎస్వీసీ సంస్థకు, రామ్ చరణ్‌కి, చిరంజీవికి ఎంతో అవినాభావ సంబంధం ఉంది. చరణ్‌కి నాకు మంచి అనుబంధం ఉంది. నేను అభిమానించే హీరోల్లో రామ్ చరణ్ఒకరు. ఆయన్ని అవమానపరచడం గాని, కించపరచడం గాని నా జన్మలో ఎప్పుడూ చేయను. నేను ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన గురించి చిన్న మాట దొర్లినా అది నా తప్పే. అది జరిగిందని అభిమానులు అనుకుంటున్నారు కాబట్టి నిజంగానే క్షమాపణలు చెబుతున్నాను. చరణ్ గారికి కూడా క్షమాపణలు చెబుతున్నాను. చరణ్‌తో నాకు ఉన్నటువంటి రిలేషన్‌షిప్‌ను పాడుచేసుకోదల్చుకోలేదు. ఈరోజు జనం మాట్లాడుకుంటున్న మాటలు, బయట ట్రోలింగ్, అభిమానుల బాధలు నేను అర్థం చేసుకోగలను. ఎందుకంటే ఒక హీరోని అలా అన్నప్పుడు ఎవరూ భరించలేరు. నేను అన్న ఇంటెన్షన్ అది కాదు. మాకున్న రిలేషన్‌షిప్ క్లోజ్‌నెస్‌లో నేను మాట దొర్లాను తప్పా ఆయన్ని అవమానపరచడానికి కాదు. మెగా హీరో లందరి తోనూ మాకు మంచి అనుబంధం ఉంది. వరుణ్ తేజ్‌తో ఫిదా చేశాం. సాయితేజ్‌తో రెండు సినిమాలు చేశాం. చరణ్‌తో రెండు సినిమాలు చేశాం. చిరంజీవి దిల్‌రాజుతో, మాతో మాట్లాడుతూనే ఉంటారు. ఇంత మంచి అనుబంధం ఉన్నవారిని అవమానపరిచే అంత మూర్ఖుడిని కాదు. దయచేసి అభిమానులందరూ అర్థం చేసుకోవాలి. సంక్రాంతికి సంక్రాంతికి వస్తున్నాం చరణ్ ఒప్పుకోకపోతే ఆ సినిమా రిలీజ్ అయ్యేది కాదు. ఆయన మనసు గొప్పది కాబట్టి ఆ సినిమాను కూడా రిలీజ్ చేసుకోండి అని ఒక గొప్ప మనసుతో ఒప్పుకున్న వ్యక్తి చరణ్. ఆయన్ని ఎందుకు అవమాన పరుస్తాం. నా మాటల్ని అపార్థం చేసుకోవద్దని కోరుతున్నాను. ఫ్యాన్స్‌కి క్షమాపణలు చెబుతున్నాను. దయచేసి మా రిలేషన్‌ను పాడు చేయొద్దు. మళ్లీ నెక్స్ట్ ఒక ప్రాజెక్టు రెడీ అయింది. నెక్స్ట్ చరణ్‌తో సినిమా తీయబోతున్నాను. మా ఇద్దరి మధ్య ఎలాంటి అభిప్రాయ భేదాలు తీసుకురావద్దని అందర్నీ వేడుకుంటున్నాను. తెలుగు ప్రజలందరూ కూడా గమనించాలి. నాకు చరణ్‌తో మంచి రిలేషన్ ఉంది. ఆయన గురించి నేను ఎప్పుడూ తప్పుగా మాట్లాడను. నేను ఫస్ట్ ఇంటర్వ్యూ ఇచ్చాను కాబట్టి, నాకు తెలియకుండా ఏదైనా మాట దొర్లిందేమో. అది కూడా అర్థం చేసుకోవాలని అందరిని కోరుతున్నాను. థాంక్యూ వెరీ మచ్.



# నేడే విడుదల 'షోటైం'

అనిల్ సుంకర ప్రౌడ్లీ ప్రెజెంట్.. స్కై లైన్ మూవీస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కిషోర్ గరికిపాటి నిర్మాతగా మదన్ దక్షిణామూర్తి దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం షో టైం. నవీన్ చంద్ర హీరోగా కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటిస్తున్న వినూత్నమైన థ్రిల్లర్ చిత్రం జూలై 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు రంగం సిద్ధమైంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత అనిల్ సుంకర ప్రెజెంట్ చేస్తున్నారు. ఈ మేరకు మీడియా సమావేశం నిర్వహించారు. షో టైమ్ మూవీ జర్నీ ఎలా స్టార్ట్ అయింది అనే ప్రశ్నకు నవీన్ చంద్ర సమాధానం చెప్పారు. డైరెక్టర్ మదన్ స్టోరీ చెప్పినప్పుడు చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఒక ఫ్యామిలీలో తక్కువ క్యారెక్టర్ల నడుమ సాగే ఈ కథలో ఎన్నో మలుపులు ఉన్నాయి. ప్రతీ అంశం ప్రేక్షకుడిని రంజింప చేస్తుంది అన్నారు. పోలీసు ఆఫీసర్ కామెడీనా? స్ట్రిక్ట్ ఆఫీసర్ అంటే క్యారెక్టర్ యాక్టర్ రాజా రవింద్ర మాట్లాడు.. ఇందులో చాలా మంచి పోలీసు క్యారెక్టర్ చేశాను అన్నారు. అయితే క్యారెక్టర్ చాలా సీరియస్‌గా ఉన్నా.. ప్రేక్షకులకు మాత్రం మంచి ఎంటర్ టైన్ మెంట్ ఇస్తుందన్నారు. ఆఫీసర్ లుక్ కోసం తీసుకున్న జాగ్రత్తలు గురించి మాట్లాడుతూ, పెద్దగా కష్టపడలేదు కానీ ఫిట్ నెస్ మేయింటైన్ చేసినట్లు చెప్పారు. ఇదే ప్రశ్నకు హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ, రాజా రవింద్రది ఒక విచిత్రమైన పర్సనాలిటీ అని ఆయన పాత్రలో ఇట్టే పరకాయ ప్రవేశం చేస్తారు. అందిరిలా మెథడ్ యాక్టింగ్ ఫాలో కాదు... అందరితో నవ్వుతూ.. నవ్విస్తూ.. సరదగా ఉంటాడు.. ఆయన షాట్ రెడీ అవగానే స్ట్రిక్ట్‌గా మారిపోతాడు అని చెప్పారు. ఇలాంటి జోనర్స్ మలయాళంలో ఎక్కువగా వస్తాయి.. తెలుగులో వర్కౌట్ అవుతాయా? అంటే కచ్చితంగా ప్రేక్షకులు ఆదరిస్తారని డైరెక్టర్ మదన్ దక్షిణామూర్తి చెప్పారు.దృశ్యం సినిమాలా అనిపించింది.. ఇది కూడా ఫ్యామిలీని కాపాడే కథే కదా అనే ప్రశ్నకు.. డైరెక్టర్ సమాధానం చెబుతూ.. అంత పెద్ద సినిమాతో పోల్చడం సంతోషంగా ఉంది కానీ ఇది దృశ్యం సినిమాకు భిన్నంగా ఉంటుంది. ట్రైలర్ చూసి ఇదే సినిమా ఫిక్స్ అవకండి... సినిమా చాలా కొత్తగా, చాలా ఆసక్తిగా ఉంటుందన్నారు. షో టైమ్ అని టైటిల్ పెట్టడానికి కారణం ఏంటి? అని మీడియా ప్రశ్నకు.. ఈ సినిమా చూసిన తరువాత ఈ టైటిల్ కరెక్ట్ అని ప్రేక్షకులే అంటారు. ఇది కచ్చితంగా షో టైమ్ అని చెప్పారు. ఎక్కువగా థ్రిల్లర్ జోనర్లే ఎందుకు ఎంచుకుంటున్నారు అని నవీన్ చంద్రను ప్రశ్నించగా.. ఒకే రకమైన సినిమాలు చేయాలని ఎవరికి ఉండదు.. కానీ ఇది సీరియస్ ఇన్విస్టిగేషన్ సినిమా కాదు.. ఇందులో ప్రేక్షకులను ఆకర్షించే అనేక అంశాలు ఉన్నాయి అని చెప్పారు. స్క్రిప్ట్స్ సెలెక్షన్స్ చాలా బాగుంటాయి కదా... ఏమైన జాగ్రత్తలు తీసుకుంటారా అంటే.. కచ్చితంగా మంచి స్క్రిప్ట్ ను ప్రేక్షకులకు అందించాలనే తపన ఉంటుంది అని హీరో నవీన్‌చంద్ర చెప్పారు. నరేష్ లాయర్‌గా చేశారు, రాజారవింద్ర పోలీసుగా చేశారు కదా.. వీరిద్దరి మధ్య కాంబినేషన్ సీన్స్ ఎలా ఉంటాయి అంటే.. వీరిద్దరి కాంబినేషన్ చాలా బాగుంటుంది. థియేటర్లో వీరి కాంబినేషన్ వచ్చినప్పుడు నవ్వులే నవ్వులు.. ఇంకో రెండురోజుల్లో ఆ మ్యాజిక్ చూస్తారు కదా అంటూ హీరో సమాధానమిచ్చారు. విడుదలైన ట్రయిలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ప్రేక్షకుడిని థియేటర్లో కట్టిపడేసి, అన్ని వర్గాల ప్రేక్షకులను రంజింపజేసే అద్భుతమైన థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో పాటు కడుపుబ్బ నవ్వించే కామెడీ ఉందని తెలుస్తుంది.



# కొవిడ్ టీకాపై ఆందోళన వద్దు



## ఆకస్మిక మరణాలకు ఆ టీకాతో సంబంధం లేదు..

## వ్యాక్సిన్లు పూర్తిగా సురక్షితం: సీరమ్ ఇన్‌స్టిట్యూట్, ఎయిమ్స్

**న్యూఢిల్లీ,జులై 3:** కొవిడ్ వ్యాక్సిన్‌లపై మరోసారి ఆందోళనలు నెలకొంటున్న వేళ ప్రముఖ టీకాల తయారీ సంస్థ సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఐ) స్పందించింది. వ్యాక్సిన్లు సురక్షితమేనని, శాస్త్రీయంగానూ రుజువైందని స్పష్టం చేసింది. ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలకు మధ్య సంబంధం లేదని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే రెండు సమగ్ర అధ్యయానల్లో తేలిక విషయాన్ని గుర్తు చేసిన సీరమ్.. వాటిని ధ్రువీకరిస్తున్నామని పేర్కొంది. కర్ణాటకలోని హసన్ జిల్లాలో గుండె సంబంధిత సమస్యలతో ఇటీవల నెల రోజుల వ్యవధిలోనే 20 మంది మరణించడాన్ని కొవిడ్ టీకాతో ముడిపెడుతూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆందోళనలకు దారితీశాయి. వీటిపై కేంద్ర ఆరోగ్య శాఖ ఇప్పటికే స్పష్టతనివ్వగా తాజాగా ఎయిమ్స్ వైద్యులు కూడా టీకాల పనితీరుపై మాట్లాడారు.

**టీకాలతో సంబంధం లేదు: గులేరియా**

'ఆకస్మిక గుండెపోటు కారణంగా యుక్తవయసు వారు చనిపోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. వీటిపై ఇప్పటికే అధ్యయనాలు జరిగాయి. భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసిఎంఆర్), ఎయిమ్స్ ఆధ్వర్యంలో జరిగిన రెండు సమగ్ర అధ్యయనాల్లో ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలకు సంబంధం లేదని తేలింది. అన్ని టీకాలు, ఔషధాలతో కొన్ని దుష్పరిణామాలు ఉన్నట్లే.. ఈ టీకాలకు కొన్ని ఉంటాయి. కానీ, గుండెపోటు మరణాలకు వీటికి సంబంధం లేదు. ఈ విషయాన్ని ఏ అధ్యయం వెల్లడించ లేదు' అని ఢిల్లీ ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డా. రణీదీప్ గులేరియా పేర్కొన్నారు.

**ఎటువంటి హాని లేదు: డాక్టర్ రాజీవ్ నారంగ్**

'గుండెపోటుకు సంబంధించి యువకులు, వృద్ధులకు కారణాలు వేరుగా ఉంటాయనే విషయం మనందరికీ తెలుసు. వాస్తవానికి ఆకస్మిక గుండెపోటు ముప్పు కొవిడ్ టీకాలు తీసుకున్న వారికి తక్కువగా ఉన్నట్లు ఐసిఎంఆర్, ఎయిమ్స్ అధ్యయనాల్లో తేలింది. కొవిడ్ వ్యాక్సిన్‌తో ప్రయోజనం తప్ప ఎటువంటి హాని లేదని స్పష్టంగా రుజువైంది' అని ఎయిమ్స్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజీవ్ నారంగ్ వెల్లడించారు. మరోవైపు యుక్తవయసువారి ఆకస్మిక మరణాలకు జీవనశైలి, ముందస్తు ఆరోగ్య సమస్యలే కారణం తప్పితే కొవిడ్ వ్యాక్సిన్ కాదని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. దేశీయంగా తయారైన కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితంగా, సమర్థంగా పనిచేస్తున్నాయని, తీవ్ర దుష్పరిణామాలు సంభవించిన ఉదంతాలు అత్యంత అరుదుగా కనిపించాయని ఐసిఎంఆర్, జాతీయ రోగ నియంత్రణ కేంద్రం (ఎన్‌సిడిసి) అధ్యయనాలు వెల్లడించినట్లు వివరించింది.



# హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం..

## -ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

**టెల్‌అవీవ్, జులై 3:** హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. గాజాలో 60 రోజులపాటు కాల్పుల విరమణకు అవసరమైన షరతులను ఇజ్రాయెల్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన తరుణంలో ఈ స్పందన వచ్చింది. 'హమాస్ ఉండదు.. హమస్థాన్ ఉండదు. ఆ విషయంలో మేం వెనక్కి తగ్గబోం. ఆ సంస్థను తుడిచిపెట్టేస్తాం' అని ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ నెతన్యాహు వ్యాఖ్యలు చేశారు. యుద్ధాన్ని నిలువరించడానికి ఈజిప్టు, ఖతార్‌నుంచి వస్తున్న కాల్పుల విరమణ ఒప్పందాలను హమాస్ పరిశీలిస్తున్నదశలో ఈవ్యాఖ్యలుచేయడం గమనార్హం. కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ ఒకే చెప్పిందని, హమాస్ కూడా అంగీకరించాలని ఇటీవల ట్రంప్ ప్రతిపాదించారు. అందుకు తాము సిద్ధమేనని చెప్పిన హమాస్.. గాజాపై యుద్ధాన్ని శాశ్వతంగా ఇజ్రాయెల్ ముగిస్తామంటేనే సంధి చేసుకుంటామని స్పష్టం చేసింది. గాజా భూభాగాల నుంచి ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా వెనక్కి వెళితే దానికి బదులుగా మిగిలిన 50 మంది బందీలను విడుదల చేస్తామని తీవ్రవాద సంస్థ ప్రతినిధి తాహెర్ అల్-నును తెలిపారు. యుద్ధాన్ని ముగిస్తామంటే చర్చలకు సిద్ధమేనని వెల్లడించారు. అయితే, ఆయుధాలు అప్పగించి హమాస్ లొంగిపోవాలని పాలస్తీనాను వీడి వెళ్లిపోవటానికి అంగీకరిస్తేనే 60 రోజుల కాల్పుల విరమణకు అంగీకరిస్తామని ఇజ్రాయెల్ తెలిపింది. యుద్ధానంతరం గాజాలో హమాస్ కనిపించడానికి వీల్లేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టం చేశారు.

# వైట్‌హౌస్‌నుంచి జుకర్‌బర్గ్‌ను బయటకు పంపించేసారా?

## ట్రంప్‌పై వైరల్ అవుతున్న సంచలన కథనాలు

**వాషింగ్టన్,జులై 3:** అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత కీలకమైన సమావేశంలో ఉండగా మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ అనూహ్యంగా ప్రత్యక్షం కావడం, ఆయన్ను బయటకు పంపించేశారంటూ భారీ ఎత్తున ప్రచారంలోకి వచ్చింది. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో ఈ ఘటన జరిగినట్టు తెలుస్తోంది. అయితే, ఈ ఆరోపణలను అప్పటి వైట్‌హౌస్ వర్గాలు తోసిపుచ్చడంతో అసలు ఏం జరిగిందనే దానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఓవల్ ఆఫీస్‌లో డొనాల్డ్ ట్రంప్ అమెరికా వైమానిక దళానికి చెందిన ఉన్నతాధికారులతో తర్వాతి తరం యుద్ధ విమానాల గురించి అత్యంత రహస్యంగా చర్చిస్తున్నారు. ఆ సమయంలో మార్క్ జుకర్‌బర్గ్ హఠాత్తుగా సమావేశంలోకి వచ్చారని మీడియా వార్తలొచ్చాయి. అత్యంత కీలకమైన ఈ భేటీలో పాల్గొనేందుకు జుకర్‌బర్గ్‌కు ఎలాంటి భద్రతా అనుమతులు లేవు. దీంతో ఆయన్ను అక్కడ చూసిన సైనిక అధికారులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారని ఆ కథనం తెలిపింది. పరిస్థితిని అర్థం చేసుకున్న అధికారులు, సమావేశం కొనసాగించడానికి వీలుగా జుకర్‌బర్గ్‌ను గదిలో నుంచి బయటకు వెళ్లి వేచి ఉండాల్సిందిగా కోరినట్టు సమాచారం. ఓవల్ ఆఫీస్‌లో గోప్యత కొరవడటంపై అధికారులు ఆశ్చర్యపోయారని ఒక అధికారి ఈ పరిస్థితిని 'వింత ప్రపంచంలా ఉంది' అని వ్యాఖ్యానించారు. సమావేశం నుంచి జుకర్‌బర్గ్‌ను బయటకు పంపించారనే వార్తల్లో వాస్తవం లేదని, అసలు విషయాన్ని తప్పుగా చిత్రీకరిస్తున్నారని ఆయన తెలిపారు. అధ్యక్షుడు ట్రంప్ అభ్యర్థన మేరకే జుకర్‌బర్గ్ కేవలం పలకరించడానికి మాత్రమే లోపలికి వచ్చారని ఆ అధికారి వివరించారు. సైనిక అధికారులతో సమావేశం ముగిసిన తర్వాత జుకర్‌బర్గ్‌తో ట్రంప్‌కు వేరేభేటీ ఖరారైందని, అందుకే పలకరించి బయటకు వెళ్లి తన మీటింగ్ కోసం వేచి ఉన్నారని స్పష్టం చేశారు.



# అమెరికాలోని షికాగోలో కాల్పులు..

## నలుగురు మృతి, 14 మందికి గాయాలు!

**వాషింగ్టన్, జులై 3:** అమెరికాలోని షికాగోలో కాల్పులు కలకలం రేపాయి. ఓ గుర్తు తెలియని దుండగుడు జరిపిన కాల్పుల్లో నలుగురు మృతి చెందగా 14 మందికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. చికాగోలోని రివర్ నార్త్ పరిసరాల్లో ఉన్న ఓ రెస్టారెంట్ దగ్గర ఓ ఆల్బమ్ రిలీజ్ పార్టీ జరుగుతోంది. అదే సమయంలో అక్కడ లాంజ్‌లో ఉన్న వారిపై ఓ దుండగుడు కాల్పులు జరిపి పారిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. మొత్తంగా 13 మంది మహిళలు, అయిదుగురు పురుషులపై కాల్పులు జరగ్గా వీరిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు, ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. బాధితుల వయసు 21-32 మధ్య ఉందని వీరిని స్థానిక ఆసుపత్రులకు తరలించినట్లు పేర్కొన్నారు.

# వారసుని ఎంపికలో దలైలామాకు మాత్రమే పూర్తి అధికారం

## కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

**న్యూఢిల్లీ,జులై 3:** టిబెటన్ బౌద్ధ గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయంలో చైనా చేస్తున్న వాదనలను భారత్ తీవ్రంగా ఖండించింది. 15వ దలైలామాను ఎన్నుకునే అధికారం పూర్తిగా ప్రస్తుత దలైలామాకు, ఆయన సంస్థకు మాత్రమే ఉంటుందని, ఈ విషయంలో ఇతరుల జోక్యానికి తావులేదని గురువారం స్పష్టం చేసింది. చైనా డిమాండ్‌ను తోసిపుచ్చుతూ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తన వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని, దీనిపై నిర్ణయం తీసుకునే అధికారం గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టుకు మాత్రమే ఉందని దలైలామా ప్రకటించారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే చైనా స్పందించింది. తదుపరి దలైలామా ఎంపికకు తమ ఆమోదముద్ర తప్పనిసరి అని, తమ విధానాలకు అనుగుణంగానే ఈ ప్రక్రియ జరగాలని డిమాండ్ చేసింది. చైనా వాదనపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. "దలైలామా వారసుడిని నిర్ణయించే అధికారం విషయంలో జోక్యం చేసుకునే హక్కు ఎవరికీ లేదు. ఆ నిర్ణయం పూర్తిగా ఆయన చేతుల్లోనే ఉంటుంది. దలైలామా స్థానం కేవలం టిబెటన్లకే కాక, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులందరికీ ఎంతో ముఖ్యమైనదని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తేల్చిచెప్పారు.

# జపాన్‌లో రెండు వారాల్లో 900 సార్లు భూప్రకంపనలు!

**టోక్యో, జూలై 3:** రెండువారాల వ్యవధిలో గంటకు సగటున మూడు కంటే ఎక్కువసార్లు భూమి కంపిస్తుంటే ఎలా ఉంటుంది? ఏ క్షణాన ఏం జరుగుతుందో అని ఆందోళనతో క్షణక్షణం గడపాల్సి వస్తుంది. ఇదే పరిస్థితి జపాన్‌లో నెలకొంది. అక్కడ టొకార దీవుల్లో జూన్ 21 నుంచి భూఫలకాల కదలికలు చురుగ్గా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. బుధవారం కూడా ఇక్కడ 5.5 తీవ్రతతో భూకంపం వచ్చింది. సునామీ హెచ్చరికలు జారీ చేసినా.. తర్వాత ఆపేశారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయానికి గత రెండు వారాలుగా నమోదైన భూ ప్రకంపనల సంఖ్య 900 అని జపాన్ వాతావరణ శాఖ ఏజెన్సీ అధికారి అయాటకా ఎబిటా పేర్కొన్నారు. మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే టొకార దీవుల్లో జనావాసాలు తక్కువగా ఉండటం ఒక్కటే కొంచెం ఊరటనిచ్చే అంశం. ఇక్కడి వారిని ఏ క్షణమైనా తరలించేందుకు వీలుగా అధికారులు సిద్ధం చేశారు.

# అమెరికా స్వాతంత్ర్య వేడుకలకు ఇరాన్ దాడుల ముప్పు



**వాషింగ్టన్,జులై 3:** అమెరికా స్వాతంత్ర్య వేడుకల వేళ దేశవ్యాప్తంగా ఉగ్రదాడుల భయం నెలకొంది. ముఖ్యంగా లోన్ వుల్ఫ్ (ఒంటరిగా దాడులకు పాల్పడేవారు) దాడులు జరగవచ్చని ఫెడరల్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవల ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఈ ముప్పు మరింత పెరిగిందని, దీంతో రేపటి వేడుకల సందర్భంగా అత్యంత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వంటి సంస్థలు సంయుక్తంగా ఒక బులెటిన్‌ను విడుదల చేశాయి. న్యూయార్క్‌లో జరిగే మేసీస్ జులై 4 బాణసంచా వేడుకలకు ఒంటరి వ్యక్తులు లేదా చిన్న చిన్న బృందాల నుంచే ప్రధాన ముప్పు ఉంది. జాతి, మత, రాజకీయ, ప్రభుత్వ వ్యతిరేక లేదా వ్యక్తిగత కారణాలతో దాడులకు పాల్పడే అవకాశం ఉందని ఆ బులెటిన్‌లో హెచ్చరించింది. ఈ హెచ్చరికలు కేవలం న్యూయార్క్‌కే పరిమితం కాదని, దేశంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పెద్ద కార్యక్రమాలు కూడా లక్ష్యంగా ఉండవచ్చని స్పష్టం చేశాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో న్యూయార్క్ గవర్నర్ కేథీ హోచుల్ స్పందించారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్తతల దృష్ట్యా గత కొన్ని వారాలుగా భద్రతా పరిస్థితిపై నాకు నిరంతరం నివేదికలు అందుతున్నాయి. జులై 4 సెలవుల సందర్భంగా లోన్ వుల్ఫ్ దాడుల ముప్పు ఎక్కువగా ఉందని మా ఫెడరల్ భాగస్వాములు నిన్న మరోసారి స్పష్టం చేశారు. ఈ సెలవుల్లో కుటుంబాలు సంతోషంగా గడిపేలా చూడటం, న్యూయార్క్ వాసుల భద్రతే నా ప్రథమ ప్రాధాన్యత అని ఆమె తెలిపారు. ఇరాన్‌తో ఉద్రిక్తతల తర్వాత రాష్ట్రంలోని భద్రతా బలగాలు ఇప్పటికే అప్రమత్తంగా ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద కార్యక్రమాల వద్ద స్టేట్ పోలీసుల మోహరింపును మరింత పెంచుతామని గవర్నర్ తెలిపారు. ప్రధాన రవాణా కేంద్రాలు, వంతెనలు, సొరంగాల వద్ద నేషనల్ గార్డ్ సిబ్బందిని మోహరించామని, సోషల్ మీడియా కార్యకలాపాలను, సైబర్ దాడుల ముప్పును నిశితంగా గమనిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇటీవల ఇజ్రాయెల్‌తో జరిగిన ఘర్షణలో భాగంగా అమెరికా సైన్యం జూన్ 22న ఇరాన్‌లోని మూడు కీలక అణు కేంద్రాలపై బాంబు దాడులు చేసింది. ఆ తర్వాత గతనెల 23న కాల్పుల విరమణ ఒప్పందం కుదిరి, జూన్ 24 నాటికి అది పూర్తిగా అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలోనే డీహెచ్ఎస్ గతనెల 22న ఒక బులెటిన్‌ను విడుదల చేసింది. 2020 జనవరిలో తమ సైనిక కమాండర్ మృతికి కారణమైన అమెరికా అధికారులను ఇరాన్ లక్ష్యంగా చేసుకోవచ్చని అందులో హెచ్చరించింది. ఇజ్రాయెల్‌ఇరాన్ ఉద్రిక్తతలు అమెరికాలోని కొందరిని దాడులకు పురిగొల్పవచ్చని కూడా పేర్కొంది. దాదాపు 2 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉన్న శాన్ ఫ్రాన్సిస్కో జులై 4 బాణసంచా కార్యక్రమంపై కూడా ఫెడరల్ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని సామూహిక ప్రాణనష్టం కలిగించే దాడులకు అనువైన సాఫ్ట్ టార్గెట్స్ సముదాయంగా ఎఫ్‌బీఐ, డీహెచ్ఎస్ నివేదిక అభివర్ణించింది. ఈ ఏడాది జనవరి 1న న్యూ ఓర్లీన్స్‌లో ఐసిస్ ప్రభావంతో ఒక వ్యక్తి ట్రక్కుతో జనంలోకి దూసుకెళ్లి 14 మందిని చంపిన ఘటనను గుర్తుచేస్తూ, అలాంటి కాపీక్యాట్ దాడులు జరగవచ్చని అధికారులు హెచ్చరికలు జారీచేసారు.

# గుజరాత్‌లో బిజెపికి కాంగ్రెస్ సహకారం

## కాంగ్రెస్‌తో మాకు పొత్తు లేదు : కేజ్రీవాల్



**గాంధీనగర్, జులై3:** కాంగ్రెస్‌తో తమకు పొత్తు లేదని ఆప్ జాతీయ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో గుజరాత్‌లో అధికార బిజెపికి కాంగ్రెస్ సహకరించిందని ఆరోపించింది. కాంగ్రెస్ సారథ్యంలో విపక్ష పార్టీలతో ఏర్పాటైన ఇండియా కూటమి కేవలం గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ఉద్దేశించింది. మాత్రమేనన్నారు. గురువారం ఆయన అహ్మదాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. 2027లో జరగనున్న గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పోటీ చేసి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. అక్కడి ప్రజలు ఇప్పుడు బిజెపి, కాంగ్రెస్‌లను కాకుండా ఆప్‌వైపే చూస్తున్నారన్నారు. కాంగ్రెస్‌తో మాకు పొత్తు లేదు. ఒకవేళ ఏదైనా పొత్తు ఉందనుకుంటే, విశావదర్ ఉప ఎన్నికల్లో వాళ్లెందుకు మాపై పోటీ చేశారు? మమ్మల్ని ఓడించాలని చూశారు. ఓట్లు చీల్చి ఆప్‌ను ఓడించేందుకు కాంగ్రెస్‌ను బిజెపి పంపించింది. కాంగ్రెస్ విఫలం కావడంతో బిజెపి వారిని కూడా చీవాట్లు పెట్టింది. ఇండియా కూటమి కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే. ఇప్పుడు మా వైపు నుంచి ఎలాంటి పొత్తు లేదు అన్నారు. ఇటీవల గుజరాత్‌లోని విశావదర్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆప్ నేత గోపాల్ ఇటాలియ విజయం సాధించిన విషయం తెలిసిందే. బిజెపి అభ్యర్థి కిరీట్ పటేల్‌పై 17 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి నితిన్ రణ్‌పారియాకు కేవలం 5501 ఓట్లు మాత్రమే వచ్చాయి. గుజరాత్‌లో నేటి నుంచి గుజరాత్ జోడో అభియాన్‌ను ప్రారంభిస్తున్నట్లు కేజ్రీవాల్ తెలిపారు. దీని ద్వారా ప్రజలు తాము ఇచ్చిన నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా ఆప్‌లో చేరవచ్చన్నారు. తమ కార్యకర్తలు కూడా ప్రతి ఇంటిని సందర్శిస్తారన్నారు. ఆప్ యువకుల పార్టీ అని, అవినీతి రహిత గుజరాత్‌ను కోరుకునే యువత పెద్ద సంఖ్యలో తమతో కలిసి రావాలని ఈ సందర్భంగా కేజ్రీవాల్ విజప్తి చేశారు.

# విమానం గాల్లో ఉండగానే.. నేలపై పడిన రెక్క విడిభాగం!



**వాషింగ్టన్, జూలై 3:** విమానం గాల్లో ఉండగానే దాని రెక్కలోని ఓ భాగం ఊడిపోయి రోడ్డుపై ఘటన అమెరికాలోని నార్త్ కరోలినాలో చోటుచేసుకుంది. ఈ విషయాన్ని అమెరికాలోని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ కూడా ధ్రువీకరించింది. మంగళవారం రాత్రి హార్ట్స్‌ఫీల్డ్-జాక్సన్ అట్లాంటా ఇంటర్నేషన్ ఎయిర్ పోర్టు నుంచి డెల్టా ఫ్లయిట్ నెంబరు 3247 బోయింగ్ 737-900 విమానం నార్త్ కరోలినాలోని రెలీ-దర్హం ఎయిర్‌పోర్టుకు బయల్దేరింది. ఈ విమానం ప్రయాణం మొత్తం సాఫీగానే సాగింది. కానీ, రెలీ ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ సమయంలో అత్యంత కీలకమైన విమానం రెక్కలోని ఫ్లాప్‌కు సంబంధించిన విడిభాగం ఊడిపోయింది. ఇది కింద ఉన్న రోడ్డుమార్గంపై పడింది. అదృష్టవశాత్తు విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. ఆ సమయంలో 109 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది దానిలో ఉన్నారు. ఎయిర్‌పోర్టులో సదరు విమానం ఎడమ రెక్క వెనుక ఫ్లాప్‌లో కొంత భాగం కనిపించడం లేదు. పూర్తి స్థాయి తనిఖీలు నిర్వహించగా.. ప్రయాణం సమయంలోనే ఆ భాగం ఊడిపోయి మార్గం మధ్యలో పడిపోయినట్లు గుర్తించారు. ఈ ఘటనపై డెల్టా ఎయిర్‌లైన్స్ ఎఫ్ఎఎకు సమాచారం అందించింది. దీనిపై బుధవారం ఎఫ్ఎఎ స్పందిస్తూ.. రెలీలోని ఓ మోటార్‌వేలో వింగ్ ఫ్లాప్‌లోని విడిభాగం దొరికిందని ప్రకటించింది. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. దీనిపై డెల్టా ఎయిర్‌లైన్స్ స్పందిస్తూ దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని చెప్పారు.
ఫ్లాప్స్ అనేవి విమానం రెక్క వెనకభాగంలో ఉంటాయి. వీటిని కదిలించే అవకాశం ఉంటుంది. ల్యాండింగ్, టేకాఫ్ సమయంలో లిఫ్ట్, డ్రాగ్‌ను నియంత్రించడానికి వీటిని వినియోగిస్తారు. వీటి నియంత్రణలు పైలట్ చేతిలో ఉంటాయి. ఇటీవల కాలంలో బోయింగ్ విమానాల్లో భద్రతా లోపాలు తరచూ బయటపడుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని బోయింగ్‌పై న్యాయస్థానంలో కేసులు వేసిన సంస్థలో పనిచేసే న్యాయవాదికి చెందిన బీచ్‌హౌస్ ఎదుటే డెల్టా ఎయిర్‌లైన్స్ విమానం ఫ్లాప్ పడిపోవడం కొసమెరుపు. ఫ్లాప్ ఊడిపడిన ఘటనలో ఎవరూ గాయపడలేదు.

# అమర్‌నాథ్‌యాత్రకు పటిష్టమైన బందోబస్తు



**జమ్ము,జులై 3:** జమ్మూకశ్మీర్‌లో 36 రోజుల పాటుజరిగే పవిత్ర అమర్‌నాథ్ యాత్ర ఘనంగా ప్రారంభమైంది. దేశం నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లమధ్య మంచులింగాన్ని దర్శించుకునేందుకు బయలుదేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వం, భారత సైన్యం కల్పించిన సౌకర్యాలు, భద్రతపై యాత్రికులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఏర్పాట్లు చాలా అద్భుతంగా ఉన్నాయని భక్తులు ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా, భారత సైన్యం తమకు పూర్తి భద్రతా భరోసా కల్పిస్తోందని, వారి అండతోనే తాము నిర్భయంగా యాత్ర చేయగలుగుతున్నామని పలువురు యాత్రికులు తెలిపారు. ఒకప్పుడు ఉగ్రదాడుల భయంతో తక్కువ మంది వచ్చేవారని, కానీ ఇప్పుడు ప్రభుత్వం కల్పించిన భద్రతతో పెద్ద సంఖ్యలో యాత్రకు వస్తున్నామని ఆనందంవ్యక్తం చేశారు. గురువారం ఉదయం బల్తాల్, పహల్గామ్ బేస్ క్యాంపుల నుంచి యాత్రికుల తొలి బృందాలు బయలుదేరాయి. 5,246 మంది భక్తులతో కూడిన రెండో బృందం జమ్మూలోని భగవతి నగర్ యాత్రి నివాస్ నుంచి ప్రత్యేక భద్రతా కాన్వాయ్‌ల నడుమ కశ్మీర్ లోయకు బయలుదేరింది. అంతకుముందు, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం యాత్రను అధికారికంగా ప్రారంభించారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ఈసారి అధికారులు కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా చర్యలు చేపట్టారు. భారత సైన్యం, పారామిలటరీ బలగాలతో పాటు అదనంగా 180 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలను (సిఆర్‌పిఎఫ్) మోహరించారు. యాత్రికులు తప్పనిసరిగా భద్రతా కాన్వాయ్‌లలోనే ప్రయాణించాలని, ఒంటరిగా వెళ్లవద్దని అధికారులు కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. సముద్ర మట్టానికి 3,888 మీటర్ల ఎత్తులో ఉన్న పవిత్ర గుహకు భక్తులు పహల్గామ్ లేదా బల్తాల్ మార్గాల గుండా చేరుకోవచ్చు. అయితే, ఈ ఏడాది భద్రతా కారణాల దృష్ట్యా హెలికాప్టర్ సేవలను నిలిపివేశారు. ఈ యాత్ర శ్రావణ పౌర్ణమి రోజైన ఆగస్టు 9న ముగియనుంది.

# స్టూడెంట్ వీసాలకు దరఖాస్తుల స్వీకరణ షురూచేసిన అమెరికా!

**వాషింగ్టన్,జులై 3:** అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విదేశీ విద్యార్థులకు సుమారు నెల రోజుల విరామం తర్వాత విద్యార్థి వీసా దరఖాస్తుల స్వీకరణను పునఃప్రారంభించినట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ఈసారి దరఖాస్తుదారులకు కొన్ని కఠినమైన నిబంధనలతో పాటు తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. వీసా మంజూరు ప్రక్రియలో కీలక మార్పులు చేసినట్లు స్పష్టం చేసింది. అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మిగ్నాన్ హ్యూస్టన్ మాట్లాడుతూ విద్యార్థి వీసా దరఖాస్తులు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అయితే, ఒక విషయాన్ని విద్యార్థులు స్పష్టంగా గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. విద్యార్థులు ఏ ఉద్దేశంతో వీసా కోసం దరఖాస్తు చేసుకున్నారో, ఆ పని కోసమే దానిని ఉపయోగించుకోవాలి. అమెరికాకు వచ్చిన తర్వాత చదువును మధ్యలో వదిలేయడం లేదా క్యాంపస్‌లలో విధ్వంసానికి పాల్పడటం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని ఆమె స్పష్టం చేశారు.
దేశ జాతీయ భద్రత, వలస చట్టాలను దృష్టిలో ఉంచుకునే తమ విధానాలు ఉంటాయని, అమెరికా ఇమిగ్రేషన్ వ్యవస్థ అత్యున్నత ప్రమాణాలతో కొనసాగేలా చూస్తామని ఆమె వివరించారు. ఈ నిబంధనలు కేవలం అమెరికా పౌరులకే కాకుండా, వారితో కలిసి చదువుకునే ఇతర దేశాల విద్యార్థుల భద్రతకు కూడా అవసరమని అన్నారు. సోషల్ మీడియా ఖాతాల పరిశీలన ప్రక్రియ (వెట్టింగ్ ప్రాసెస్) కోసం గత నెల రోజులుగా నిలిపివేసిన దరఖాస్తుల స్వీకరణను జూన్ 18 నుంచి తిరిగి ప్రారంభించినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తమ అన్ని సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను తప్పనిసరిగా పబ్లిక్ వ్యూలో ఉంచాలని ఆదేశించింది. ఈ నిబంధనను పాటించని వారి దరఖాస్తులను తిరస్కరించడమే కాకుండా, భవిష్యత్తులో వారు అమెరికాకు వచ్చే అవకాశాలనుకూడా కోల్పోతారని తేల్చిచెప్పింది. మరోవైపు విద్యార్థి వీసాలకు కూడా నిర్దిష్ట కాలపరిమితి విధించాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయడం విదేశీ విద్యార్థుల్లో కొత్త ఆందోళనకు కారణమవుతోంది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే ఎఫ్1, జె1 వీసాలపై అమెరికాలో ఉంటున్న వారిపై ప్రత్యక్ష ప్రభావం పడుతుంది. దీని ప్రకారం వీసా గడువు ముగిసిన ప్రతిసారీ విద్యార్థులు పొడిగింపు కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలు ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ విభాగం సమీక్షలో ఉన్నాయి.

04-07pg6exHMNWJQE.qxd:04-07pg6exHMNWJQE.qxd 01/01/01 8:46 AM Page 1



# బిసిల ఆత్మగౌరవ భరోసా సభను విజయవంతం చేయండి

## - ఆల్మెన్ రాజు, పరసారత్నం పిలుపు

**తిరుపతి కలెక్టరేట్, జులై 03 ప్రభాతవార్త :** తిరుపతి ఇందిరా మైదానంలో ఈనెల 6న ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరి నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీ ఆత్మ గౌరవ భరోసా సభను విజయవంతం చేయాలని బీసీ సంఘాల దక్షిణాది రాష్ట్రాల కన్వీనర్ ఆల్మెన్ రాజు, అంబేద్కర్ పూలే వ్యవస్థాపకులు పరసారత్నం పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పెద్ద కాపులేఅవుట్ ఓ రెసిడెన్సీ లో నాగరాజుగౌడ్ అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. ఆల్మెన్ రాజు మాట్లాడుతూ ఇందిరామైదానంలో సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటలకు సభ జరుగుతుందన్నారు. అంతకు ముందు మధ్యాహ్నం 2 గంటలకు పూలే విగ్రహం నుంచి నగర వీధులుగా గుండా ర్యాలీగా బీసీ సోదరులు పెద్ద ఎత్తున ఇందిరా మైదానానికి చేరుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి నలుగురు మంత్రులు హాజరు కానున్నారని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలోని బీసీ సోదరులు, సోదరీమణులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పరసారత్నం మాట్లాడుతూ ఈ సభ ద్వారా ఎస్సీ, ఎస్టీ బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీ ప్రజలు పడుతున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సోదరులు, ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా, నగర నేతలు,సభ్యులు, బీసీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సభకు కేంద్ర మంత్రి రాందాస్‌ను ఆహ్వానిస్తున్న కల్లూరి నాగరాజు గౌడ్

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్లో అవార్డుల ప్రకటన ఉత్సాహాన్నిస్తుంది

## -మంత్రి కొలుసు పార్థసారథి



ఎపి ఛాంబర్స్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ఆడియో విజువల్‌ని, అవార్డుల బ్రోచర్ ను విడుదల చేసిన మంత్రి పార్థసారథి,మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,జూలై3,ప్రభాతవార్తప్రతినిధి:** ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఎక్సలెన్స్ అవార్డ్స్ ప్రకటన ఉత్సాహినిస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏపీ ఛాంబర్స్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 పరిచయ కార్యక్రమంను విజయవాడ నగరంలోని ఓ ప్రైవేటు హోటల్ లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉండే ఇండస్ట్రీస్ కి ప్రోత్సాహకాలు పై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. రాష్ట్రం లో రిజిస్టర్ కాబడిన కంపెనీ లను గుర్తించి ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అవార్డ్స్ ఇవ్వడటం జరుగుతుందని మొత్తం గా 14 రంగాల్లో నామినేటెడ్ చేయటం జరుగుతుందన్నారు. అవార్డు గ్రహీతల ఎంపిక అత్యంత పారదర్శకంగా ఉంటుందని తెలిపారు. మన రాష్ట్రం లో మెరుగైన వనరులు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవడంపై ఛాంబర్ ఆఫ్ కామర్స్ దృష్టి సారించాలన్నారు.మన రాష్ట్రంలో మరో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నారు.పీ4 మోడల్ ద్వారా సామాన్యుడిని సైతం పైకి తేవాలని మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మన ముఖ్యమంత్రి విజన్ మన రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతుందని, ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా హైదరాబాద్ ను గమనించవచ్చని మంత్రి అన్నారు.గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖామాత్యులు కొల్లు రవీంద్ర మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలకు 12 రంగాల్లో 15 అవార్డులను అందించనున్నారని వివరించారు. ప్రభుత్వానికి, పరిశ్రమలకు మధ్య వారధిలా ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ పనిచేస్తుందన్నారు. మన రాష్ట్రంలో 13 పోర్ట్స్ ను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు వెళుతున్నారన్నారు. డబల్ ఇంజన్ సర్కార్ కాదు ఫోర్ ఇంజన్ సర్కార్ మన రాష్ట్రంలో ఉందని, టర్బో ఇంజన్ రూపం లో చంద్రబాబు, లోకేష్, పవన్,బీజేపీ లు లాంటి ఫోర్ ఇంజన్ లు కలిగి ఉన్నాయని ఇక అభివృద్ధిలో వెనకడుగు వేసే పరిస్థితి లేదన్నారు. పారిశ్రామిక వేత్తల తో పాటు ఉద్యోగస్తులకు కూడా అవార్డ్స్ ఏర్పాటు చేస్తే ఉద్యోగులకు, పారిశ్రామిక వేత్తలకు మధ్య సత్సంబంధాలు పెరుగుతాయని మంత్రి కొల్లు రవీంద్ర అభిప్రాయ పడ్డారు.సభలో తొలుత మంత్రి పార్థసారథి ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ఆడియో విజువల్(ఏవీ)ని విడుదల చేయగా, మంత్రి కొల్లు రవీంద్ర అవార్డుల బ్రోచర్ ను విడుదల చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అవార్డుల లోగోను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఛాంబర్స్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో రిజిస్టర్ / పనిచేస్తున్న సంస్థలు తమ నామినేషన్లను ధాఖలు చేయడానికి అర్హులని అన్నారు. నామినేషన్లను జూలై 30 లోపు ధాఖలు చేయాలని సూచించారు. నామినేషన్ల ధాఖలు కోసం వెబ్ సైట్ ను సందర్శించాల్సిందిగా కోరారు.

విజేతలను ఈ ఏడాది ఆగస్టు 30న నిర్వహించే కార్యక్రమంలో అవార్డులతో సత్కరించనున్నామని తెలిపారు. ఇతర వివరాలకు 9121221473, 9121221474, 9912092222 నెంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చని 'కూటమి' ప్రభుత్వం

## కౌన్సిల్‌లో విపక్షనేత బొత్స



**విజయనగరం, జులై 3 (ప్రభాతవార్త ప్రతినిధి) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు, ఇచ్చిన మాటను అమలు చేయకుండా ఏడాది కాలంలో రాష్ట్ర ప్రజలను మోసం,దగా చేసిందని మాజీ మంత్రి, శాసన మండలిలో ప్రతిపక్ష పార్టీ నాయకుడు బొత్స సత్యనారాయణ విమర్శించారు. గురువారం వైసీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం స్థానిక జగన్నాథ ఫంక్షన్ హాల్ లో వైసీపీ విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు ,జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది.సమావేశంలో బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఇంత వేగంగా ప్రతిపక్షానికి పని చెబుతారని అనుకోలేదన్నారు.ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రణాళిక చాలా పవిత్రమైందన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తారని నమ్మిన ప్రజలను మోసం చేసిందన్నారు. అధికార పక్షం ఇచ్చిన వాగ్దానాలను మెడలు వంచి అమలు చేయాల్సి న బాధ్యత ప్రతిపక్ష పార్టీపై ఉందన్నారు. చంద్రబాబు,పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజలు ఇచిన నమ్మకాన్ని త్రికరణ శుద్ధితో అమలు చేస్తామని ప్రమాణ పత్రం విడుదల చేసి నేడు అమలు చేయకుండా మోసం చేసారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రతిపక్ష పార్టీ గా తాము అడిగితే తాట తీస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఎవరు తాట తీస్తారో ప్రజలే తేలుస్తారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతి సారి మహిళలు,రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రతి మహిళకు నెలకు 1,500 ఇస్తామని చెప్పారని, ఎక్కడ ఇచ్చారని,నిరుద్యోగ భృతి మూడు వేలు అన్నారని, ఇంత వరకూ ఎంతమంది కి ఇచ్చారని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఇలా అడిగితే బెదిస్తున్నారని, ఇలాంటి తాటాకు చప్పుళ్లకు పార్టీ నాయకులు,కార్యకర్తలు భయపడేది లేదన్నారు. ఏడాది కాలంలో రైతులకు ఇస్తామన్న అన్నదాత సుఖీభవ డబ్బులు ఏవని ప్రశ్నించారు.చంద్రబాబు 100 అబద్ధాలు ఆడితే లోకేష్ 200 అబద్ధాలు ఆక్షేపించారు.

# స్వర్ణాంధ్ర 2047లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత

## పి 4లో భాగంగా 264 కుటుంబాలను దత్తత తీసుకుంటా - మంత్రి కొండపల్లి శ్రీనివాస్

### స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రణాళిక, పి4 కార్యక్రమాలపై సమీక్షించిన మంత్రులు



**విజయనగరం, జూలై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** స్వర్ణాంధ్ర 2047లో భాగంగా రాష్ట్రాన్ని పేదరికం లేని రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం విజన్ ప్రణాళిక రూపొందించిందని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రణాళిక, పి.4 కార్యక్రమాలపై మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ మంత్రి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి వచ్చే ఐదేళ్లకు ఒక ప్రణాళిక, 2047 నాటికి మరో ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. 3 సెక్టార్లు, 5 సబ్ సెక్టార్లలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా చేసుకోవడం జరిగిందన్నారు. రానున్న ఐదేళ్లలో వ్యవసాయంలో రెట్టింపు అభివృద్ధిని సాధించాలనే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించా మన్నారు. ఇందుకోసం వ్యవసాయ, అనుబంధ రంగాలలో సాగులో లేకుండా ఉన్న భూములను గుర్తించి, ప్రత్యామ్నాయ పంటలు, అంతర పంటలు వేసి సాగును పెంచి, దిగుబడిని కూడా పెంచి, మార్కెటింగ్‌కు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అందుకోసం వ్యవసాయ, అనుబంధ శాఖలు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు సమగ్ర ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. జిల్లాకు వ్యవసాయాధారిత పరిశ్రమలు వచ్చేలా క్షేత్ర స్థాయిలో ప్లానింగ్ ఉండాలని, ప్రణాళికలను కార్యాచరణలోకి తేవడం ముఖ్యమని మంత్రి తెలిపారు. ఎం.ఎస్.ఎం.ఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యాన పంటలకు ఎక్కువగా అవకాశం ఉందని, అందులో వాణిజ్య పంటలకు ఎక్కువ గిరాకీ ఉంటుందని, ఈ పంటల పై ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తోందని, దీనిపై విస్తృత ప్రచారం జరగాలని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ కోసం కేంద్ర ప్రభుత్వం క్లస్టర్ మాపింగ్ క్రింద సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో మ్యాంగో క్లస్టర్ మాపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. సర్వీస్ సెక్టార్ క్రింద పర్యాటక రంగంలో సన్ రే రిసార్ట్స్ 150 కోట్లతో, ఎయిర్ పోర్ట్ నందు జి.ఎం.ఆర్ వారు 150 కోట్లతో అదాని గ్రూప్ 100 కోట్లతో హోటళ్ళను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు.

అలాగే ఎకో టూరిజం క్రింద తాటిపూడి జలాశయంను అభివృద్ధి చేయడానికి 23 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున మాట్లాడుతూ జిల్లా పర్యాటక కేంద్రాలను వెబ్‌సైట్‌లో పెట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. పి4 లో భాగంగా తాను ఒక కుటుంబాన్ని దత్తత తీసుకున్నట్లు జిల్లా ఇంచార్జ్ మంత్రి అనిత వెల్లడించారు. పి4 అంటే ఆర్థిక అంశాలే కాదని, విద్య తదితర ఆర్థికేతర అంశాలలో కూడా సహాయ పడవచ్చునని తెలిపారు. జిల్లాలో 6700 బంగారు కుటుంబాలు ఉన్నాయని, అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ దత్తత తీసుకునేం దుకు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు.

# ఇంటర్మీడియట్ ప్రవేశాల గడువు పొడిగింపు

**విజయవాడ జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు ఇంటర్మీడియట్ విద్యా శాఖ డైరెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 30 తో ప్రవేశాలకు గడువు ముగిసింది. కొన్ని కళాశాలల అభ్యర్థన మేరకు ప్రవేశాల గడువును పొడిగించారు. పదో తరగతిలో సప్లిమెంటరీ పరీక్షలతో కలిపి మొత్తం 5,92,602 మంది ఉత్తీర్ణత సాధించగా ఇప్పటి వరకు ఇంటర్మీడియట్‌లో 4.90 లక్షల మంది చేరారు. కొంత మంది ఐటీఐ, పాలిటెక్నిక్, ఇతరత్రా కోర్సుల్లో ప్రవేశాలు పొందారు.

# శాంతినారాయణకు ప్రతిభా పురస్కారం

## - పలు సాహితీ సంస్థల శుభాకాంక్షలు



**అనంతపురము, జూలై 3 ప్రభాత వార్తబ్యూరో** ప్రసిద్ధ నవలా కథా రచయిత, కవి, కాలమిస్టు, సాహిత్య సేవకుడు డా.శాంతి నారాయణకు సుర వరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం 2023వ సంవత్సరానికి నవలా/కథా విభాగంలో ప్రతిభా పురస్కారం ప్రకటించింది. ఈ సందర్భంగా డా.శాంతి నారాయణకు శ్రీశ్రీ కళావేదిక, అభ్యుదయ రచయితల సంఘం, సాహిత్య భారతి, ఉమ్మడిశెట్టి సాహిత్య ట్రస్ట్, జిల్లా రచయితల సంఘం, తెలుగు వెలుగు, సాహిత్య భారతి, స్పందన అనంతకవుల వేదిక, సాహితీ స్రవంతి, మానవత, అనంత సాహితీ ప్రస్థానం ట్రస్ట్, ఉమరాలీషా సాహిత్య సంస్థ, తెలుగు భాషా సంరక్షణ సమితి, తపన సాహిత్య వేదిక మొదలైన సాహితీ సాంస్కృతిక సామాజిక సంఘాలు శుభాకాంక్షలు చెప్పాయి. డా.శాంతి నారాయణ దాదాపు 70 కథానికలు, నాలుగు నవలలు రచించారు. రెండు సంపుటాలు కవిత్వం రాశారు. నాగలకట్ట సుద్దులు రెండు సంపుటాలు ప్రచురించారు. అనంతపురం జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా అద్భుతంగా పనిచేశారు. విమలాశాంతి సాహితీ సామాజిక సేవాసమితి ద్వారా రచయితలకు పురస్కారాలను, సీనియర్ రచయితలకు జీవిత సాఫల్య పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు.

# 'సింగిల్ మూవీ పైరసీ విక్రేత అరెస్ట్

## తూర్పుగోదావరి జిల్లా నుంచి వచ్చి యేడాదిగా అక్రమ వ్యవహారం

## 40 సినిమాలు పైరసీ చేసినట్లు పోలీసులు వెల్లడి

## తెలుగు సినీపరిశ్రమకు రూ. 3,700 కోట్ల నష్టం



**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** ఓ తెలుగు చిత్రాన్ని సింగిల్ స్క్రీన్‌పై డిజిటల్ వీడియో తీసి అదే ఆన్‌లైన్‌లో అక్రమంగా విక్రయించిన పైరసీ దారుడును గురువారం నగర సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏడాదిలో నలభై వరకు చిత్రాలను పైరసీ చేసినట్లు గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ నరేశ్ తెలి పిన వివరాల ప్రకారం ఏపీ ఈస్ట్‌గోదావరి జిల్లాకు చెందిన జన కిరణ్‌కుమార్ (29) నగరానికి వచ్చి వనస్థలిపురంలోని ఎన్జీవో కాలనీలో ఏసీ టెక్ని షియన్‌గా పనిచేస్తున్నాడు. ఈజీమని సంపాందిచేందుకు మూవీ పైరసీ చేయ డం మొదలెట్టాడు. ఇందుకు సంబంధించిన పైరసీ మూవీలను కొనుగోలు చేసేవారిని పరిచయం చేసుకున్నాడు. దీంతో ఏడాదిగా పైరసీలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. అయితే మూవీ కంటెంట్‌ల లింక్‌లు పంపించి ఒప్పందం చేసుకుంటాడు. తాజాగా గత నెలలో 'సింగిల్స్' తెలుగుచిత్రం విడు దలైంది. అయితే నగరంలోని ఓ థియేటర్‌లోనే బ్లాక్‌లో టికెట్టు కొను గోలు చేసి మొబైల్‌తో సినిమాను అక్రమంగా వీడియో తీశాడు. ఆ తర్వాత ఈమెయిల్‌లో ముందు సమాచారం ఇవ్వడం ఆపై ఎవరికీ అనుమానం రాకుండా భద్రత చర్యలు చేపట్టి ఆన్‌లైన్ టెలిగ్రామ్‌లో పంపిస్తున్నాడు. పైరసీ గ్రూపులు అయిన తమిళ్ఎంవీ, తమిళ్‌బ్లాస్టర్స్‌తో పాటు మరొకటి దానికి పంపించి ఒక్కో సినిమాకు క్రిప్టో కరెన్సీలో చెల్లింపులు జరిగేలా రాజీ కుదుర్చుకొని వాటిని భారత్ కరెన్సీలోకి మార్చుకుంటున్నాడు. ఇటీవల సినిమాపై అనుమానం తలెత్తడంతో టీఎఫ్‌సీసీ ప్రతినిధి మణీంద్రబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతేడాది తెలుగు ఇండస్ట్రీ రూ.3700కోట్లు నష్టపోయిందని ఆయన పేర్కొన్నారు. వెంటనే దర్యాప్తు చేపట్టిన సీసీఎస్ పోలీసులు నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లను స్వాధీనపరుచుకొని రిమాండ్‌కు తరలించారు.

**పైరసీపై కఠినచర్యలు: ఎఫ్‌డిసి చైర్మన్ దిల్‌రాజు**

సినీ పరిశ్రమలో పైరసీని అరికట్టెందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని, ఇందు కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఎఫ్‌డీసీ ఎండీ సిహెచ్ ప్రియాంక తో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఉప ముఖ్యమంత్రితో పలు కీలక సమావేశాలు నిర్వహిం చామని, సినిమా ఇండస్ట్రీ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. అవసరమైతే నూతన నిబంధనల రూపకల్పన కూడా చేస్తామని చెప్పారు.ఎఫ్‌డీసీ నోడల్ ఏజెన్సీగా , ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సైబర్ సెల్, పోలీస్ శాఖల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి, సినిమా షూటింగ్ లకు ఆన్‌లైన్ అనుమతుల ప్రాసెస్‌తో పాటు వీడియో పైరసీ నియంత్రణకు కఠిన చర్యలు ఉంటాయని దిల్ రాజు పేర్కొన్నారు. సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందరం కలిసి ఈ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాల్సి న అవసరం ఉందని వివరించారు. ఎఫ్‌డీసీ ఎండీ సిహెచ్. ప్రియాంక మాట్లాడుతూ సినిమా జర్నలిస్టుల అక్రిడిటేషన్ అంశంపై సమీక్ష జరిపి, సాధ్యసాధ్యాలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇండస్ట్రీ సమస్యలపై ఎవరైనా తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి తప్పకుండ తాము కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

# కురిడి గ్రామంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మామిడి పండ్లు పంపిణీ

**అరకు రూరల్, డుంబ్రిగుడ, జులై 3 , ప్రభాత వార్త :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గిరిజన ప్రాంతంపై ప్రత్యేకమైన అభిమానాన్ని చూపిస్తున్నారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను అల్లూరి జిల్లా పర్యటన ద్వారా తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారు. అలాగే గిరిజన గ్రామాల్లో సందర్శించి గ్రామస్థులతో ఆప్యాయత గా మాట్లాడి వారి అవసరాలను గుర్తిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకులోయ నియోజకవర్గం పరిధిలోని కురిడి గ్రామస్తులకు డిప్యూటీ సీఎం తన సొంత తోట లో ఆర్గానిక్ పద్ధతి న పండించిన మామిడి పండ్లను తన సిబ్బంది ద్వారా పంపించి ప్రతి ఒక్కరికి అందజేశారు. కాగా ఇటీవల అల్లూరు జిల్లా పర్యటన అనంతరం ఉప ముఖ్యమంత్రి అరకులోయ నియోజకవర్గం డుంబ్రిగుడ మండలం పరిధిలోని పెదపాడు గ్రామానికి పాదరక్షలు ( చెప్పులు ) పంపించి తన అభిమానాన్ని చూపించిన సంగతి విధితమే. అదేవిధంగా మరోసారి అదే మండలం పరిధిలోని కురిడి గ్రామస్తులకు తన సొంత తోట లో పండించిన మామిడి పండ్లను తన సిబ్బంది ద్వారా ప్రత్యేకంగా పంపించి పంపిణీ చేసి మరోసారి తన అభిమానాన్ని గిరిజనులతో పాలుపంచు కున్నారు. డిప్యూటీ సీఎం హోదాలో ఉంటూ మారుమూల గిరిజన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, తమ సమస్యలను పరిష్కరించడమే కాకుండా, తమ అవసరాలను గుర్తిస్తుండడం తమకు ఎంతో ఆనందంగా ఉందని , పవన్ బాబు పది కాలాలపాటు చల్లగా ఉండాలని ఈ సందర్భంగా గిరిజనులు డిప్యూటీ సీఎం కి తమ ఆశీస్సులను అందజేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన సొంత తోటలో పండించిన మామిడి

పండ్లను ప్రత్యేకంగా తమ గ్రామానికి పంపించి మరోసారి తన అభిమానాన్ని చాటుకున్నారని కురిడి గ్రామస్తులు ఆనందంగా చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గిరిజనులపై తన ప్రత్యేక అభిమానాన్ని చూపిస్తున్నారనడానికి, గిరిజన గ్రామాల్లో ఆయన చేపడుతున్న కార్యక్రమాలే నిదర్శనంగా పేర్కొనవచ్చు.

# రెవెన్యూ అంశాలపై వ్యవసాయ అధికారులు అవగాహన కలిగిఉండాలి : వ్యవసాయ సంచాలకులు ఢిల్లీరావు

## - అన్నదాత సుఖీభవ పథకం నకు గ్రీవెన్స్ మాడ్యులు నేడు విడుదల

**విజయవాడ,జూలై3,ప్రభాతవార్తప్రతినిధి:** అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కు సంబంధించి ల్యాండ్ మాడ్యూల్స్ లో గ్రామ స్థాయిలో ఎదురయ్యే వివిధ రెవెన్యూ అంశాలపై క్షేత్ర స్థాయిలోనీ వ్యవసాయ అధికారులు సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ సంచాలకులు డిల్లీ రావు తెలియచేశారు .క్షేత్ర స్థాయిలో గ్రామం మొత్తంగా పరిష్కారం కానీ రెవెన్యూ రికార్డులు 1బి లో లేని గ్రామాలు,మునిసిపాలిటీ లలో కలవటం వల్ల వెబ్లాండ్ లో లేని గ్రామాలు , భూముల రీసర్వే వల్ల పరిష్కారం కానీ గ్రామాలు , ఎస్టేట్ మరియు ఇనామ్ భూముల రద్దు చట్టం పరిధిలోని గ్రామాలు సొసైటీ భూముల నోషనల్ ఖాతాలు తదితర అంశాలపై వెబ్లాండ్ లో ఏర్పడుతున్న కొన్ని ప్రతిబంధకాలను ప్రస్తావిస్తూ లేని గ్రామాలు భూముల రీసర్వే వల్ల పరిష్కారం కానీ గ్రామాలు , ఎస్టేట్ ఇనామ్ భూముల రద్దు చట్టం పరిధిలోని గ్రామాలు సొసైటీ భూముల నోషనల్ ఖాతాలు అంశాలపై వెబ్లాండ్ లో ఏర్పడుతున్న కొన్ని ప్రతిబంధకాలను ప్రస్తావిస్తూ ఖాతాదారు బ్రతికే ఉన్నా, ఆధార్ తప్పుగా వెబ్‌ల్యాండ్ 1.0 మరియు 2.0లో నమోదయిన నేపథ్యం లో .క్రియాశీలకంగా లేని ఖాతాదారులు (సరైన లేదా తప్పుగా ఆధార్ పొందుపరిచినవారు) ల అంశమును పరిశీలిస్తే మరణించిన ఖాతా దారులు ఇంకా వెబ్‌ల్యాండ్‌లో ప్రత్యక్షమవు తుండటం. వీరిలో కొందరి ఆధార్ ఖాతాదారు స్వంతంగా ఉండటం మరియు ఇతరుల ఆధార్ ఉండటం వల్ల సమస్య ఎదు రవడం వల్ల మ్యుటేషన్ లలో వారసత్వ మార్పు లు చేసు కునేం దుకు



ఆటంకం ఏర్పడటం వల్ల ప్రభుత్వం నుండి ప్రయోజనాల లబ్ధిలో సమస్యలు ఏర్పడుతున్నాయి ఇటువంటి వాటికి పరిష్కారం గా ఫీల్డ్‌లో మరణ ధృవీకరణ జత చేసి, వెబ్‌ల్యాండ్‌లో మ్యుటేషన్ ద్వారా ఖాతా మార్చాలి. పట్టా భూమిని ఎవరి ఖాతాకి కేటాయించకుండా మిగులు భూమిగా చూపడం 1 లక్ష సిరీస్‌లో ఖాతాలు ఉండి ఆధార్ ను పొందుపరచకపోవడంఆధార్ లింక్ లేకపోవడం వల్ల, లబ్దిదారుల గుర్తింపు సాధ్యం కాకపోవడం జరుగుతుంది .ఆటో మ్యూటేషన్ గ్రామాలలో 5000+ సిరీస్ ఖాతాలుఫీల్డ్ సిబ్బంది నోషనల్‌గా భావించే అవకాశం ఉండటం ఆటోమేటెడ్‌గా వచ్చిన సిరీస్ ఖాతాలను కొన్ని సందర్భాల్లో ఫీల్డ్ సిబ్బంది తప్పుడు అర్థంతో నోషనల్‌గా పరిగణిస్తున్నందు దీన) సాంకేతిక లోపం వల్ల వాస్తవంగా భూమి ఉన్న ఎటువంటి భూమి లేని ఖాతాలు గా నమోదు అవ్వటం డేటా లోపాల వల్ల విస్తీర్ణమును చూపించకపోవడం విచారకరం.

# దుర్గమ్మకు వెండి పట్టీల కానుక

**ఇంద్రకీలాద్రి, జూలై 3, ప్రభాతవార్త** దుర్గమ్మ వారికి పలువురు భక్తబృందాల వారు గురువారం ఆషాడం సారెను సమరి ్పంచారు. మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ పలు ప్రాంతాలకు చెందిన బృందాలు తమ ఇంటి ఆడపడుచుగా భావించి దుర్గమ్మవారికి సారె సమర్పించారు. ఆషాడం సారె సమర్పించిన భక్తుల బృందాలకు దుర్గమ్మవారి దర్శనంఏర్పాటు చేసిన అధికారులు అన్నప్రసాదాలు అందించారు. శుక్రవారం నాడు గురుపూర్ణిమ సందర్భంగా పెద్ద ఎత్తున దుర్గమ్మవారి దర్శనానికి భక్తులు వచ్చే అవకాశమున్నందున అంతరాలయ, విఐపి దర్శనాల రద్దు యోచన చేస్తున్నట్లు ఇఒ తెలిపారు. శాకంబరి ఉత్సవాల ముగింపు ఈనెల 10 న జరిగే వరకు ఈ రద్దీ వుంటుందని భావిస్తున్నా మన్నారు. శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిర్వహిస్తున్న పోరంకిలోని వేదపాఠశాలను ఇఒ వికె శీనా నాయక్ గురువారం పరిశీలించారు. గతనెలలో తాను చేసిన పరిశీలన సందర్భంగా చెప్పిన పనుల స్థితి గురించి విచారించారు. మరుగుదొడ్ల రిపేర్, ఆర్వోప్లాంట్, కిటీకీల రిపేర్లు పూర్తయ్యాయని ఉపాధ్యాయులు ఇఒకు తెలిపారు. విద్యార్థులకు ఆటమైదానంలో కలుపు మొక్కలు తొలగింపు, బిల్డింగ్ స్లాబ్ రిపేర్లు త్వరగా పూర్తి చేయాలని ఇఒ ఆదేశించారు. కార్యక్రమంలో వేదపాఠశాల ప్రధానోపాధ్యాయుడు, వేదపండితులు, ఆలయ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి మాజీ మంత్రి సిద్దా రాఘవరావు గురువారం రు1లక్ష 1వెయ్యి లను విరాళంగా ఈఓకు అందించారు. శిద్దారాఘవరావు దంపతులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం వారికి శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించారు.



వెండి పట్టీలు కానుక అందిస్తున్న దాతలు

# జోలెపట్టిన రఘువీరారెడ్డి..

## ఆధ్యాత్మికతలో మునిగి తేలుతున్న మాజీ మంత్రి

**అనంతపురం, జులై 3, (ప్రభాతవార్త బ్యూరో)** శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం నీలకంఠాపురం లో షిరిడి సాయి మందిరంలో ఈనెల 10వ తేదీన గురు పౌర్ణమి సందర్భంగా అన్నదానం చేసేందుకు వీలుగా సిడబ్ల్యుసి సభ్యుడు, మాజీమంత్రి నీలకంఠాపురం రఘు వీరారెడ్డి గురువారం బిచ్చటన చేశారు. శ్రీ నీలకంఠాపురం గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ చైర్మన్ హోదాలో రఘువీరారెడ్డి ఇతర భక్తులతో కలిసి జోల బట్టి నీలకంఠాపురం, గోవిందపల్లి,ముద్దులపల్లి, సంకె పాలెం గ్రామాల్లో బిచ్చడం చేసి డబ్బులు, బియ్యము తదితర వాటిని భక్తులతో స్వీకరించడం విశేషం.. ఈ కార్యక్రమంలో ఎస్కేయూ ప్రొఫెసర్ సదాశివరెడ్డి , తదితర గ్రామస్తులు కూడా పాల్గొన్నారు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి, నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, కొణిజేటి రోశయ్య మంత్రివర్గాల్లో కీలక మంత్రిగా , పిసిసి అధ్యక్షుడు , తదితర పదవులలో రాణించి ప్రస్తుతం సిడబ్ల్యుసి సభ్యునిగా కొనసాగుతున్నారు.



భిక్షాటన చేస్తున్న సిడబ్ల్యుసి సభ్యుడు నీలకంఠాపురం రఘువీరారెడ్డి దృశ్యాలు

# 5వ తేదీన బి.టి.పి పనులు తిరిగి ప్రారంభిస్తాం

## కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు

**అనంతపురం, జులై 3, (ప్రభాతవార్త బ్యూరో)** కళ్యాణ్ దుర్గం ప్రాంతానికి జీవనాడి అయిన బీటీపీ ప్రాజెక్టు పనులుఈ నెల 5న తిరిగి పునఃప్రారంభం చేస్తున్నామని, ఇక శ్రీరామిరెడ్డి నీళ్లు ఒకటి రెండు రోజుల్లో అన్ని గ్రామాలకు అందుతాయి కళ్యాణ్ దుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు వెల్లడించారు.. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి కళ్యాణ్ దుర్గం నియోజకవర్గము సెట్టూరు మండలంలో గురువారం ఎమ్మెల్యే సురేంద్రబాబు కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం కింద ఎంపీ ,ఎమ్మెల్యే తదితర టిడిపి నేతలు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఉషాశ్రీ చరణ్ ఇక్కడ ఉన్న వనరులను పూర్తిగా దోచేసి, ఇక్కడి నుంచి పలాయనం చిత్తగించింది అని ఆరోపించారు. ఆమెకు భయపడి ఎంపీగా ఉన్న తలారి రంగయ్య కళ్యాణదుర్గం ప్రాంతంలో తిరగడానికి కూడా రాలేదు అని, నేడు ఆర్డీటీ పేరు చెప్పి పాదయాత్ర చేశారు అంటే కేవలం ఆయన ఉనికి కోసం మాత్రమే అన్నారు.

ఆర్డీటీ కి ఎఫ్ సి ఆర్ ఏ అనుమతులు ఇప్పించే విషయంలో రాష్ట్ర యువనాయకులు మంత్రి నారా లోకేష్ , కేంద్రమంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారని, కేవలం ఒక్క ఆర్డీటీకే ఇలాంటి చారిటి ట్రస్టులు అన్నింటికీ ఇబ్బందిగా ఉంది.. ఇంకా కొందరు ఎదో క్యూ ఆర్ కోడ్ అంటూ గ్రామాల్లోకి వస్తున్నారని, వారికి అక్రమాలు చేయడం స్కాములు చేయడమే తెలుసని మరి క్యూ ఆర్ కోడ్ అని మీ అకౌంట్లలో డబ్బులు కొట్టేస్తారు జాగ్రత్తగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

04-07Pg7exHMNWJQE.qxd:04-07Pg7exHMNWJQE.qxd 01/01/01 8:48 AM Page 1



# ఉన్నత విద్య బలోపేతానికి సమగ్ర నివేదిక

## త్వరలోనే ప్రభుత్వానికి సమర్పిస్తాం

### రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్నత విద్య బలోపేతానికి సమగ్ర నివేదికను సిద్ధం చేయనున్నట్టు తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ తెలిపారు. ఉన్నత విద్య బలోపేతానికి తగు సూచనలతో సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్, సభ్యులు గురువారం మొదటిసారిగా పాలమూరు యూనివర్సిటీని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ పూస రమేష్ బాబు, తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వరరావు, చారకొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డితోపాటు వివిధ విభాగాలధిపతులు బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆకునూరి మురళీ మాట్లాడుతూ విద్యావ్యవస్థలోని సమస్యలను విద్యార్థుల నుంచి వివిధ సంఘాల నాయకుల నుంచి ప్రజాభిప్రాయాలను సేకరించి ఒక సమగ్ర నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. కేజీ టు పీజీ విద్యలో గల సమూల మార్పులకై అధ్యయనం చేస్తున్నామని, యూనివర్సిటీ స్థాయిలో గల వివిధ సమస్యల పైన ప్రత్యక్షంగా విద్యార్థుల నుంచి, మేధావుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నామని, విద్యా రంగంలో వెనుకబడిన గట్టు మండలంని ఆధారంగా చేసుకుని పాలమూరు యూనివర్సిటీని సందర్శించినట్టు చెప్పారు. త్వరలో మరిన్ని యూనివర్సిటీలను సందర్శించి నివేదిక తయారు చేస్తామన్నారు. యూనివర్సిటీ ఉపకులపతి(విసి) ప్రొఫెసర్ జిఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ సిలబస్ రూపకల్పన మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉందా? లేదా? అని.. చాలామంది విద్యార్థులు మంచి పర్సంటేజ్‌తో పాస్ అయినప్పటికీ జీవితంలో స్థిరపడడం లేదని, సమాజ అవసరాల కొరకు సిలబస్ రూపకల్పన జరగాలని, విద్యా కమిషన్ సభ్యులు యూనివర్సిటీలో సమస్యలను చర్చించి ఒక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేయడంలో సహకరించాలని సూచించారు. యూనివర్సిటీ అధ్యాపకులు అధ్యాపకేతరులు, విద్యార్థులు వివిధ సంఘాల నాయకుల నుంచి అభిప్రాయాలు సేకరించారు.

# స్మార్ట్ మీటర్లు ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాల్సిందే :సిపిఎం

**అనంతపురం, జులై 3 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం నగరంలోని శ్రీనగర్‌లో క్యూ ఆర్ కోడ్ ద్వారా ముఖ్యమంత్రికి ప్రజలు ఫిర్యాదు చేశారు. ప్రజలపై విద్యుత్ భారాలు మోపేలా ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన స్మార్ట్ మీటర్లను అమర్చరాదని, ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు.



ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తున్న సిపిఎం నేతలు

గురువారం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శ్రీ నగర్‌లో విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వం దృష్టికి ఈ ప్రజా సమస్యలను తీసుకెళ్లేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదులు చేసేలా క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఇంటింటికి పంపిణీ చేసి ప్రజలు ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించారు. సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సెకి ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు భారాలపై ప్రభుత్వానికి అర్జీ పెట్టాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి రాకముందు లోకేష్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి విద్యుత్ ఛార్జీలు పెంచమని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తుంగలో తొక్కి స్మార్ట్ మీటర్లు బిగింపు వేగంగా రాష్ట్రంలో అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ స్మార్ట్ మీటర్లను కమర్షియల్ కనెక్షన్లకు బిగిస్తున్నారని తెలిపారు. అపార్ట్మెంట్‌లకు బిగించడానికి సిద్ధం చేస్తున్నారని రాబోవు కాలంలో ఇంటి వినియోగదారులకి రైతులకు మోటార్లకు కూడా స్మార్ట్ మీటర్లు బిగిస్తారని తెలిపారు. దీని వల్ల విద్యుత్ భారం పెరుగుతుందన్నారు. సెకిఒప్పందాలను రద్దు చేయాలని స్మార్ట్ మోటార్లను బిగింపు ఆపాలని, ట్రూ ఆఫ్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ ఒప్పందాలను రద్దు చేయాలని విద్యుత్ వినియోగదారులకి పిలుపునిచ్చారు. సెల్ ఫోన్‌లో క్యు ఆర్ కోడ్‌ను క్లిక్ చేసి ప్రభుత్వానికి మీ వ్యతిరేకతను తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు వలి, ప్రకాష్, జీవ, కుమార్, రాఘవ, హరికృష్ణ, పాల్, మాబు తదితరులు పాల్గొన్నారు.

# పసుపు రైతుల కోసం జాతీయ సహకార ఎగుమతి సంస్థ

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** పసుపు రైతుల కోసం జాతీయ సహకార ఎగుమతి లిమిటెడ్ (ఎన్‌సీఈఎల్), జాతీయ సహకార ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఎన్‌సీవోఎల్)ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఈ విషయాన్ని గురువారం ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ సంస్థలను తెలంగాణలోని నిజామాబాద్‌లో స్థాపించాలని కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ సహకార సంస్థలు పసుపు దిగుమతులను పెంపొందించడంలో పూర్తి సహాయ సహకారాలను అందిస్తాయన్నారు. అలాగే సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలోను, రైతులకు న్యాయమైన లాభాలను అందించడంలో ఆయా సంస్థలు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

# డిమాండ్లను అమలు చేయకపోతే ఆగస్టు 13న ‘దివ్యాంగుల మహాగర్జన’ నగర దిగ్బంధనం

**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న అంశాలను వెంటనే అమలు చేయాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు, విహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆగస్టు 13న ‘దివ్యాంగుల మహాగర్జన’ పేరిట హైదరాబాద్ నగరాన్ని దిగ్బంధం చేస్తామని ఆయన హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన దివ్యాంగుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు దాటిందని, అన్ని అవయవాలు ఉండి ఏదో ఒకపని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న వర్గాలకు హామీలు అమలు చేస్తూ అవయవ లోపాలతో ఎలాంటి పనులు చేసుకోలేక నిరాశ, నిస ృహలతో ఉన్న దివ్యాంగుల హామీ లను అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. సమావేశంలో వివిధ దివ్యాంగ సంఘాల నాయకులు ఎల్.గోపాల్‌రావు, అందె రాంబాబు, సుజాత, సామినేని భవాని చౌదరి, కొల్లి నాగేశ్వర్‌రావు, ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# 18న ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు అనుమతి ఇవ్వండి

### పోలీసు ఉన్నతాధికారులకు మాజీ సర్పంచ్ జెఏసి విజ్ఞప్తి

**హైదరాబాద్ జూలై, 3, ప్రభాతవార్త:** మాజీ సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18న ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నాకు అనుమతి ఇవ్వాలని మాజీ సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయన తెలంగాణ సెంటర్ జోన్ డీజీపీ, చిక్కడపల్లి దోమలగూడ సిఐని కలిసి వినతిపత్రం అందజేశారు. 2019 నుంచి 24 వరకు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల గురించి ప్రభుత్వానికి ఎన్నిసార్లు వినిపించిన తమ సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. డబ్బులు వడ్డీలకు తెచ్చి అభివృద్ధి పనులు చేసి బిల్లులు రానందువల్ల కొంతమంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించాలని హైదరాబాద్ ఇందిరాపార్క్ దగ్గర ధర్నాచౌక్ మాజీ సర్పంచులు ధర్నా చేసేందుకు అవకాశం ఇవ్వాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

# అంగన్‌వాడీ హెల్పర్ల పదోన్నతుల వయోపరిమితి పెంపు

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** అంగన్వాడీ హెల్పర్లు టీచర్లుగా పదోన్నతి పొందేందుకు వయోపరిమితిని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం వాటికి సంబంధించిన ఫైలుకు అమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం పదోన్నతికి గాను గరిష్ఠ వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4,322 మంది అంగన్వాడీ హెల్పర్లకు టీచర్లుగా పదోన్నతి పొందే అవకాశం ఏర్పడనుంది. గతంలో 45 ఏళ్లు దాటిన తర్వాత ప్రమోషన్ కోసం అవకాశాలు లేకపోయినా, ఇప్పుడు వారికీ మళ్ళీ అవకాశం లభించనుంది. గరిష్ఠ వయోపరిమితిని పెంచాలని అంగన్వాడీ హెల్పర్ యూనియన్ల నుంచి ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు వచ్చాయి. అర్హతలు ఉన్న 50 ఏళ్ల లోపు హెల్పర్లకు టీచర్ పదోన్నతి ఇవ్వడంలో ఎలాంటి అడ్డంకులు లేవని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ అధికారులు నివేదిక సమర్పించారు. 50 ఏళ్ల వయస్సులో టీచర్ గా పదోన్నతి పొందే హెల్పర్లు మరో 15 ఏళ్లు విధులు నిర్వర్తించవచ్చని అందులో సూచించారు. 45 యేళ్లు దాటిన అర్హులైన హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వడంలో ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు స్పష్టం చేయడంతో ప్రభుత్వం దానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

# బిల్లులు చెల్లించాకే ‘స్థానిక’ ఎన్నికలు నిర్వహించాలి

### మంత్రి సీతక్కకు సుర్వి యాదయ్యగౌడ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ మాజీ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ పంచాయతీరాజ్ మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు ఆయన బుధవారం సచివాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సీతక్కకు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించామని అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.మంత్రిని కలిసి వినతి పత్రం అందచేసిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షు గుంటి మధుసూదన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కార్యదర్శి మల్లయ్య, అరవింద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# తల్లి సాయంతో తండ్రి హత్య

### ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన నాగోల్ పోలీసులు

**హైదరాబాద్ (ఎల్‌బినగర్), జూలై 3, ప్రభాతవార్త:** తల్లి సాయంతో తండ్రిని ఓ మైనర్ బాలుడు హత్య చేశాడు. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హత్యకు పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అశోక్‌మహతో అనే వ్యక్తి పదేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి కాచిగూడలో జ్యూస్ పాయింట్ పెట్టుకొని నివసిస్తుండగా, మూడు సంవత్సరాల క్రితం తన కుటుంబసభ్యులు కూడా కాచిగూడకు వచ్చి అశోక్‌మహతో జ్యూస్ పాయింట్ ఎదురుగానే మరో జ్యూస్ పాయింట్ పెట్టుకొని జీవనం కొనసాగిస్తూ కాచిగూడలోని వీరన్నగుట్టలో నివాసం ఉంటున్నారు. అయితే అశోక్‌మహతో సంపాదించిన డబ్బులను తన కుటుంబసభ్యులకు ఇవ్వకుండా, తన తమ్ముళ్లకు ఇవ్వడంతో తన కుమారుడికి, భార్యకు తనకు మధ్య గొడవ జరగగా అశోక్‌మహతో గత అయిదు రోజుల క్రితం తనకు తెలిసిన వ్యక్తిని పంపించి తన పెద్ద కుమారుడిని కొట్టించాడు. అది మనసులో పెట్టుకొని అశోక్ మహతో పెద్ద కుమారుడు అయిన రాజేందర్ కుమార్‌యాదవ్ (20), భార్య క్రాంతిదేవి (40) కలిసి అశోక్ మహతొను ఒక పథకం ప్రకారం మైనర్ బాలుడి సహాయంతో చంపాలని నిర్ణయించుకున్నారు. అశోక్‌మహతొను జూన్ 30వ తేదీ రాత్రి 1:00 గంటల సమయంలో తన కొత్తపేటలోని పెద్ద కుమారుడి టీ కౌంటర్‌ను చూసివద్దామని చెప్పి మైనర్‌ను వెంటపెట్టుకొని తన స్కూటీ పైన కొత్తపేట్ నుండి నాగోల్ నుంచి ఒఆర్‌ఆర్ మార్గంలో పసుమాముల గ్రామం వద్ద నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి పథకం ప్రకారం వారి వెంట తీసుకువచ్చిన ఐస్‌ను కొట్టే బ్యాటు సహాయంతో బాలుడు, రాజేందర్‌కుమార్‌యాదవ్ కలిసి అశోక్‌మహతొను తలపైన తీవ్రంగా కొట్టారు. దీంతో అశోక్‌మహతొ తలకు బలమైన గాయాలు కాగా అతను అక్కడికక్కడే చనిపోయాడు. నిందితులు తమ ఫోన్‌లను స్విచ్‌ఆఫ్ చేసుకొని పారిపోయారు. సమాచారం తెలుసుకున్న నాగోల్ పోలీసులు విచారణ చేపట్టి ఈ నెల 2న నిందితులను పట్టుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినారు. హత్య కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన నాగోల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. సూర్యనాయక్, సబ్-ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.శివనాగప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ శంషుద్దీన్, కానిస్టేబుల్ సుభాష్, సాయిష్‌లను డిసిపి ప్రవీణ్ కుమార్ అభినందించారు.

# ఎప్‌సెట్-2025 కౌన్సెలింగ్‌కు 88,802 మంది దరఖాస్తు

### 6 నుంచి వెబ్‌ఆప్షన్లు.. 40,561 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు..13న మాక్ సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు 88,802 మంది కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. జూన్ 28 నుంచే కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా.. ఈ నెల 1 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభమైంది. ఇప్పటి వరకు 40,561 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజర య్యారు. ఈ నెల 7 వరకు విద్యార్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకొని స్లాట్‌బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. అలాగే ఈ నెల 8 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగనుంది.

ఈ నెల 6 నుంచి 10 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. మొదటిసారిగా మాక్ సీట్ అలాట్‌మెంట్‌ను ప్రవేశపెట్టగా..ఈ నెల 13న మాక్ సీట్ అలాట్‌మెంట్ చేయనున్నారు. అందులో మార్పులు చేసుకోవడానికి ఈ నెల 14, 15 తేదిల్లో అవకాశం కల్పించారు. అనంతరం ఈ నెల 18లోపు మొదటి విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు.

మొదటి విడతలో సీటు పొందిన విద్యార్థులు ఈనెల 18 నుంచి 22 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో ఈనెల 25న వివరాలను అప్‌లోడ్ చేసుకోవాలి. 26న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుంది. 26, 27 తేదిల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. 30లోపు రెండోవిడత సీట్ల కేటాయింపు చేస్తారు. ఈ నెల 30 నుంచి ఆగస్టు 1 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలి.

# బిసి రిజర్వేషన్ల తర్వాతే ‘స్థానిక’ ఎన్నికలు నిర్వహించాలి

### ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ రాస్తున్నా: ఎమ్మెల్సీ కవిత


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 3:** బీసీ రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకూడదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితఎెౌ అన్నారు. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తానన్న సీఎం ఇంకా తీసుకెళ్లలేదని విమర్శించారు. జూలై 8 లోపు రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లోని బీసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. బీసీ బిల్లు విషయంపై బీజేపీపై ఒత్తిడి తీసుకురావాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకి లేఖ రాస్తున్నామని చెప్పారు. ఈ నెల 17న బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు కోసం జాగృతి ఆధ్వర్యంలో చేపట్టనున్న రైల్ రోను విజయవంతం చేయాలన్నారు. రైల్ రోకోకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైల్ రోకో కార్యక్రమానికి వివిధ పార్టీల మద్దతు కూడగట్టామన్నారు.

బీసీ బిల్లుపై బీజేపీ చొరవ తీసుకోవాలని, ఈ విషయమై ఆ పార్టీ నూతన అధ్యక్షుడు రామచందర్ రావుకు లేఖ రాశామని చెప్పారు. ఆయన చొరవ తీసుకొని బీజేపీ అధ్యక్ష హోదాలో తొలి విజయం నమోదు చేసుకోవాలని సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ వస్తున్నారని విమర్శించారు. బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ బీసీల కోసం పార్లమెంట్‌లో ఎన్నడూ మాట్లాడలేదని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా బీజేపీపై ఖర్గే ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ పాత లెక్కలే చెబుతున్నారని విమర్శించారు. గ్రామ పంచాయతీల వారీగా కులగణన వివరాలు బయట పెట్టాలన్నారు. జూలై 17న రైల్ రోకో నిర్వహించి తెలంగాణ నుంచి ఢిల్లీ వెళ్లే ప్రతి రైలును ఆపుతామన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు సాధించేందుకు బీజేపీపై ఒత్తిడి తెస్తామని వెల్లడించారు. గోదావరిబనకచర్ల ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ పార్టీ మెతక వైఖరి కనబరుస్తున్నదని విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబును ఒక్క మాట కూడా అనలేదని ధ్వజమెత్తారు. కొందరి కాంట్రాక్టుల కోసమే బనకచర్ల ప్రాజెక్టు అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారని చెప్పారు. రాష్ట్రంలో చంద్రబాబు కోవర్టులు ఉన్నారని చెప్పారని, ఇప్పటికైనా రేవంత్ రెడ్డి బనకచర్లను ఆపాలని గట్టిగా కొట్లాడాలని చెప్పారు.



# కంటిన్యుయేషన్ ఆర్డర్లను తక్షణమే జారీ చేయాలి



ధర్నాలో నినాదాలు చేస్తున్న ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు

### ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూలై 3, ప్రభాతవార్త:** నాలుగు నెలల నుండి పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కంటిన్యుయేషన్ ఆర్డర్లను తక్షణమే జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కంటిన్యుయేషన్ సాధనకై ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వెంకటేష్, ఉపాధ్యక్షురాలు పద్మశ్రీ, రాష్ట్ర కార్యదర్శి జే.కుమారస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.కృష్ణారెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశపడ్డారని, కానీ 20 నెలలు గడుస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంస్థలు, శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో కంటిన్యుయేషన్ ఆర్డర్లు జారీ చేయాలి, కానీ అనేక సంస్థలలో, శాఖలలో ఇప్పటి వరకు కొనసాగింపు ఉత్తర్వులు రాకపోవటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ నేతలు వై.సోమన్న, టి.సాంబయ్యలతోపాటు వివిధ యూనియన్ నాయకులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# గంట్యాడ, రాజాం మండల సమాఖ్యలకు జాతీయస్థాయిలో ఆత్మనిర్భర్ సంఘటన్ అవార్డ్స్



**విజయనగరం, జూలై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ స్థాయిలో ‘ఆత్మనిర్భర్ సంఘటన్ అవార్డ్స్ 2024’కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లాలో రెండు మండల మహిళా సమాఖ్యలు ఎంపిక కావడం రాష్ట్రానికి గర్వకారణమని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విజయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మహిళలు, పేదల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తోందని ఆయన చెప్పారు. గ్రామీణాభివృద్ధి శాఖ, భారత ప్రభుత్వం అమలు చేస్తున్న దీన్ దయాళ్ అంత్యోదయ యోజన - జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా ఈ అవార్డులు ప్రకటించబడ్డాయని, స్వయం సహాయక సంఘాలు, గ్రామ సమాఖ్యలు మరియు క్లస్టర్ స్థాయి సమాఖ్యలు గ్రామీణ మహిళల జీవనోపాధిని మెరుగుపరిచిన విధానాన్ని గుర్తించి ఉత్తమ సమాఖ్యలను ప్రోత్సహించటమే ఈ అవార్డుల ముఖ్య ఉద్దేశ్యం. దేశవ్యాప్తంగా నాలుగు ప్రాంతాల నుండి మొత్తం 22 సిఎల్‌ఎఫ్‌లు (మండల మహిళా సమాఖ్యలు/క్లస్టర్ మహిళా సమాఖ్యలు) ఎంపిక చేయబడగా, ఐదు సంవత్సరాల పైబడిన కేటగిరీలో విజయనగరం జిల్లా గంట్యాడ మండల మహిళా సమాఖ్య ప్రథమ బహుమతిని, శ్రీకాకుళం జిల్లా రాజాం మండల మహిళా సమాఖ్యతృతీయ బహుమతిని అందుకోనుండటం విశేషం. ఈ అవార్డుల ప్రధానోత్సవం 10 జూలై 2025న న్యూఢిల్లీలో నిర్వహించబడుతుంది. ఎంపికైన సమాఖ్యల కార్యవర్గ సభ్యులకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రివర్యులు స్వయంగా అవార్డులు ప్రదానం చేయనున్నారు.

ఈ గౌరవం సాధించడంలో కీలక పాత్ర పోషించిన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు. వారి నిరంతర సహకారం మరియు మార్గదర్శకతతో సమాఖ్యలు మరింత సమర్థవంతంగా పనిచేసినందుకు శుభాకాంక్షలు. ఈ విజయం ద్వారా దక్షిణాది రాష్ట్రాల నుండి ఐదు సంవత్సరాల పైబడిన కేటగిరీలో రెండు సిఎల్‌ఎఫ్‌లు (మండల మహిళా సమాఖ్యలు/క్లస్టర్ మహిళా సమాఖ్యలు) ఎంపిక కావటం మన రాష్ట్రానికి అరుదైన గౌరవంగా నిలుస్తుంది.

# ఐటి కారిడార్‌లో బోనాల జాతర

### శిల్పకళావేదిక నుంచి దేవస్థానానికి శోభాయాత్ర

**హైదరాబాద్ జూలై, 3, ప్రభాతవార్త:** తెలంగాణ సాంప్రదాయాలకు ఆధునికతను మేళవిస్తూ, తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు టీహబ్ వేదికగా తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) బోనాలు 2025 పోస్టరు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీటా గ్లోబల్ అధ్యక్షుడు సందీప్‌కుమార్ మక్తాలా, బోనాల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ యేడాది ఐటీ బోనాలు వేడుకలు, తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ భాగస్వామ్యంలో నిర్వహించనున్నారు. ఈ సంద ర్భంగా సందీప్ మక్తాలా, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి. హరి కృష్ణకు సంస్కృతి పరిరక్షణలో అందిస్తున్న అప్రతిహత మద్దతుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆషాఢ మాసం రెండో ఆదివారం, జూలై 6న జరగనున్న ఈ ఐటీ బోనాలు సంప్రదాయం నిలిపే ఈ వేడుకలు ఎంతో గొప్పవని, టీటా ద్వారా ఈ సంస్కృతి ఆధారిత కదలిక ఐటీ కారిడార్లో నిలబెట్టడం అభినందనీయమని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశంసించారు. ఈ సంవత్సరం వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా, శిల్పకళావేదిక నుంచి చిన్న పెద్దమ్మ దేవస్థానానికి భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. ఊరేగింపు ప్రారంభానికి ముందు సందీప్ ముక్తాలా కుటుంబం, అమ్మవారికి చీరెసారెలతో, ఒడి బియ్యాన్ని సమర్పించి ప్రత్యేక సంప్రదాయ పూజ నిర్వహిస్తారు. భక్తితోపాటు సంగీతం, సంప్రదాయం, ఐక్యత నిండిన ఈ ప్రదర్శన ఉద్యోగులకు ఓ సాంస్కృతిక పండుగను రుచి చూపించనుంది. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి వాకిటీ, శ్రీనివాస్ మారి, హరిని గోలీ, యామిని, మనసా, దినేష్, కీర్తన్, ప్రణీత్, వెంకట్ బూర వంటి బోనాల కమిటీ సభులు పాల్గొన్నారు.

# త్వరలో జిపిఒలకు నియామక పత్రాలు

### రెవెన్యూ జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి

**హైదరాబాద్ జూలై, 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అతి త్వరలోనే గ్రామ పరిపాలన అధికారులు (జీపీఓ)కు నియామక పత్రాలను అందజేసి విధుల్లోకి తీసుకోనున్నారని రెవెన్యూ జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి అన్నారు. ఇప్పటికే జీపీఓ నియామకం కోసం పరీక్ష రాసి అర్హత సాధించిన 3,454 మందికి మొదటి విడతలో ఈ అవకాశం దక్కుతుందన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ, సిసిఎల్‌ఏలోకేష్ కుమార్ గురువారం రెవెన్యూ ఉద్యోగ సంఘాలు డిప్యూటీ కలెక్టర్ల సంఘం, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఎల్‌ఏ లోకేష్ కుమార్ దృష్టికి పలు విషయాలను లచ్చిరెడ్డి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ఉన్న 10,954 గ్రామాలలో అదే సంఖ్యలో జీపీఓల నియామకం చేయాలన్నారు. కానీ ప్రస్తుతం 3,454 మంది మాత్రమే ఎంపిక అయ్యారని గుర్తు చేశారు. ఇదే కాకుండా ఆసక్తి కలిగిన పూర్వ వీఆర్‌ఏ, వీఆర్వోలకు మరో సారి జీపీఓ అర్హత పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించాలని కోరారు.61 ఏళ్లు దాటిన వీఆర్‌ఎల వారసులకు సైతం జీపీఓలుగా అవకాశం కల్పించాలని కోరారు. ఇంకా మిగిలిన పోస్టులకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేసేలా చూడాలన్నారు. అలాగే వీఆర్‌వోలను ఇతర డిపార్ట్‌మెంట్‌లలో సర్దుబాటు చేసే సమయం కంటే మృతి చెందిన వారి కుటుంబాలలో కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. సర్దుబాటు సమయంలో ఇతర జిల్లాలకు పంపిన పూర్వ వీఆర్‌ఎలను సొంత జిల్లాలకు బదిలీ చేయాల న్నారు. అన్ని అంశాలపై సీసీఎల్ఏ లోకేష్ కుమార్ సానుకూలంగా స్పందించారు.ఎంపికైన జీపీఓల, ఇతర విషయాలను రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో చర్చించి అతి త్వరలోనే ఈ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.పని ఒత్తిడిని బట్టి కార్యాలయాలలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లతో కూడా భూభారతి సదస్సుల దరఖాస్తులు ఎంక్వైరీ చేయించడానికి జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు ఇస్తామన్నారు.




# టెస్ట్ క్రికెట్‌లో.. జెట్ స్పీడ్ హీరోలు

## డబుల్ సెంచరీలతో మెరిసిన బ్యాటర్స్

### త్రిబుల్ సెంచరీలతో సెహ్వాగ్

**న్యూఢిల్లీ:** టెస్ట్ క్రికెట్‌లో డబుల్ సెంచరీ కొట్టడం అనేది ఏ బ్యాట్స్‌మన్‌కైనా ఒక గొప్ప లక్షణం. అది కూడా అత్యంత వేగవంతంగా డబుల్ సెంచరీ చేయడం ప్లేయర్ల సత్తాపై ఆధారపడి ఉంటుంది. భారీ స్కోర్లు చేయడంలో, స్వేచ్ఛగా డబుల్ సెంచరీలు చేయడంలో నైపుణ్యం కలిగిన బ్యాటర్లు పలువురు ఉన్నారు. టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న వ్యక్తి న్యూజిలాండ్‌కు చెందిన నాథన్ ఆస్టల్. 2002లో 153 బంతుల్లో డబుల్ సెంచరీ చేశాడు. క్రైస్ట్‌చర్చ్ మైదానంలో వెలుగులోకి వచ్చిన అతని వీరోచిత ప్రదర్శనలు, ఆ పోటీలో ఆధిపత్యం చెలాయింప చేసింది. అలాగే ఇంగ్లీష్ శిబిరంలో బ్యాటింగ్‌లో దిట్ట అయిన బెన్ స్టోక్స్ మీడియం పేస్ బౌలర్‌గా కూడా పేరుగాంచాడు. టెస్ట్ మ్యాచ్లో ఇప్పటివరకు నమోదైన రెండవ వేగవంతమైన డబుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా గుర్తింపు పొందాడు. స్టోక్స్ తన డబుల్ సెంచరీని చేరుకోవడానికి తీసుకున్న 163 బంతుల్లోనే ఈ సెంచరీ వచ్చింది. బెన్ స్టోక్స్ 198 బంతుల్లో 258 పరుగులు చేసి ఆధిపత్యం చెలాయించాడు. అతను 30 ఫోర్లు బాదాడు, 11 సిక్సర్లు బాదాడు. టెస్ట్ క్రికెట్లో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీలు సాధించిన వారి జాబితాలో భారత్‌కు చెందిన వీరేంద్ర సెహ్వాగ్ ఒకరుగా ఉన్నాడు. సెహ్వాగ్ టెస్ట్ క్రికెట్‌లో ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా మూడు డబుల్ సెంచరీలు సాధించాడు. శ్రీలంకపై 168 బంతుల్లో డబుల్ సెంచరీ చేసిన అతను, ఆ తర్వాత లాహోర్లో పాకిస్థాన్‌పై 182 బంతుల్లో డబుల్ సెంచరీ చేశాడు. ఆ సందర్భంలో అతను మొత్తం 254 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. చివరకు కుడిచేతి వాటం బౌలర్ 2008లో దక్షిణాఫ్రికాపై 194 బంతుల్లో డబుల్ సెంచరీ చేశాడు. ఇక క్రికెట్ బంతిని నిజంగా స్మాష్ చేసే వ్యక్తి బ్రెండన్ మెకల్లమ్ ఒక లెజెండ్ అయ్యాడు. మెకల్లమ్ కేవలం 186 బంతుల్లోనే తన టెస్టు డబుల్ మైలు రాయిని చేరుకున్నాడు. అంతేకాకుండా ఈ మ్యాచ్‌లో 11 సిక్సర్లు సైతం కొట్టి అద్భుత ప్రదర్శన చేశాడు. కాగా యూనివర్స్ బాస్ క్రిస్టోఫర్ హెన్రీ గేల్ తన బ్యాటింగ్‌లో బిగ్ సిక్స్ కొట్టడం ద్వారా స్కోరును పరుగు పెట్టించాడు. ఈ ఎడమ చేతి వాటం బౌలర్స్ టెస్టు మ్యాచ్‌లో 98 సిక్సర్లు కొట్టాడు. తన కెరీర్‌లో పదో వంతు సిక్సర్లు కొట్టడానికి ఒకే ఇన్నింగ్స్ పట్టింది. ఆ సమయంలో శ్రీలంకపై క్రిస్ గేల్ 333 ట్రిపుల్ సెంచరీలు సాధించాడు. ఆ ఇన్నింగ్స్‌లో గిల్ కేవలం 221 బంతుల్లోనే తన ట్రిబుల్ సెంచరీ పూర్తి చేశాడు.

# టీమిండియా భారీ స్కోరు

## ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో 564 పరుగులతో పటిష్ట స్థితి

### 265 రన్స్‌తో గిల్ డబుల్, అర్ధ సెంచరీ

**న్యూఢిల్లీ:** బర్మింగ్‌హామ్ లో ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో భారత జట్టు భారీ స్కోరు సాధించింది. గురువారం రాత్రి 8.30 గంటలకు టీ సమయానికి భారత్ 7 వికెట్లు కోల్పోయి 564 పరుగులతో కొనసాగుతోంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అద్భుతమైన డబుల్ సెంచరీ, అర్ధ సెంచరీతో చెలరేగడంతో టీమిండియా పటిష్ఠ స్థితిలో నిలిచింది. యువ ఆటగాడు గిల్ కు కెరీర్ లో ఇదే తొలి డబుల్ సెంచరీ. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో రెండో రోజు ఆట లంచ్ అనంతర సెషన్ లో భారత్ తన తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 564 పరుగులు చేసింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ జట్టు బౌలింగ్ ఎంచుకోగా, భారత బ్యాటర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ముందుండి జట్టును నడిపించాడు. ఓపికగా




ఆడుతూ ఇంగ్లండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న గిల్, 380 బంతుల్లో 30 ఫోర్లు, 3 సిక్సర్లతో 265 పరుగులు చేసి అజేయంగా క్రీజులో ఉన్నాడు. అతనికి రవీంద్ర జడేజా (89), యశస్వి జైస్వాల్ (87), వాషింగ్టన్ సుందర్ (42) చక్కటి సహకారం అందించారు. ఆరంభంలో కేఎల్ రాహుల్ (2) వికెట్‌ను త్వరగానే కోల్పోయినా, ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడారు. జైస్వాల్, జడేజా ఔటైన తర్వాత, గిల్, వాషింగ్టన్ సుందర్ (42)తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపిస్తున్నాడు. కానీ ఇదే సమయంలో జో రూట్ చేతిలో ఔటయ్యాడు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ రెండు వికెట్లు పడగొట్టగా, బెన్ స్టోక్స్, షోయబ్ బషీర్, జోష్ టంగ్, బ్రైడన్ కార్స్, జో రూట్ తలో వికెట్ తీశారు. భారీ స్కోరు సాధించిన టీమిండియా ఈ మ్యాచ్‌పై పట్టు బిగించింది.



### వరల్డ్ మహిళా బాక్సింగ్ కప్ సెమీస్‌కు

# భారత్ బాక్సర్లు

**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ కప్-2025లో భారత్ బాక్సర్లు బలమైన ఆరంభాన్ని ప్రదర్శించారు. కజకిస్తాన్‌లోని అస్తానాలోని బీలైన్ అరీనాలో పూజా రాణి, సంజు, మీనాక్షి తమతమ విభాగాల సెమీఫైనల్‌కు చేరుకోవడంతో ప్రపంచ బాక్సింగ్ కప్ సర్క్యూట్‌లో భారత్ బాక్సర్లు అద్భుతమైన అరంగేట్రం చేసి ఆకట్టుకున్నారు. మహిళల 48 కిలోల క్వార్టర్ ఫైనల్‌తో తొలి రోజు ప్రారంభమైంది. ఇక్కడ మినాక్షి చైనీస్ తైపీకి చెందిన యిజువాన్ గువోపై 5-0 తేడాతో ఆధిపత్య విజయం సాధించి బలమైన ప్రదర్శన ఇచ్చింది, తద్వారా ఈ ఈవెంట్‌లో ఆమెకు పతకం ఖాయమైంది. అంతకు ముందు జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా బాక్సర్ మడేలిన్ బోవెన్‌పై విజయం సాధించిన మినాక్షి కిది ప్రాథమిక రౌండ్ తర్వాత టోర్నమెంట్‌లో ఇది రెండవ బౌట్. ఆమె తర్వాత, అనుభవజ్ఞురాలైన రెండుసార్లు ఆసియా ఛాంపియన్ పూజా రాణి కూడా మహిళల 80 కిలోల విభాగంలో కజకిస్తాన్‌కు చెందిన గుల్సయా యెర్జాన్‌పై స్ప్లిట్ డెసిషన్ 4-1 విజయంతో ఆమెకు పతకాన్ని నిర్ధారించింది. సాయంత్రం సెషన్‌లో, సంజు 60 కిలోల విభాగంలో అమెరికన్ బాక్సర్ జజైరా గొంజాలెజ్‌పై 5-0 తేడాతో విజయం సాధించి ఫైనల్ ఫోర్‌లో తన స్థానాన్ని బుక్ చేసుకుంది. ఇక పురుషుల విభాగంలో బ్రెజిల్ ప్రపంచ కప్ కాంస్య పతక విజేత లైట్ వెయిట్ బాక్సర్ జదుమణి సింగ్ (50 కిలోలు) 2-3 తేడాతో ఫిలిప్పీన్స్ బాక్సర్ జే బ్రయాన్ బారికువాట్రో చేతిలో క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించాడు. మరోవైపు, మనీష్ రాథోడ్ (పురుషులు 50 కిలోలు), సనమ్చా చ్నో (మహిళలు 70 కిలోలు) ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో పోటీ నుండి నిష్క్రమించగా, ముస్కాన్ (75 కిలోలు) తన క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో ఓడిపోయారు.

### వింబుల్డన్‌లో భారత్ లెజెండ్

# బోపన్న నిష్క్రమణ

## ముందంజలో శ్రీరామ్

**న్యూఢిల్లీ:** వింబుల్డన్‌లో రోహన్ బోపన్న అనూహ్యంగా ఓటమిపాలవ్వగా, శ్రీరామ్ బాలాజీ ముందంజలో ఉన్నాడు. వింబుల్డన్-2025 ప్రారంభ రౌండ్‌లో పురుషుల డబుల్స్ పోటీ నుండి భారత లెజెండరీ ఆటగాడు రోహన్ బోపన్న మరియు అతని భాగస్వామి సాండర్ గిల్లె నిష్క్రమించారు. అనుభవజ్ఞుడైన బోపన్న అలవోకగా గెలుస్తాడనుకుంటే తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. ఈ జోడీ ఒక గంటా నాలుగు నిమిషాల్లో మూడో సీడ్ జర్మన్ జంట కెవిన్ క్రావిట్జ్ మరియు టిమ్ పుయెట్జ్ చేతిలో 3-6, 4-6 తేడాతో పరాజయం పాలయ్యాడు. అయితే పురుషుల డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీ ముందంజ వేశాడు. గురువారం జరిగిన తొలి రౌండ్‌లో శ్రీరామ్ మిగెల్ రెయ్స్ (మెక్సికో) ద్వయం అమెరికా జంటను చిత్తు చేసింది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన పోరులో లెర్నర్ థియెన్, అలెగ్జాండర్ కొవసెవిక్ ద్వయంపై 64, 64తో జయకేతనం ఎగురవేసింది. దాంతో, ఈ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రెండో రౌండ్‌కు దూసుకెళ్లిన మూడో భారత ఆటగాడిగా నిలిచాడు శ్రీరామ్. లండన్ వేదికగా జరుగుతున్న వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో యుకీ బాంబ్రీ, రిత్విక్ బొల్లిపల్లి దూసుకెళ్లారు. ఇప్పుడు శ్రీరామ్ కూడా తొలి రౌండ్ దాటాడు. రెండో రౌండ్‌లో శ్రీరామ్ ద్వయం నాలుగో సీడ్‌తో తలపడనుంది. భారత డబుల్స్ స్టార్ యుకీ భాంబ్రీ మరియు అతని అమెరికన్ భాగస్వామి రాబర్ట్ గాల్లోవే, ఫ్రాన్స్‌కు చెందిన మాన్యుయెల్ గినార్డ్ మరియు మొనాకోకు చెందిన రొమైన్ ఆర్నియోడోలను వరుస సెట్లలో ఓడించి వింబుల్డన్ పురుషుల డబుల్స్ పోటీలో రెండవ రౌండ్‌కు చేరుకున్నారు. గంటా 49 నిమిషాల పాటు జరిగిన మొదటి రౌండ్ పోరులో, 16వ సీడ్ ఇండోఅమెరికన్ ద్వయం ఆర్నియోడో మరియు గినార్డ్‌ను 7-6(8), 6-4 తేడాతో ఓడించింది. గ్రాండ్‌స్లామ్‌కు సిద్ధమయ్యే క్రమంలో, మల్లోర్కా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత వారు తమ ప్రదర్శనను మరింత పెంచుకున్నారు.





### కెనడా ఓపెన్ ఉత్కంఠ పోరులో

# శ్రీకాంత్ విజయం

## మహిళల సింగిల్స్‌లో శ్రీయాన్షి గెలుపు

**న్యూఢిల్లీ:** కెనడా ఓపెన్-2025లో ప్రియాంషు రజావత్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో భారత్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ విజయం సాధించాడు. అలాగే మహిళల సింగిల్స్ విభాగంలో భారత్ యువ క్రీడాకారిణి వలిశెట్టి శ్రీయాన్షి గెలుపొందింది. కెనడా ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ తన స్వదేశీయుడు ప్రియాంషు రాజవత్‌పై మూడు గేమ్‌ల ఉత్కంఠభరితమైన విజయంతో పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. 2021 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ల రజత పతక విజేత, మేలో జరిగిన మలేషియా మాస్టర్స్‌లో రన్నరప్‌గా నిలిచిన శ్రీకాంత్, 53 నిమిషాల పాటు జరిగిన ఉత్కంఠభరితమైన ప్రారంభ రౌండ్ పోరులో 18-21, 21-19, 21-14 తేడాతో విజయం సాధించాడు. ఇంతకు ముందు రెండుసార్లు తలపడిన ఈ ఇద్దరు అకాడమీ సహచరుల మధ్య ఇది తీవ్రమైన పోరాటం. రాజవత్ రెండు సందర్భాలలోనూ విజయం సాధించాడు. అలాగే ఇద్దరు భారతీయ పురుషులు తలపడిన మరో పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో శంకర్ సుబ్రమణియన్ తొలి రౌండ్‌లో ఆయుష్ శెట్టిని ఓడించాడు. 23-21, 21-12 తేడాతో అద్భుతమైన విజయాన్ని సాధించాడు. మొదటి గేమ్ హోరాహోరీగా సాగింది, చివరికి సుబ్రమణియన్ 23-21తో ఆధిక్యంలో నిలిచాడు. ఇక మహిళల సింగిల్స్‌లో, యువ క్రీడాకారిణి వలిశెట్టి శ్రీయాన్షి 21-18, 22-20 తేడాతో ఉక్రెయిన్‌కు చెందిన ఏడో సీడ్ పోలినా భూరోవాను ఓడించింది. ఇరా శర్మ మరియు తాన్య హేమంత్ తమప్రారంభ రౌండ్ ప్రత్యర్థులను అధిగమించడంలో విఫలమవడంతో, మహిళల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 16 డ్రాలో ఉన్న ఏకైక భారతీయురాలుగా శ్రీయాన్షి నిలిచింది. మరోవైపు, టాప్ సీడ్ మిక్స్‌డ్ డబుల్స్ ద్వయం తనీషా క్రాస్టో మరియు ధ్రువ్ కపిల వరుసగా రెండో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించారు, స్పానిష్ జంట చేతిలో 15-21, 19,21 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయారు.




సత్యమేవ జయతే
Government of India

NSO INDIA Data for Development | 75 National Sample Survey Celebrating 75 years of NSS

భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ సేవలు మరియు హానికరమైన రోగాల వ్యాప్తి గురించి మదింపు

జాతీయ గణ సంఖ్యా పద్ధతిని పటిష్టం చేద్దాం

జాతీయ స్థాయి గణ సంఖ్యా కార్యాలయం (NSO), స్టాటిస్టిక్స్ మరియు ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ (MoSPI) మంత్రిత్వ శాఖ 2025 జనవరి నుంచి డిసెంబర్ వరకు కుటుంబ ఇంటింట ఆరోగ్య వ్యయంపై సర్వే నిర్వర్తిస్తోంది.

సేకరిస్తున్న సమాచారం:

- వ్యాధుల యొక్క రకం
- పొందిన వైద్య చికిత్స
- వైద్య చికిత్స మూల్యం & టీకాలు
- ఆరోగ్య బీమా యొక్క కవరేజ్
- ప్రసవానికి ముందు మరియు ప్రసవానంతర సంరక్షణ





CBC 39101/13/0001/2526

NSO సంబంధిత ఎన్యుమరేటర్‌లకు సహకరించి నిక్కచ్చి డేటాను అందజేయవలసినదిగా కుటుంబాలను కోరుతున్నాము.
అన్ని రిపోర్ట్‌లు/MoSPI యొక్క మైక్రోడేటాలో సర్వేలో పాల్గొనే కుటుంబాల యొక్క గుర్తింపు రహస్యంగా ఉంచబడుతుంది.

www.mospi.gov.in @GoIStats /GoIStats GoIStats Ministry of Statistics & PI


Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14